


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00 సంపుటి: 12 సంచిక: 209

SUNDAY Special ఆదివారం 20-10-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**నిఖత్‌తో ట్రయల్ ఫైట్‌కు సిద్ధమే..**

బాక్సింగ్ సమాఖ్య ఆదేశిస్తే నిఖత్‌తో పోటీపడతానన్న భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్.

– స్పోర్ట్స్‌లో



**ప్రియాంక ఈజ్ ద స్కై..**

సినిమాలు.. సీరియళ్లు..ప్రేమ.. పెళ్లి.. ఇప్పుడు 'ది స్కై ఈజ్ పింక్'.. ప్రియాంకతో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

– ఫ్యామిలీలో

# పరకాలలో 19 సెం.మీ. వర్షపాతం

**నేడు, రేపు ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు**

సాక్షి, హైదరాబాద్: ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రుతుపవనాలు ఒకేసారి విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు కురిశాయి. 24 గంటల్లో వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో ఏకంగా 19 సెం.మీ. కుండపోత వర్షం కురవగా.. అదే జిల్లా నర్సంపేటలో 15 సెం.మీ. అతి భారీ వర్షం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో 12 సెం.మీ., వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లిలో 11 సెం.మీ. చొప్పున భారీ వర్షం కురిసింది. మద్నూరులో 10 సెం.మీ., ఖానాపూర్, మాచిరెడ్డి, డిచ్‌పల్లిలలో 9 సెం.మీ., ఘన్‌పూర్, జుక్కల్, హన్మకొండలలో 8 సెం.మీ., చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ సీజన్ ప్రారంభమైన ఈ నెల 1వ తేదీ నుంచి శనివారం వరకు రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతంకన్నా 35 శాతం అధికంగా వర్షపాతం కురిసింది. మరోవైపు రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## ఈఎస్‌ఐ స్కాం నిందితురాలు పద్మ ఆత్మహత్యాయత్నం

- ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు
- పరిస్థితి విషమం

- 14లో

# బంద్ ప్రశాంతం

## చాలా చోట్ల డిపోలకే పరిమితమైన బస్సులు

- మధ్యాహ్నం వరకు తెరుచుకోని దుకాణాలు, పెట్రోల్ బంకులు
- స్వచ్ఛందంగా ప్రయాణాలు వాయిదా వేసుకున్న ప్రజలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన కార్మికులు, ప్రతిపక్షాలు
- ఆందోళనకారులను ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు
- భద్రత మధ్య నడిచిన 516 బస్సులు
- హైదరాబాద్‌లో పాక్షికంగా నడిచిన ఆటోలు, క్యాబ్‌లు



బంద్ సందర్భంగా ఖాళీగా కనపడుతున్న ఎంజీబీఎస్..

సాక్షి, హైదరాబాద్

ఆర్టీసీ సమ్మెలో భాగంగా కార్మిక సంఘాలు శనివారం నిర్వహించిన రాష్ట్ర బంద్ ప్రశాంతంగా ముగిసింది. కొన్ని చోట్ల మాత్రం చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. బంద్‌కు ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతివ్వడం, ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించి వీలైనంత వరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవడంతో బస్టాండ్లు సహా రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం వరకు దుకాణాలు మూతపడ్డాయి. పెట్రోలు బంకులు కూడా ఉదయం వేళ తెరుచుకోలేదు. శనివారం రాత్రి వరకు కేవలం 516 బస్సులే (5.7 శాతం) రోడ్డెక్కాయి. ఇందులో మూడు అద్దె బస్సులు కాగా మిగతావి ఆర్టీసీ బస్సులు. కొన్ని చోట్ల ప్రైవేటు బస్సులు పోలీసు రక్షణ మధ్య రోడ్డెక్కాయి. హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట, భూపాలపల్లి, మెదక్ తదితర ప్రధాన బస్టాండ్లు ఖాళీగానే కనిపించాయి. ఆటో కార్మిక సంఘాలు, క్యాబ్ డ్రైవర్ల సంఘాలు బంద్‌కు మద్దతిచ్చినప్పటికీ హైదరాబాద్‌లో ఆటోలు, క్యాబ్‌లు పాక్షికంగా తిరిగాయి. ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లలో మాత్రం ప్రయాణికుల రద్దీ నెలకొంది. సుమారు 3.5 లక్షల మంది మెట్రో రైళ్లలో రాకపోకలు సాగించగా మరో 1.7 లక్షల మంది ఎంఎంటీఎస్ సేవలను వినియోగించుకున్నారు. తప్పనిసరిగా ఇళ్ల నుంచి బయటకు వెళ్లిన ప్రయాణికుల నుంచి ప్రైవేటు వాహనదారులు ఇష్టారాజ్యంగా వసూలు చేశారు. తెలంగాణ బంద్‌ను దృష్టిలో ఉంచుకొని ఏపీఎస్ఆర్టీసీ బస్సులను రద్దు చేసింది.

**డ్యూటీలకు రాని తాత్కాలిక డ్రైవర్లు...**

సమ్మె నేపథ్యంలో గత పక్షం రోజులుగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్న వేలాది మంది

మిగతా 4వ పేజీలో ▶

## సమ్మె విరమిస్తేనే చర్చలు!

- కార్మిక సంఘాలకు తేల్చి చెప్పే యోచనలో ఆర్టీసీ ఎండీ
- హైకోర్టు ఆదేశంతో సంప్రదింపులకు పిలిచే ఆలోచన
- ఇప్పటికీ సీఎం కార్యాలయానికి అందని కోర్టు ఉత్తర్వు

- వివరాలు 4లో

## స్పందించకుంటే సమ్మె ఉధృతం

- ఆర్టీసీ జేఏసీ ప్రతినిధుల హెచ్చరిక
- రాష్ట్ర బంద్ సక్సెస్.. ప్రజలు స్వచ్ఛందంగా మద్దతిచ్చారు
- నేడు అన్ని పార్టీలతో భేటీ.. 23న ఓయూలో సభ!

- వివరాలు 4లో

విద్యుత్‌సౌధలో చర్చల సందర్భంగా ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో కార్మిక సంఘాల నేతలు



# ఆర్టిజన్లకు వేతన స్థిరీకరణ!

- తదుపరి వేతన సవరణ వర్తింపు
- డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్ తదితర అలవెన్సులు
- ఆర్టిజన్లు మరణిస్తే వారసులకు కారుణ్య నియామకాలు
- విద్యుత్ సంస్థలు, టీటఫ్ నేతల మధ్య ఒప్పందం
- చర్చలు సఫలమైనట్లు ప్రకటన.. ఆందోళన విరమణ

సాక్షి,హైదరాబాద్

ఆర్టిజన్లకు వేతన స్థిరీకరణ, సర్వీసు రిజిస్ట్రర్ల నిర్వహణ, తదుపరి పీఆర్సీ నుంచి వేతన సవరణ, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, కన్వేయన్స్, మెడికల్ తదితర అలవెన్సులు, కారుణ్య నియామకాలు వంటి సదుపాయాలు కల్పిస్తామని తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో, టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థల యాజమాన్యాలు అంగీకరించాయి. దీంతో వారితో జరిగిన చర్చ లు సఫలమయ్యాయని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్(టీటఫ్) ప్రకటించింది. వరంగల్‌లో ఈ నెల 23న తలపెట్టిన మహాధర్నాను విరమించుకుంటున్నట్లు ఫ్రంట్ చైర్మన్, కన్వీనర్ పద్మారెడ్డి, శ్రీధర్ పేర్కొన్నారు. తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు నేతృత్వంలో విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులు శనివారం విద్యుత్ సౌధలో టీటఫ్, తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులతో విడివిడిగా చర్చలు జరిగాయి. కార్మిక సంఘాల నాయకులు లేవనెత్తిన ప్రతీ డిమాండును అధికారులు పరిశీలించారు. న్యాయమైన, సాధ్యమైన అన్ని సమస్యలను పరిష్కరించడానికి అధికారులు అంగీకరించారు. స్టాండింగ్ ఆర్డర్స్ పేరుతో 23 వేలమంది ఆర్టిజన్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సర్వీస్ రూల్స్ పేరును ఆర్టిజన్ల సర్వీసు రూల్స్‌గా మార్చుతామని అధికారులు హామీ ఇచ్చారు. 1999–2004 మధ్య కాలంలో నియామకమైన కార్మికులు, ఉద్యోగులకు ఈపీఎఫ్‌కు బదులు జీపీఎఫ్ వర్తింపు వంటి ప్రధాన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ఈ అంశంపై సీఎం కేసీఆర్‌తో చర్చించి ఆయనను అంగీకరింపజేయిస్తానని ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు హామీ ఇచ్చినట్లు టీటఫ్ నేతలు పేర్కొన్నారు. ఇతర డిమాండ్లను కూడా

మిగతా 2వ పేజీలో ▶












# 'హుజూర్'లో మైకులు బంద్

## హుజూర్‌నగర్‌లో ముగిసిన ఉప ఎన్నిక ప్రచారం

- రేపటి పోలింగ్ ఏర్పాట్లలో అధికారులు
- 21న నియోజకవర్గ పరిధిలో సెలవు ప్రకటన



సాక్షి, హైదరాబాద్

హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం గడువు శనివారం సాయంత్రం ముగిసింది. సుమారు 20 రోజులుగా నియోజకవర్గంలో పోటాపోటీగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయా పార్టీల నేతలు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తిరుగుముఖం పట్టారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక బరిలో మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, కాంగ్రెస్, టీఆర్ఎస్ నడుమ ప్రధాన పోటీ నెలకొంది. బీజేపీ, టీడీపీతో పాటు పలు పార్టీలు, స్వతంత్రులు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య పద్మావతి పోటీ చేస్తుండటంతో.. ప్రచార పర్వంలో ఆయనే అంతా తానై వ్యవహరించారు. అలాగే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ నేతలు జీవన్‌రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక టీఆర్ఎస్ తరఫున పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి నేతృత్వంలోని 70 మంది ఇన్‌చార్జిలు శానంపూడి సైదిరెడ్డి పక్షాన ప్రచార, సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ నియోజకవర్గంలోనే మకాం వేసి ప్రచారం నిర్వహించారు. రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు కూడా ఉప ఎన్నిక ప్రచార బాధ్యత అప్పగించినా, ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఒక్కరోజు మాత్రమే పాల్గొన్నారు. టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 17న హుజూర్‌నగర్ బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉండగా,

మిగతా 2వ పేజీలో ▶

# బాలీవుడ్ ప్రముఖులతో ప్రధాని భేటీ

మహాత్ముని 150వ జయంత్యుత్సవాలను అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ శనివారం తన అధికార నివాసంలో ప్రముఖ బాలీవుడ్ నటులు, నిర్మాతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 2022లో జరుపుకునే 75వ స్వాతంత్ర్య వేడుకలపైనా చర్చించారు. 'గాంధీ ఎట్ 150' ఇతివృత్తంగా తీసిన వీడియోలను ప్రధాని విడుదల చేశారు. 1857 నుంచి 1947 వరకు జరిగిన స్వాతంత్ర్య పోరాటం, 1947–2022 కాలంలో దేశాభివృద్ధికి సంబంధించి స్ఫూర్తిదాయక కథనాలపై సినీ, టీవీ పరిశ్రమ దృష్టి సారించాలని వారిని కోరారు.

- వివరాలు 5లో









# మళ్లీ రో'హిట్'



భారత ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి చెలరేగిపోయాడు. దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో 164 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 117 పరుగులు చేసిన రోహిత్ అజేయంగా నిలిచాడు. సునీల్ గావస్కర్ తర్వాత ఒకే సిరీస్‌లో 3 సెంచరీలు చేసిన రెండో భారత ఓపెనర్‌గా గుర్తింపు పొందాడు. ఒకే సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు (17) బాదిన ఘనతను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు.

- స్పోర్ట్స్‌లో



## బ్రెగ్జిట్ ఆలస్యానికే ఓటు

- బ్రిటన్ పార్లమెంట్ నిర్ణయం... ప్రధాని బోరిస్‌కు ఎదురుదెబ్బ
- గడువుకే కట్టుబడతామని జాన్సన్ స్పష్టీకరణ

- వివరాలు 5లో

## 18 బిలియన్ డాలర్లు

- ఈ ఏడాది చివర్లోగా చేరుకోనున్న భారత్, అమెరికా రక్షణ వాణిజ్యం
- 'పెంటగాన్' అంచనా

- వివరాలు 5లో



epaper.sakshi.com

## క్లుప్తంగా...

### రాష్ట్రంలో మరో పామాయిల్ ఫ్యాక్టరీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు గోద్రెజ్ ఆగ్రో వెట్ లిమిటెడ్‌కు అనుమతిస్తూ శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో ప్రతిపాదించిన స్థలంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో అప్పారావుపేట, అశ్వారావుపేటల్లో పామాయిల్ ఫ్యాక్టరీలున్నాయి. గోద్రెజ్ ఆగ్రోస్ కింద ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఫ్యాక్టరీ పరిధిలో ఖమ్మం జిల్లాలో 7,500 ఎకరాల్లో పామాయిల్ తోటలున్నాయి. వాటి నుంచి పామాయిల్ గెలలను ఏపీకి తరలించడంలో దూరాభారం అవుతుండటం, పన్నులు వంటివి రాష్ట్రానికి రావడంలేదన్న చర్చ ప్రభుత్వ వర్గాల్లో నెలకొంది. తెలంగాణలోనూ మిల్లును నెల కొల్పాలని ప్రభుత్వం కోరడంతో కంపెనీ అంగీకరించింది. ఖమ్మం జిల్లా కొణిజర్లలో ఏర్పాటు చేయాలని అనుకున్నా, దీనిపై ఇంకా స్పష్టత రాలేదు.

### హుజూర్‌నగర్‌లో తొట్టతొలి ఉప ఎన్నిక..

సాక్షి, హైదరాబాద్: హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం ఉప ఎన్నిక జరుగుతోంది. 1957లో ఆవిర్భవించిన హుజూర్‌నగర్ అసెంబ్లీకి 1972 వరకు నాలుగు పర్యాయాలు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత అంతర్ధానమైన హుజూర్‌నగర్ అసెంబ్లీ 2009లో జరిగిన పునర్విభజనలో మరోమారు మనుగడలోకి వచ్చింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా ఉత్తమ్ గెలవడంతో హుజూర్‌నగర్ శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

### 76 నామినేషన్లు.. 28 మంది అభ్యర్థులు

హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో పలువురు స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. 76 మంది నామినేషన్లు వేయగా.. ఇందులో సరైన పత్రాలు లేవనే కారణంతో 45 మంది నామినేషన్లను ఈసీ తిరస్కరించింది. గడువు ముగిసిన తర్వాత 28 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ వంటి ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రధానంగా పోటీ పడుతున్నారు. 28 మంది అభ్యర్థు లు పోటీ చేస్తుండటంతో ప్రతీ పోలింగ్ బూత్‌లో రెండేసి బ్యాలెట్ యూనిట్లను ఉపయోగిస్తున్నారు.

### ఉత్తమ్ హ్యాట్రిక్...

పునర్విభజనలో భాగంగా 2009లో హుజూర్‌నగర్ అసెంబ్లీ ఏర్పాటైన నాటి నుంచి మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రస్తుత టీపీసీసీ అధ్యక్షుడు నల్లమాడ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పోటీ చేసి గెలుపొందారు. వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. ప్రస్తుత ఉప ఎన్నికలో ఆయన భార్య పద్మావతి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

### టీఆర్‌ఎస్ మూడో అభ్యర్థి..

2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి తొలిసారిగా టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రస్తుతం సూర్యాపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యుత్ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పోటీ చేశారు. 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ పోటీ చేసి రెండో స్థానానికి పరిమితం అయ్యారు. 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రవాస భారతీయుడు శానంపూడి సైదిరెడ్డి టీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ప్రస్తుత ఉప ఎన్నికలో సైదిరెడ్డి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

### కేటీఆర్‌తో ఐఏఎస్‌ల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల తెలంగాణకు కేటాయించిన 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారుల బృందం శనివారం మంత్రి కేటీఆర్‌తో భేటీ అయింది. రాష్ట్రంలో బాధ్యతలు చేపట్టనున్న అధికారులకు స్వాగతం పలికిన కేటీఆర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే పురోగతి సాధ్యమవుతుందన్నారు.

### 'హుజూర్'లో మైకులు బంద్

▶ మొదటి పేజీ తరువాయి

వర్షం మూలంగా చివరి నిమిషంలో రద్దయింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఈ నెల 4న నియోజకవర్గ కేంద్రంలో జరిగిన రోడ్‌షో నిర్వహించారు.

**బీజేపీ తరపున కిషన్‌రెడ్డి, లక్ష్మణ్..**

రాష్ట్రంలో బలోపేతమయ్యేందుకు శ్రమిస్తున్న బీజేపీ కూడా హుజూర్‌నగర్ ఉప ఎన్నికలను సీరియస్‌గా తీసుకుంది. పార్టీ అభ్యర్థి కోట రామారావు తరపున కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రచారం నిర్వహించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు మూలంగా పోటీకి దూరంగా ఉన్న తెలుగుదేశం కూడా ప్రస్తుత ఉప ఎన్నికలో పోటీ చేస్తుండగా, నందమూరి హరికృష్ణ కుమార్తె చుండ్రు సుహాసిని ప్రచారంలో పాల్గొన్నారు. 28 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో.. ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. ఇదిలాఉంటే సోమవారం జరిగే ఉప ఎన్నిక పోలింగ్‌కు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో సోమవారం హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు ప్రకటించింది.

# కోతకైనా సిద్ధం... సర్కారీ ఆస్పత్రి నిషిద్ధం!



- ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేందుకు గర్భిణుల భయాందోళన
- వసతుల లేమి, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న వైద్య వర్గాలు
- వైద్యులు సిజేరియన్ చేయడం లేదని ఆవేదన
- ఫలితంగా ప్రైవేటు ఆస్పత్రులవైపు మొగ్గు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలామంది గర్భిణులు సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని కొందరు గర్భిణులు సాధారణ ప్రసవాలకు అంగీకరించడంలేదు. పురుటి నొప్పుల సమయంలో పరిస్థితి చేజారిపోతున్నా సాధారణ ప్రసవమే చేద్దామని ప్రభుత్వ వైద్యులు చేస్తున్న ఒత్తిడే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కొన్నిచోట్ల ప్రసవాలు చేసే లేబర్ రూంలు సరిగా లేకపోవడం, కొందరు వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమని వైద్య వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపై గర్భిణులు, వారి కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో సాధారణ ప్రసవం చేస్తే ఏమైనా ఇబ్బంది అవుతుందేమోనని కొందరు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. దీన్నే ఆసరాగా తీసుకొని ప్రైవేటు ఆసుపత్రులు అవసరమున్నా లేకపోయినా సిజేరియన్ ద్వారానే బిడ్డను బయటకు తీస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితి ముఖ్యంగా జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనే కనిపిస్తుందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. సాధారణ ప్రసవాలు చేస్తే మంచిదేనని, కానీ గర్భిణులను మానసికంగా సిద్ధం చేయకుండా ఒత్తిడి చేస్తే ప్రయోజనం ఉండదని వైద్యులు అంటున్నారు. దీంతో ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణుల సంఖ్య ఒకట్రెండు శాతం తగ్గిందని వైద్య విధాన పరిషత్‌లోని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

**ఈ ఏడాది 3.83 లక్షల మంది జననం**

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3.83 లక్షల మంది శిశువులు జన్మించారు. అందులో 2.18 లక్షల (57%) మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో, 1.65 లక్షల (43%) మంది ప్రైవేటు ఆస్పత్రుల్లో జన్మించారు. గతేడాది ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీటి సంఖ్య ఒకట్రెండు శాతం అధికంగా ఉందని, ఇప్పుడు తగ్గిందని అంటున్నారు. ఇక ఇప్పటివరకు జరిగిన ప్రసవాల్లో మొత్తంగా 59% సిజేరియన్ ద్వారా ప్రసవాలు చేశారు. అం దులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 45%, ప్రైవే టు ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో 78% సిజేరియన్ ద్వారా జరిగినట్లు వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం ప్రభుత్వానికి పంపిన నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఖమ్మం, కరీం నగర్, వరంగల్ తది తర జిల్లాల్లో గర్భిణులు జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవం అంటేనే హడలిపోతున్నారని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడిం చాయి. సాధారణ ప్రసవానికి ప్రైవేటు ఆస్పత్రుల్లో కేవలం రూ. 25 వేలతో ముగించేయవచ్చు. అదే సిజేరియన్ ఆపరేషన్ చేసినందుకు, వారం పది రోజులపాటు ఆస్పత్రిలో అద్దె గదుల్లో ఉంచినందుకు ఆస్పత్రి స్థాయిని బట్టి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

# ఆర్టిజన్లకు వేతన స్థిరీకరణ!

▶ మొదటి పేజీ తరువాయి

సానుకూలంగా పరిష్కరించడానికి ప్రభాకర్‌రావు అంగీకరించారు. మిగిలిన డిమాండ్ల విషయంలో నవంబర్ మూడో వారంలో మరోసారి చర్చలు నిర్వహిస్తామని యాజమాన్యాలు హామీ ఇచ్చాయి. చర్చలు సఫలం కావటంతో కార్మిక సంఘాలు ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించాయి. చర్చల సందర్భంగా కుదిరిన ఒప్పందాలపై విద్యుత్ అధికారులు, కార్మికులు సంతకాలు చేశారు. చర్చల్లో ట్రాన్స్‌కో జేఎండీ చెరుకూరి శ్రీనివాసరావు, డిస్కంల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు, టీటీఫ్ చైర్మన్ నాయకులు సాయిబాబు, ఎంఏ వజీర్, ఎస్. ప్రభాకర్, ఎండీ అబ్దుల్ మజీద్, సాయిలు, టీఆర్‌వీకేఎస్ అధ్యక్షుడు జాన్సన్, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశ్ పాల్గొన్నారు.

**ఆర్టిజన్ల కష్టాలు శాశ్వతంగా తీరుతాయి: టీటీఫ్**

''చర్చలు సానుకూలంగా జరిగాయి. సమస్యలన్నీ పరిష్కరించడానికి అంగీకరించారు. ఆర్టిజన్ల కష్టాలన్నీ శాశ్వతంగా తీరబోతున్నాయి. సీఎం కేసీఆర్‌కు, ప్రభాకర్ రావుకు కృతజ్ఞతలు. సమస్యలు పరిష్కారం అయిన దృష్ట్యా ఆందోళనలు విరమించుకుంటున్నాం''అని టీటీఫ్ అధ్యక్షుడు పద్మారెడ్డి, కన్వీనర్ శ్రీధర్ ప్రకటించారు.

**కుటుంబ సభ్యుల్లా వ్యవహరిస్తాం**

''విద్యుత్ సంస్థల్లో యాజమాన్యం, కార్మికులు కుటుంబ సభ్యుల్లాగానే వ్యవహరిస్తున్నరు. అటు సంస్థ ప్రయోజనాలు, ఇటు కార్మికుల ప్రయోజనాలు, అంతిమంగా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడట్టానికి అందరూ సమష్టి బాధ్యతతో వ్యవహరిస్తారు. యూనియన్లు లేవనెత్తిన సమస్యల్ని పరిష్కరించాలని కేసీఆర్ మార్గనిర్దేశం చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సీఎం కేసీఆర్ ఆర్టిజన్లుగా సంస్థలో విలీనం చేశారు.''

– దేవులపల్లి ప్రభాకర్ రావు

**విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, టీటీఫ్ మధ్య కుదిరిన ఒప్పందంలోని ప్రధానాంశాలు**

- స్టాండింగ్ ఆర్డర్స్ పేరును ఆర్టిజన్ల సర్వీసు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌గా మార్పు
- ప్రస్తుతం ఆర్టిజన్లు పొందుతున్న కన్సాలిడేటెడ్ వేతనాన్ని సంరక్షిస్తూనే, ప్రస్తుత నోటిఫైడ్ స్కేల్‌కు అనుగుణంగా 2019 అక్టోబర్ 1 నాటి నుంచి ఆర్టిజన్లకు వేతన స్థిరీకరణ (పే ఫిక్సేషన్) చేస్తాం. కనీస స్కేలును వేతనం మించితే వారి వ్యక్తిగత అలవెన్సులుగా పరిగణించబడుతాయి.
- నోటిఫైడ్ స్కేల్ ప్రకారం వీడీఏకు బదులు డీఏ చెల్లింపు.
- హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ, వైద్య ఖర్చులు, రవాణా భత్యం, కార్పొరేట్ అలవెన్సుల వర్తింపు.
- ఆర్టిజన్లందరికీ సర్వీసు రిజిస్టర్లు తెరిచి సర్వీసు రిజిస్టర్‌లో వేతన స్థిరీకరణ ఎంట్రీలు నమోదు
- ఆర్టిజన్లందరికీ పే స్లిప్పులు జారీ
- పెయిడ్ హాలిడేలు వర్తింపు
- తదుపరి వేతన సవరణ కాలం నుంచి ఆర్టిజన్లకు సైతం వేతన సవరణ అమలు
- 2016 డిసెంబర్ 4 తర్వాత మరణించిన ఆర్టిజన్ల వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాల కల్పన.
- ఆర్టిజన్లపై క్రమశిక్షణ చర్యలను అధీకృత అధికారి మాత్రమే పరిశీలిస్తారు
- ఆర్టిజన్లకు వర్తింపజేసిన సదుపాయాలను రెస్కో ఉద్యోగులకు వర్తింపు
- ఆర్టిజన్లకు అంత్యక్రియల చార్జీలు చెల్లింపు
- ఈపీఎఫ్‌కు బదులు జీపీఎఫ్ అమలు చేసే అంశంపై చర్చించేందుకు టీటీఫ్ బృందాన్ని సీఎం కేసీఆర్ దగ్గరికి తీసుకెళ్లడం జరుగుతుంది.
- యూనియన్ల ప్రతిపాదనల మేరకు ఆర్టిజన్ల సర్వీసు రూల్స్‌కు సవరణలు చేయబడుతాయి.
- నవంబర్ మూడో వారంలో మిగిలిన డిమాండ్లపై చర్చలుంటాయి.

# నేరాభియోగాలున్నా పోలీస్ కాలేరు

- కింది కోర్టు క్రిమినల్ కేసు కొట్టేసినా కానిస్టేబుల్ పోస్టుకు అనర్హులే
- తీర్పు వెలువరించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నేరాభియోగాలు నిరూపణ కాకపోయినా, అభియోగాలు ఉన్నవారు కానిస్టేబుల్ వంటి పోస్టుల ఎంపికకు అర్హులు కాదని హైకోర్టు తీర్పు చెప్పింది. తనపై నమోదైన క్రిమినల్ కేసును కింది కోర్టు కొట్టేసిందని, అభియోగాల సమయంలో పోలీస్ నియామక మండలి రద్దు చేసిన తన కానిస్టేబుల్ ఎంపికను పునరుద్ధరించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్న రిట్ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. క్రిమినల్ కేసుల్లో జోక్యం చేసుకున్నట్లు నేరాభియోగాలు రుజువు కాలేకపోతే, ఆ వ్యక్తిపై మచ్చ లేనట్లు కాదని స్పష్టం చేసింది. ఇలాంటి నేపథ్యం ఉన్న వారి ఎంపికను రద్దు చేసే అధికారం పోలీస్ నియామక మండలికి ఉంటుందని న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు ఇటీవల తీర్పు చెప్పారు. ఇదే మాదిరిగా సుప్రీం కోర్టు కూడా తీర్పులు వెలువరించిందని వాటిని ఉదహరించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం, రాయకల్ గ్రామం చల్లిగడ్డ తండాకు చెందిన కర్రా కృష్ణకుమార్ అనే యువకుడు మెదక్ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా ఎన్నికయ్యాడు. అయితే తర్వాత ఒక క్రిమినల్ కేసులో పాత్ర ఉందని, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు ఉందని తెలుసుకుని అధికారులు కృష్ణకుమార్‌కు నోటీసు జారీ చేశారు. అతని వివరణతో సంతృప్తి చెందని అధికారులు ఎంపిక జాబితా నుంచి అతని పేరును తొలగించారు. పోలీస్ నియామక మండలి అతని కానిస్టేబుల్ ఎంపికను రద్దు చేసింది. తన తండ్రి, సోదరుడు తనపై పెట్టిన తప్పుడు కేసును గత ఏడాది కింది కోర్టు కొట్టేసిందని, తనకు కానిస్టేబుల్ పోస్టు ఇవ్వాలని చేసుకున్న దరఖాస్తును మండలి పట్టించుకోలేదని కృష్ణకుమార్ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. కింది కోర్టు అతనిపై ఉన్న క్రిమినల్ కేసును విచారించిందని, పోలీస్ కానిస్టేబుల్ వంటి పోస్టులకు ఎంపిక అయ్యే వారిపై నేరాభియోగాలు కూడా ఉండకూడదని హైకోర్టు తీర్పులో పేర్కొంది. పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2015 డిసెంబర్ 31న నోటిఫికేషన్ వెలువడింది. ప్రాథమిక, శరీర దారుఢ్య పరీక్షల్లోనే కాకుండా రాత పరీక్షలో కూడా పిటిషనర్ ఉత్తీర్ణుడయ్యాడు. ఎంపిక జాబితాలో అతని పేరు కూడా ఉంది. ఈ దశలో అతనిపై క్రిమినల్ కేసు ఉన్న విషయాన్ని తెలుసుకున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2017 జూన్ 14న అతని ఎంపికను రద్దు చేసింది. ఆ తర్వాత కింది కోర్టు అతనిపై క్రిమినల్ కేసు కొట్టేయడంతో తాను నిర్దోషినని, కానిస్టేబుల్ ఎంపికకు తిరిగి అవకాశం ఇచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన రిట్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చుతూ తీర్పు చెప్పారు.

### 21, 22 తేదీల్లో దక్షిణాది ప్రాంతీయ సదస్సు

**వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు**

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 'యూత్ ఆజ్ టార్చ్ బేరర్స్ ఆఫ్ బిజినెస్ ఓరియెంటెడ్ అగ్రికల్చర్ ఇన్ సౌత్ ఇండియా అన్న అంశంపై'ఈ నెల 21, 22 తేదీల్లో దక్షిణాది ప్రాంతీయ సదస్సును నిర్వహించనుందని ఆ వర్సిటీ ఉపకులపతి (వీసీ) ప్రవీణ్‌రావు తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సును రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రారంభించనున్నట్లు చెప్పారు. వ్యవసాయ సదస్సులో రాణించిన వారి అనుభవాలు, జ్ఞానాన్ని, ఈ రంగంలో అవకాశాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. వ్యవసాయంలో చేపట్టబోయే నవకల్పనలకు ఉన్న అవాంతరాలు, వాటిని అధిగమించడానికి ఉన్న మార్గాలపై కూడా ఈ సదస్సులో నిపుణులు ప్రజంటేషన్స్ ఇవ్వనున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో వ్యవసాయ వాణిజ్యంలోకి యువతను ఆకర్షించడం, ప్రోత్సహించడానికి కావాల్సిన రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం వంటి లక్ష్యాలతో ఈ సదస్సు జరుగుతుందని ప్రవీణ్‌రావు వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది వ్యవసాయ పట్టభద్రులు, వ్యవసాయ వాణిజ్యంలో ఉన్న కంపెనీల ప్రతినిధులు పాల్గొని వారి అనుభవాలను పంచుకుంటారు. సోమవారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి, ఇక్రిశాట్ డీజీ పీటర్ కార్‌బెర్రీ, ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆర్‌ఎస్ పరోడా పాల్గొంటారని తెలిపారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేటీఆర్

# స్వచ్ఛ సిరిసిల్ల లక్ష్యంగా ప్రణాళికలు

- ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత
- జిల్లా అభివృద్ధి పనులపై మంత్రి కేటీఆర్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛ రాజన్న సిరిసిల్ల జిల్లా లక్ష్యంగా పారిశుద్ధ్య ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఇప్పటికే జిల్లా బహిరంగ మల విసర్జిత రహిత హోదాను (ఓడీఎఫ్) సాధించామని, ఇదే స్ఫూర్తితో పారిశుద్ధ్య ప్రణాళికను అమలు చేయాలన్నారు. ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంకుడు గుంతల (సోక్ పిట్స్) నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. శనివారం హైదరాబాద్‌లో అధికారులతో జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి సమీక్షించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా సుమారు 90 వేల ఇళ్లలో వీటిని నిర్మించాలని ఆదేశించారు. వ్యక్తిగత, కమ్యూనిటీ, కామన్ ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు. సర్వే ద్వారా స్థలాలు గుర్తించి గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వీటి నిర్మాణం చేపట్టాలన్నారు. మండలం యూనిట్‌గా గ్రామ, వార్డుస్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థతో సంప్రదించి ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రఘునందన్‌రావును మంత్రి ఆదేశించారు. జిల్లా పరిధిలో జరుగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9 పనుల పురోగతిపై సమీక్షించిన మంత్రి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, వర్కింగ్ ఏజెన్సీలను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్ రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీలో పోలీస్ విజేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయిలో వివిధ ర్యాంకుల పోలీసు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలను వెస్ట్‌జోన్ ఐజీపీ శనివారం ప్రకటించారు. కేటగిరీ–1 కింద ఏఆర్ ఎస్సై, ఏఎస్సైలు, ఆ కింది ర్యాంక్ వారికి 'తెలంగాణ పోలీస్ వ్యవస్థలో గత ఐదేళ్లలో వచ్చిన సానుకూల మార్పులు'అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట పీఎస్ కానిస్టేబుల్ పి.అరుణకుమారి, మెదక్ జిల్లా కొడిపల్లి పీఎస్ కానిస్టేబుల్ వి.కవిత, నల్లగొండ జిల్లా హాలియా పీఎస్ ఏఎస్సై టి.రామచందర్‌రాజు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. కేటగిరీ–2 కింద ఫ్రెండ్లీ పోలీసింగ్ అంశంపై ఆర్ ఎస్సై, ఎస్సై కేటగిరీ, ఆపై స్థాయి అధికారులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పీఎస్సై బి.శ్వేత, నల్లగొండ జిల్లా సైబర్, ఐటీ సెల్ సీఐ సీహెచ్ సురేష్‌బాబు, సంగారెడ్డి జిల్లా హత్నూరా పీఎస్ ఎస్సై పి.శ్రీనివాస్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ మేరకు వెస్ట్ జోన్ ఐజీపీ శనివారం ఓ ప్రకటనలో వివరాలు తెలియజేశారు.

### మున్సిపాలిటీల్లో ఔట్‌సోర్సింగ్ కింద పబ్లిక్ హెల్త్ వర్కర్లు

సాక్షి, హైదరాబాద్: స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాలకు అనుగుణంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పబ్లిక్ హెల్త్ వర్కర్లను నియమించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. నగరపాలక సంస్థలు, పురపాలక సం ఘాల్లో పది వేల జనాభాకు 28 మంది చొప్పున ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమించుకునేలా ఆయా సంస్థలకు అధికారాలను కల్పిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మున్సిపాలిటీ ల్లో కార్మికుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉం చుకొని ప్రత్యేక యూనిఫామ్‌లను సమకూర్చా లని ఆదేశించారు. పురుషులకు నీలి రంగు చొ క్కా, ప్యాంటు, మహిళలకు నీలిరంగు చీరలను నిర్దేశించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. స్వీపర్లకు ఫేస్ మాస్క్, ఆప్రన్, డ్రైయిన్ క్లీనర్లకు బూ ట్లు, చేతి గ్లౌజ్‌లు, ఫేస్ మాస్క్, ఆప్రన్, ఎల క్ట్రీ షియన్లకు హెల్మెట్లు, బూట్లు, చేతి గ్లౌజ్, ఆప్రన్‌లు సమకూర్చాలని కమిషనర్లను ఆదేశించారు.

### మరోసారి ఎస్‌ఏ-1 షెడ్యూల్ మార్పు

**25 నుంచి నవంబర్ 1 వరకు**

సాక్షి, హైదరాబాద్: సమ్మెటివ్ అసెస్మెంట్–1 షెడ్యూల్ మరోసారి మారింది. ఈ నెల 25 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు మార్పు చేసిన షెడ్యూల్‌ను శనివారం విడుదల చేసింది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఇప్పటికే ఓ సారి షెడ్యూల్‌ను మార్చింది. నిర్దేశించిన తేదీ ల్లో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటిం చాలని స్పష్టం చేసింది.

# ఉద్యోగుల విభజన తర్వాతే కొత్త కొలువులు

- నూతన జోనల్ విధానంతో ప్రభుత్వ శాఖల్లో సమూల మార్పులు
- తొలుత జిల్లా, జోనల్, మల్టీ జోనల్ పోస్టుల పంపిణీ..
- ప్రతి ఉద్యోగికి 'ఆప్షన్'.. చాయిస్ ఆధారంగా కేటాయింపులు
- ఆ తర్వాతే ఖాళీల లెక్కలపై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాలకు మరికొంత సమయం వేచి చూడాల్సిందే. రాష్ట్రపతి ఉత్తర్వుల నేపథ్యంలో రాష్ట్రంలో కొత్త జోనల్ విధానం అందుబాటులోకి రావడంతో ఆ మేరకు శాఖల వారీగా ఉద్యోగుల విభజన పూర్తి కాకపోవడంతో ఖాళీలు, నియామకాలపై సందిగ్ధత వీడలేదు. దీంతో ఈ అంశం తేలేవరకు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశం లేదు. పాత జోనల్ విధానం ప్రకారం ఉద్యోగ నియామకాలన్నీ జిల్లా, జోనల్ స్థాయిల్లోనే జరిగేవి. నూతన జోనల్ విధానంతో ఇకపై జిల్లా స్థాయితో పాటు జోనల్, మల్టీ జోనల్ కేడర్‌లలో నియామకాలు చేపట్టాలి. కొత్తగా నియామకాలు చేపట్టాలంటే ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల కేడర్‌ను కొత్త జోనల్ విధానం ప్రకారం విభజించాలి. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో పాటు నూతన జోనల్ విధానంతో జోన్లు, మల్టీ జోన్లు సైతం ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు నియామకాల ప్రక్రియ సాధ్యం కాదని ఉద్యోగ నియామక బోర్డులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

**ఉద్యోగులకు ఆప్షన్లు**

తెలంగాణ ఏర్పాటు సమయంలో రాష్ట్రంలో 10 జిల్లాలు, 2 జోన్లు ఉండేవి. అనంతరం కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు కావడంతో ప్రస్తుతం రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కు పెరిగింది. అలాగే ఏడు జోన్లు, రెండు మల్టీ జోన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రతిపాదించడంతో రాష్ట్రపతి వీటికి ఆమోదం తెలిపారు. ఈక్రమంలో గతేడాది ఆగస్టు నుంచి రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అందుబాటులోకి వచ్చింది. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఆర్డర్ టు సర్వ్ పద్ధతిలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులను ప్రాథమికంగా విభజిం చారు. ఈమేరకు ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ.. ఉద్యోగుల విభజన పూర్తిస్థాయిలో జరిగితేనే ఎవరెవరు ఎక్కడ పనిచేస్తున్నారనే దానిపై స్పష్టత వస్తుంది. ఉద్యోగుల విభజన చేపట్టే క్రమంలో ప్రతి ఉద్యోగికి ఆప్షన్ ఇవ్వాలి. ఆప్షన్లు ఇచ్చిన తర్వాత ఉద్యోగి ఎంపిక చేసుకునే విధానం ప్రకారం విభజనకు ఆస్కారముంటుంది. ఉద్యోగుల విభజన విషయంలో ప్రభుత్వం పలుమార్లు శాఖాధిపతులతో చర్చలు జరిపినప్పటికీ స్పష్టమైన ఆదేశాలు మాత్రం ఇవ్వలేదు.




**విభజన పూర్తయితేనే ఖాళీలు..**

కొత్త జిల్లాలు ఏర్పాటై మూడేళ్లు పూర్తయింది. అయితే ఇప్పటివరకు ఆర్డర్ టు సర్వ్ పద్ధతిలో మెజార్టీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో ఎక్కువగా జిల్లా స్థాయి, జోనల్ స్థాయి ఉద్యోగులున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో జిల్లా వారీగా ఉద్యోగుల విభజన జరగాలి. అదేవిధంగా జోనల్, మల్టీ జోనల్ స్థాయిలో ఉద్యోగులకు కూడా పరిధిని ఫిక్స్ చేయాలి. ఈ విభజన ప్రక్రియ పూర్తయితే ప్రతి ఉద్యోగికి పరిధిపై స్పష్టత రావడంతో పాటు జిల్లాల వారీగా పోస్టుల సంఖ్య, పనిచేస్తున్న వారి లెక్కలు తేలుతాయి. దీంతో శాఖల వారీగా ఉద్యోగ ఖాళీలు, నేరుగా భర్తీ చేసేవెన్ని, పదోన్నతులతో నింపేవెన్ని అనే దానిపై స్పష్టత వస్తుంది.

### ఇదంజగత్



భలే ఐడియా! దాంతో మనమే ఓడిపోయాం!
వాళ్లూ ఓడిపోవాలనే కదా సార్!


సన్‌ఫ్లవర్ బొమ్మ వున్న
ప్రతి ఆయిల్ ప్యాక్ Freedom కాదు
వినియోగదారులారా జాగ్రత్త వహించండి!
అధిక లాభార్జనే ప్రధాన ధ్యేయంగా కలిగిన కొన్ని కంపెనీలు Freedom సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాక్ ను పోలిన ప్యాకింగ్ తో వినియోగదారులను మోసం చేయడమే గాక వారి ఆరోగ్యంతో ఆటలాడుతున్నాయి. అంతేకాక ఆ ప్యాకులలో నూనె తక్కువ తూకంలో కలిగి ఉండవచ్చు.
Freedom బ్రాండ్‌ను అనుకరిస్తున్న ఇతర ప్యాక్‌లు Freedom లోగో శైలిని, ప్యాక్ పై రంగులను, అక్షర శైలిని మరియు ఇతరత్రా రూపకల్పనా అంశాలకు అతి దగ్గరగా ఉంటాయి.
ప్యాక్ పై ఇతరత్రా అంశాలన్నీ Freedom ప్యాక్ వలె కనిపించినప్పటికీ, Freedom అనే బ్రాండ్ పేరును ఖచ్చితంగా చదివి మాత్రమే కొనుగోలు చేయుట ఉత్తమ మార్గం.
Freedom సన్‌ఫ్లవర్ ఆయిల్, వినియోగదారుల ఆనందం మరియు ఆరోగ్యం కొరకు నాణ్యత మరియు అనుభూతిని అందించుటలో నిరంతర అంకితభావంతో వ్యవహరిస్తూ లక్షలాది వినియోగదారుల హృదయాలను ఆకట్టుకుంది.
చట్టపరమైన నోటీసు
వంట నూనె తయారీ సంస్థలు, వ్యాపారులు మరియు ప్యాకేజింగ్ మెటీరియల్ సప్లయర్స్ మా Freedom బ్రాండ్ లోగోను గాని, డిజైను గాని, అక్షర శైలిని గాని, ప్యాక్ పై ఉన్న రంగుల కలయికను గాని అనుకరించడం, కాపీ చేయడం ద్వారా ప్యాకింగ్ మరియు విక్రయించుట జరిపిన యెడల చట్టపరమైన పరిణామాలను ఎదుర్కొనవలసి ఉంటుంది.
కొనే ముందు ప్యాక్ పై Freedom బ్రాండ్ పేరును సరిగ్గా గమనించండి.
Freedom
Refined Sunflower Oil
Freedom to eat. Freedom to enjoy.
ప్రజా హితార్థం జారీచేయువారు: జెమిని ఎడిబుల్స్ మరియు ఫ్యాట్స్ ఇండియా ప్రై ॥ లి ॥. రిజిస్టర్డ్ ఆఫీస్: "ఫ్రీడం హౌస్" 8-2-334/70&71, రోడ్ నం. 5, బంజారాహిల్స్ హైదరాబాద్ - 500 034, తెలంగాణ, ఇండియా. Ph: +91 40 6735 7857, Email: consumercare@gefindia.net
www.freedomhealthyoil.com | us on


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
ఈ పండుగకి సంతోషాలను అపారంగా ఇంటికి తీసుకురండి
హోండా
పండుగ ధమాకా
₹11,000#
వరకు ప్రయోజనాలు
Shine
LIMITED EDITION
Activa 5G
ఆకర్షణీయమైన ఫైనాన్స్
₹8,900^
వరకు ఆదా
FREE Joyclub
₹2,100##
వరకు ప్రయోజనాలు
తక్కువ
డౌన్ పేమెంట్
₹1,100*
Paytm Cashback
Get benefits worth up to
₹7000^^
Scan & Book!
ప్రముఖ క్రెడిట్ మరియు డెబిట్ కార్డ్స్ పైన EMI+
EMI
Powered by Pine Labs
ALWAYS WEAR A HELMET WHILE RIDING
Also available:
Annual Maintenance Contract**
Road Side Assistance**
Engine Health Assurance**
Follow us on
HDFC BANK
We understand your world
IndusInd Bank
IDFC FIRST Bank
L&T Financial Services
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
^Conditions apply, Rs 8,900 Savings calculated against the general market finance scheme considering the certain loan amount & may vary on the actual condition. ##Honda Joy Club Program is a paid loyalty program and only members can avail mentioned benefits with respect to program terms and conditions. For further details visit www.hondajoyclub.com or call 1800-532-2555 (Monday to Friday 9.30 am to 6.30 pm). #Benefits up to Rs 11,000 is the sum total of the savings on the finance scheme in row one and the Joy Club Benefits. *Rs 1,100 Low Down Payment Scheme is subject to financier policy and is available through preferred Finance partners at their sole discretion. ^^Paytm cashback offer is subject to Paytm and respective dealers terms and conditions at their sole discretion. +Contact your local HMSI dealership for details on EMI on leading credit & debit cards Powered by Pine Labs. The same is subject to availability at select dealerships. Multiple schemes & offers cannot be clubbed together, all the attached schemes and offers are applicable for a limited time period and can be withdrawn from the market without prior notice. All the schemes and offers are applicable on selected models or their variants. All the schemes and offers are available on selected dealerships. All disputes arising due to above shall be subject to exclusive jurisdiction of Gurugram, Haryana. Product shown in the picture may vary from the actual product available in the market. Accessories shown in the picture are not a part of the standard fitment. **Conditions Apply.
Honda Exclusive Authorized Dealerships: NALGONDA: Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; MIRYALGUDA: Mereddy Honda - 9618688155, 08689230666/7; KODAD: GHR Honda - 8143121988; HUZURNAGAR: Mereddy Honda - 8683242888, 9618002354; SURYAPET: Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; DEVARAKONDA: Sri Honda - 8688111770, 08691-252225; HALIA: Mereddy Honda - 9618688166, 08680278822; BHONGIR: Kushal Honda - 08685-243555, 9154308152; MOTHKUR: Kushal Honda - 08694-287999, 9949939988; THIRUMALGIRI: Saraswathi Honda - 08693-243243 9505243243; BIBINAGAR: Kakateeya Honda - 9949588911, 9121886912; CHITIYAL: Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; ALER: Kushal Honda - 9951208888; CHOUTUPPAL: Kushal Honda - 7330869678.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

## క్లుప్తంగా...

### క్యాబ్ డ్రైవర్లూ.. సమ్మె విరమించండి: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకుని ఓలా, ఉబర్ తదితర క్యాబ్ డ్రైవర్లు సమ్మెను విరమించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ తెలంగాణ స్టేట్ టాక్సీ డ్రైవర్స్ జాక్ శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. ఉబర్ కొత్తగా "commute' పేరుతో ప్రారంభించిన సేవలను హైదరాబాద్‌లో అనుమతించరాదని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం క్యాబ్ ఆపరేటర్లు, యాప్ ఆధారిత క్యాబ్ ఆపరేటర్ల నియంత్రణకు మార్గదర్శకాలు తేవాల్సి ఉందని జాక్.. తమిళిసైకి తెలియజేసింది. టాక్సీ డ్రైవర్ల విజ్ఞప్తిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తానని, ప్రజలకు మరింత అసౌకర్యం కలగకుండా వెంటనే సమ్మె విరమించాలని డ్రైవర్లకు గవర్నర్ సూచించారు.

### బంద్‌తో ఆసుపత్రుల్లో తగ్గిన ఔట్ పేషెంట్లు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సమ్మెలో భాగంగా తలపెట్టిన రాష్ట్ర బంద్ ప్రభావం ఆసుపత్రులపై పడింది. రవాణా వ్యవస్థ స్తంభించడంతో ఆసుపత్రులకు వచ్చే ఔట్ పేషెంట్ల సంఖ్య సగానికి సగం తగ్గింది. వివిధ జిల్లాల నుంచి బస్సులు తిరగకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య దాదాపు 50 నుంచి 70 శాతం తగ్గినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంచనా వేశాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి రోజువారీ 2 వేల వరకు ఓపీ నమోదు కాగా శనివారం మాత్రం దాదాపు 900 మాత్రమే ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. గాంధీ ఆసుపత్రికి రోజువారీ 2,500 వరకు ఓపీ ఉండాల్సి ఉంటే, అందులో 60 శాతం మేర రోగులు తగ్గినట్లు సమాచారం. అత్యవసర రోగులు మాత్రమే ఏదో ఓ ఏర్పాటు చేసుకొని ఆసుపత్రులకు వచ్చారు. జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో దాదాపు 70 శాతం మేర ఔట్ పేషెంట్లు తగ్గినట్లు అధికారులు అంచనా వేశారు. కొన్ని జిల్లాల్లో ఆసుపత్రుల్లోని సిబ్బంది కూడా సమ్మెకు మద్దతు ప్రకటించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపడంతో వైద్య సేవలు స్తంభించాయి.

### ఆర్టీసీ సమ్మెపై 25న ఎన్‌సీబీసీలో విచారణ

సాక్షి, న్యూఢిల్లీ, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమ్మెపై జాతీయ బీసీ కమిషన్ (ఎన్‌సీబీసీ) స్పందించింది. ఈ నెల 25న జాతీయ బీసీ కమిషన్ ముందు పూర్తి నివేదికతో హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరు వర్గాలకు నోటీసులు జారీ చేసింది. సమ్మె చేస్తున్న వారు సెల్ఫ్ డిస్మిస్ అయినట్లు ప్రభుత్వం పేర్కొనడంతో దాదాపు 20 వేల బీసీ కుటుంబాలు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పలువురు ఎన్‌సీబీసీని ఆశ్రయించారు. కమిషన్ సభ్యుడు ఆచారి తల్లోజు ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించారు.

### బంద్‌కు సంఘీభావంగా తెలంగాణ భవన్ ముట్టడి

సాక్షి, న్యూఢిల్లీ: ఆర్టీసీ కార్మికుల తెలంగాణ బంద్‌కు సంఘీభావంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌ను ముట్టడించారు. అయితే పోలీసులు ముందుగానే అక్కడికి చేరుకొని నిరసనకారులను అడ్డుకున్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు నారాయణ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు.

### సీఎంపై కోర్టు ధిక్కరణ కేసు పెట్టాలి: గూడూరు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని ఉన్నత న్యాయస్థానం చెప్పినా, బేఖాతరు చేయడం సీఎం కేసీఆర్ నియంతృత్వానికి నిదర్శనమని పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి విమర్శించారు. ఆయనపై కోర్టు ధిక్కార నేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనుభవం లేని డ్రైవర్ల కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల ఉసురు కేసీఆర్‌కు తగులుతుందని, నియంతృత్వ వైఖరి వీడకపోతే ప్రకృతి ఆయనను శిక్షిస్తుందని దుయ్యబట్టారు.

### దిష్టిబొమ్మల దహనానికి వామపక్షాల పిలుపు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా దిష్టిబొమ్మలు దహనం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష పార్టీల భేటీ జరిగింది. సమావేశంలో తమ్మినేని వీరభద్రం, వెంకట్ (సీపీఎం), చాడ వెంకట్‌రెడ్డి, బాల మల్లేశ్ (సీపీఐ), రమ, సూర్యం (న్యూ డెమోక్రసీ), సాధినేని వెంకటేశ్వర్లు, గోవర్ధన్ (న్యూ డెమోక్రసీ), సుధాకర్ (ఎంసీపీఐ) పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికులతో సీఎం చర్చలు జరపాలని నేతలు డిమాండ్ చేశారు.



బంద్ నేపథ్యంలో నిర్మానుష్యంగా మారిన ఖమ్మం గాంధీచౌక్ సర్కిల్



కరీంనగర్ టవర్ సర్కిల్‌లో దుకాణాల ముందు టైర్ కాల్చి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

# బంద్ ప్రశాంతం

▶ మొదటి పేజీ తరువాయి

తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు బంద్ నేపథ్యంలో శనివారం డ్యూటీలకు హాజరు కాలేదు. కనీసం ఐదు శాతం మంది కూడా డిపోలకు రాలేదు. కొన్ని ప్రాంతాల్లో వచ్చినా, డిపో గేట్ల వెలుపల ఆర్టీసీ కార్మికులు, విపక్షాల కార్యకర్తలు ఆందోళన చేపట్టడంతో వారికి బస్సులు ఇవ్వలేదు. ఉదయం 10 గంటల తర్వాత పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేయడం మొదలుపెట్టాక తాత్కాలిక డ్రైవర్లకు బస్సులు కేటాయించారు. చాలాచోట్ల వారు బస్సులు తీసుకొని రోడ్డెక్కగానే ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఆందోళనకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. కొన్ని చోట్ల తాత్కాలిక డ్రైవర్లను కిందకు దింపేసి బస్సు టైర్లలో గాలి తీసి నడవకుండా అడ్డుకున్నారు. కొన్ని చోట్ల అద్దాలను కూడా ధ్వంసం చేశారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ బస్ డిపో వద్ద బస్సును బయటకు తీసేందుకు ప్రయత్నించిన సైదిరెడ్డి అనే తాత్కాలిక డ్రైవర్‌పై ఆందోళనకారులు దాడికి పాల్పడ్డారు. మరికొన్నిచోట్ల ఒక్కో బస్సు వెంట రెండు, మూడు పోలీసు వాహనాలను ఎస్కార్టుగా ఇవ్వడంతో అవి మాత్రం వెళ్లాయి.

### ఎక్కడికక్కడ అరెస్టులు...

బస్టాండ్ల వద్ద ఆందోళనకారులను నిలువరించేందుకు పోలీసులు ఉదయం నుంచే ముందస్తు అరెస్టులు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్ వద్ద నిరసన తెలిపేందుకు వచ్చిన టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, టీటీడీపీ నేత ఎల్. రమణ, టీడీపీ మాజీ నేత మోత్కుపల్లి నర్సింహులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే అబిడ్స్‌లో నిరసనల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్, ఎమ్మెల్సీ రామచందర్‌రావు సహా ఆ పార్టీ నేతలను, చార్మినార్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, అంజన్‌కుమార్ యాదవ్ తదితరులను, హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వెలుపలికి రాగానే సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషాలను, బస్ భవన్ ముట్టడికి యత్నించిన సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం, సీపీఐ నేత బాల మల్లేశ్, న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావు తదితరులను ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంలోనే పోటు రంగారావు చేయి బొటన వేలు పోలీసు వ్యాన్ తలుపులో నలిగి కొంతభాగం ఛిద్రమైంది. దీంతో ఆయన్ను తొలుత ఉస్మానియాకు, ఆ తర్వాత ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

### డిపోలు, బస్టాండ్ల వద్ద నిరసనలు...

తెలంగాణ బంద్‌లో భాగంగా ఆర్టీసీ కార్మికులు అన్ని జిల్లాల పరిధిలో శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, విద్యార్థి సంఘాల నాయకులు ఉదయం 4 గంటలకే డిపోల ఎదుట బైఠాయించారు. దీంతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సూర్యాపేట, కోదాడ, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా డిపోల పరిధిలో ఒక్క బస్సు కూడా బయటకు రాలేదు. పరకాల జనగామ, మహబూబాబాద్ డిపోల నుంచి తెల్లవారుజామున మొదటి సర్వీస్‌ను పోలీసు ఎస్కార్ట్ సాయంతో పంపినా ఆందోళనకారులు వాటిని అడ్డుకున్నారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో 43 బస్సులు పోలీసుల ఎస్కార్ట్ సాయంతో రోడ్డెక్కాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ, న్యూడెమోక్రసీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. నిజామాబాద్–2 డిపోకు చెందిన మూడు బస్సులపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. నిజామాబాద్ నుంచి వరంగల్ వెళుతున్న బస్సుపై కొందరు రాళ్లు రువ్వడంతో అద్దం పగిలి ఓ ప్రయాణికుడి తలకు గాయమైంది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో దాదాపు 200 మంది బైక్ ర్యాలీ నిర్వహించారు. ముల్కనూరులో ఆర్టీసీ కార్మికులు సెల్‌టవర్ ఎక్కగా పోలీసులు వారికి నచ్చజెప్పడంతో కిందకు దిగారు. జనగామ జిల్లా బచ్చన్నపేటలో తాత్కాలిక డ్రైవర్, కండక్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. యాదగిరిగుట్టలో కార్మికులు వంటావార్పు చేపట్టారు. నల్లగొండలో మహిళా కార్మికులపట్ల కొందరు మహిళా కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించారని కార్మికులు ఆందోళనకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లి బైపాస్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై సికింద్రాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆందోళనకారులు అడ్డుకొని టైర్లలో గాలి తీసేశారు. దీంతో పోలీసులు ప్రయాణికులను ప్రైవేటు వాహనాల్లో పంపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో పరిధిలో 24 బస్సులు తిరిగాయి.



గాయపడిన పోటు రంగారావు



తమ్మినేనిని అరెస్టు చేస్తున్న పోలీసులు



చాడ వెంకటరెడ్డి



లక్ష్మణ్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు



చార్మినార్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క తదితరులు





అఖిలపక్షం ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆందోళనకారులు

# స్పందించకుంటే సమ్మె ఉధృతం

- సర్కారుకు ఆర్టీసీ జేఏసీ ప్రతినిధుల హెచ్చరిక
- రాష్ట్ర బంద్ సక్సెస్.. ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు పలికారు
- నేడు అన్ని పార్టీలతో భేటీ.. 23న ఓయూలో సభకు యోచన

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆదేశం ప్రకారం ప్రభుత్వం ఇప్పటికైనా తమతో చర్చల ప్రక్రియ ప్రారంభించాలని ఆర్టీసీ కార్మికుల జేఏసీ డిమాండ్ చేసింది. కోర్టు చెప్పినా స్పందించకపోవడం సరి కాదని పేర్కొంది. ప్రజలంతా ఈ వ్యవహారాన్ని గమనిస్తున్నారని, శనివారం రాష్ట్ర బంద్‌ను వారు విజయవంతం చేసిన తీరును ప్రభుత్వం గుర్తించాలని సూచించింది. శనివారం సాయంత్రం జేఏసీ ప్రతినిధులు అశ్వత్థామరెడ్డి, రాజిరెడ్డి, వీఎస్‌రావు, సుధ తదితరులు, కార్మిక ప్రతినిధులు సమావేశమై సమ్మె తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైన బంద్ ఇదేనన్నారు. దీనికి అన్ని విపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ జేఏసీలు, విద్యార్థి సంఘాలు, ఆటో, క్యాబ్ యూనియన్లు స్వచ్ఛందంగా మద్దతు పలికి విజయవంతం చేశాయన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకోవాలన్న తపన అందరిలో ఎంతగా ఉందో ఈ బంద్ ఫలితమే చెబుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని సూచించారు. బంద్‌తో సమ్మె ముగిసినట్టు కాదని, ప్రభుత్వంలో మార్పు రాకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరిస్థితి ఇలాగే ఉంటే రాజకీయ సంక్షోభం వస్తుందని తాము ఇప్పటికే చెప్పామని, రెండు రోజుల క్రితం హైకోర్టు కూడా అదే తరహా వ్యాఖ్యలు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలని సూచించారు. స్వాతంత్ర్య పోరాటం కూడా ముందు ఇతర రకాలుగానే మొదలైందని, ఇప్పుడు సమ్మె కూడా ప్రజల చేతుల్లోకి పోతే తీవ్ర రూపం దాలుస్తుందన్నారు. రాజ్యాంగ సంక్షోభం అన్న తమ మాటల్లో రాజకీయ కోణం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో, శాంతియుత వాతావరణంలోనే శనివారం తెలంగాణ బంద్ నిర్వహించామని, కానీ పోలీసులు అరెస్టులతో దమనకాండకు పాల్పడ్డారని, మహిళా కార్మికుల విషయంలో దురుసుగా వ్యవహరించారని, అక్రమంగా కేసులు నమోదు చేశారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యూ డెమోక్రసీకి చెందిన నేత చేతి బొటన వేలును పోలీసులు వ్యూహాత్మకంగానే విరిచేశారని ఆరోపించారు. అవసరమైతే తాము మరోసారి గవర్నర్‌ను కలసి పరిస్థితిని విన్నవిస్తామని, ఉద్యమ సెగ హైదరాబాద్ నుంచి పైస్థాయికి వెళ్లేలా చేస్తామని స్పష్టం చేశారు.



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి

### కార్మికుల పక్షాన పోరాడతాం: లక్ష్మణ్

కార్మికుల పక్షాన తాము నిరంతరం పోరాడతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. ఆర్టీసీ జేఏసీ బంద్ పిలుపులో భాగంగా శనివారం అబిడ్స్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 50 వేల ఆర్టీసీ కార్మికుల కుటుంబాలను కేసీఆర్ తన వైఖరితో రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. గత 15 రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు బీజేపీ పోరాడుతుందని తెలిపారు.

### ఆర్టీసీని కాపాడుకోవాలంటూ జనంలోకి..

ఆర్టీసీని పరిరక్షించుకోవాలని అంశాన్ని ప్రజల్లోకి చేరవేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన ప్రాంతాల్లో 'ఆర్టీసీని పరిరక్షించుకుందాం.. ప్రజా రవాణాను కాపాడుకుందాం' ప్లకార్డులతో ప్రజల వద్దకు వెళ్తామన్నారు. అలాగే ఆదివారం అన్ని పార్టీలతో సమావేశం కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 23న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బహిరంగ సభ నిర్వహించే యోచన కూడా చేస్తున్నామని వివరించారు. తమ పోరాటం జీతాల పెంపు కోసం కాదని తేల్చిచెప్పారు. కొత్త బస్సులు కొనాలని, ఖాళీలు భర్తీ చేసి బస్సుల సంఖ్య పెంచాలని, బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం కోర్టును కూడా తప్పుదారి పట్టిస్తోందని, అఫిడవిట్‌లో అబద్ధాలు చెబుతోందన్నారు.

# సమ్మె విరమిస్తేనే చర్చలు!

- కార్మిక సంఘాలకు తేల్చి చెప్పే యోచనలో ఆర్టీసీ ఎండీ
- హైకోర్టు ఆదేశంతో సంప్రదింపులకు పిలిచే ఆలోచన
- ఇప్పటికీ సీఎం కార్యాలయానికి అందని కోర్టు ఉత్తర్వు కాపీ

సాక్షి, హైదరాబాద్: మూడు రోజుల్లో ఆర్టీసీ కార్మికులతో చర్చల ప్రక్రియ పూర్తి చేయాలంటూ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో కార్మికులతో సంప్రదింపులకు ఆర్టీసీ ఎండీ కసరత్తు చేస్తున్నారు. అయితే, కార్మిక సంఘాలు ముందు భేషరతుగా సమ్మె విరమించుకుంటేనే చర్చలకు అవకాశం ఉంటుందనే సంకేతాలు ఇవ్వనున్నట్టు సమాచారం. ఇప్పటికే ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద ఓ సారి చర్చ జరిగింది. రెండు రోజుల క్రితం హైకోర్టు ఆర్టీసీ సమ్మెపై స్పందిస్తూ, కార్మిక సంఘాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సమ్మెలో ఉన్న వారు సెల్ఫ్ డిస్మిస్ అయినట్టేనని, భవిష్యత్తులో వారితో ఎలాంటి చర్చలు ఉండవని సీఎం తేల్చి చెప్పినప్పటికీ, హైకోర్టు మాత్రం కార్మికులతో చర్చించాల్సిందేనని ఆర్టీసీ ఎండీని ఆదేశించింది. తదుపరి వాయిదా ఈనెల 28న ఉన్నందున, అప్పటి వరకు చర్చల సారాంశాన్ని కోర్టుకు విన్నవించాల్సి ఉంది. హైకోర్టు ఎండీని నేరుగా ఆదేశించినందున, చర్చలు చేపట్టకుంటే కోర్టు ధిక్కరణ కిందకు వచ్చే అవకాశం ఉంది. దీంతో కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో శుక్రవారం రాత్రి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ ప్రగతి భవన్‌కు వెళ్లారు. కానీ ముఖ్యమంత్రి వేరే కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో భేటీ సాధ్యం కాలేదు. మరోవైపు, హైకోర్టు ఆదేశానికి సంబంధించిన పూర్తి పాఠం ప్రతి అధికారులకు అందలేదు. దానిని చూసిన తర్వాతనే స్పందించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు తెలుస్తోంది. శనివారం రాత్రి వరకు కూడా ఆ ప్రతి అందకపోవటంతో, ఇక సోమవారం అది అందిన తర్వాతే దానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, చర్చలు జరపాలంటూ కోర్టు స్పష్టంగా చెప్పినందున ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ మరో పక్క అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందు ఆందోళన విరమించాలని, సమ్మెలో ఉంటూ చర్చలకు రావటంలో అర్థం లేదని, అది పద్ధతి కూడా కాదని కార్మికులకు చెప్పాలని భావిస్తున్నారు. మరోవైపు బంద్‌కు వివిధ వర్గాల మద్దతు లభించడంతో ఆర్టీసీ కార్మిక సంఘాలు తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. సమ్మెను విరమించే అవకాశమే లేదని తేల్చి చెప్పాయి. కానీ దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని ప్రభుత్వం భావిస్తోంది. సమ్మెను విరమించాలంటూ హైకోర్టు కార్మిక సంఘాలకు కూడా చెప్పిన నేపథ్యంలో, మధ్యంతర ఆదేశం ఉత్తర్వు కాపీని క్షుణ్ణంగా పరిశీలించి, సమ్మె విరమణ విషయంలో కోర్టు అభిప్రాయాన్ని గట్టిగా వినిపించి విరమించేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై చర్చించేందుకు ముఖ్యమంత్రితో మంత్రి అజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఎండీ మరోసారి భేటీ అవనున్నారు. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలను బట్టి ప్రభుత్వం తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలుస్తోంది.

### విద్యాసంస్థలు ప్రారంభం కానుండటంతో..

సమ్మె నేపథ్యంలో పొడిగించిన సెలవులు కూడా ఆదివారంతో పూర్తి అవుతున్నాయి. దీంతో సోమవారం నుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుచుకోనున్నాయి. విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా బస్సుల సంఖ్య పెంచాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దీంతో ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతలవారీగా ఈడీలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. వీలైనంత ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని, అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కార్మికులతో చర్చల విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. వారి డిమాండ్లకు సంబంధించి ఏయే అంశాలపై ఎలా వ్యవహరించాలనే విషయంలో కూడా చర్చించినట్టు తెలిసింది.

### ప్రాజెక్టుల వివరాలన్నీ ఇవ్వాల్సిందే..

- కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇవ్వండి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన బోర్డులు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా, గోదావరి నదీ జలాలను వినియోగించుకుంటున్న కొత్త, పాత ప్రాజెక్టుల సమగ్ర నివేదికలన్నీ (డీపీఆర్) తమ ముందు ఉంచాల్సిందేనని కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు మరోమారు రాష్ట్రానికి స్పష్టం చేశాయి. రాష్ట్ర విభజనకు ముందు, విభజన తర్వాత చేపట్టిన ప్రాజెక్టుల నీటి వినియోగ వివరాలు చెబితేనే నీటి ప్రణాళిక ఖరారు సులువవుతుందని పేర్కొన్నాయి. ఈ మేరకు రెండు బోర్డుల తరపున సభ్య కార్యదర్శి పరమేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. తెలంగాణలో చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల సహా సీతారామ, తుపాకులగూడెం, ప్రాణహితతోపాటు దేవాదుల, ఎస్సారెస్పీ స్టేజ్–2, వరద కాల్వ తదితర ప్రాజెక్టుల వివరాలను కోరారు. గతంలో గోదావరి బేసిన్‌లో కాళేశ్వరం, తుపాకులగూడెం ప్రాజెక్టులు కొత్తగా చేపడుతున్నారని పేర్కొనగా తెలంగాణ దాన్ని ఖండించింది. పాత ప్రాజెక్టులకే రీ డిజైన్ చేస్తున్నామని, అవి ఏ మాత్రం కొత్త ప్రాజెక్టులు కావని తెలిపింది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పాలమూరు–రంగారెడ్డి, డిండి సహా కృష్ణా నదిపై నిర్మించాలనుకున్న, ప్రతిపాదిస్తున్న అన్ని కొత్త ప్రాజెక్టుల డిజైన్, ఆమోదాలతో కూడిన డీపీఆర్‌లను సమర్పించాలని ఆదేశించింది. భక్త రామదాస, తుమ్మిళ్ల, కల్వకుర్తి, నెట్టెంపాడు, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల వివరాలను కోరింది. రాష్ట్రాలు నిర్మించే కొత్త ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జల సంఘం, ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం నిబంధనలు రెండు తెలుగు రాష్ట్రాలకూ వర్తిస్తాయని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు స్పష్టం చేసింది. ఇక ఏపీ చేపట్టిన పురుషోత్తపట్నం, తాడిపూడి, పుష్కర, వెంకటనగరం, పట్టిసీమ, భూపతిపాలెం, ముసురుమల్లితో పాటు సీలేరు, శబరిపై చేపట్టిన హైడ్రో ప్రాజెక్టుల వివరాలు అందించాలని ఆ రాష్ట్రాన్ని కోరినట్లు తెలిసింది. కృష్ణా, గోదావరి బోర్డుల వర్కింగ్ మ్యాన్యువల్‌ను ఇరు రాష్ట్రాలు ఆమోదించాల్సి ఉంది. ప్రాజెక్టుల వివరాలు బోర్డుకు అందజేస్తేనే వాటి నియంత్రణపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుంది.

# అధినేతలేరి..?

- హరియాణా, మహారాష్ట్ర ప్రచారంలో పాల్గొనని సోనియా
- దూసుకెళ్లిన బీజేపీ • ముగిసిన ప్రచారం • రేపే పోలింగ్



## సోనియా భయపడ్డారా?

సోనియా గాంధీ ఈనెల 18న హరియాణాలో ఒక సభలో పాల్గొనాల్సి ఉండగా అనివార్యకారణాలతో సభకు రాలేదు. సోనియాకు వైరల్ జ్వరం వచ్చినందుకే రాలేదని రాహుల్ వివరణ ఇచ్చుకున్నారు. అయితే జ్వరం సంగతి పక్కన పెడితే బహిరంగసభకు సోనియా దూరంగా ఉండడానికి ఏఐసీసీ అనేక కారణాలను పేర్కొంది. అవినీతి ఆరోపణలను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉందని కొందరి వాదన. లోక్‌సభ ఎన్నికల్లో ఘోరపరాజయంతోపాటు ప్రజామోదం పెద్దగా లేకపోవడం, ఓటమి భయం, పార్టీలో అంతర్గత కలహాలు.. ఆ పార్టీ ప్రచారానికి బ్రేకులు వేసినట్టు పార్టీ వర్గాలు తమ అభిప్రాయం వ్యక్తం చేశాయి.

న్యూఢిల్లీ, సాక్షి ప్రతినిధి

ఒకనాటి కాంగ్రెస్ కంచుకోట హరియాణా, మహారాష్ట్రలలో మరోసారి అధికారం చేజిక్కించుకునేందుకు ప్రధాని మోదీ శ్రమిస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ ప్రచారపర్వంలో చాలా వెనుకబడింది. ఓ పక్క దేశ పాలనా బాధ్యతల్లో తలమునకలైన మోదీ మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుకోసం అలుపెరగకుండా శ్రమించారు. రెండు రాష్ట్రాల్లో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నా బీజేపీ చీఫ్ అమిత్‌షా, మోదీ ఇద్దరూ తమ అభ్యర్థుల గెలుపుకోసం ఏ చిన్న అవకాశాన్నీ విడిచిపెట్టలేదు. రెండు రాష్ట్రాల్లో కలిపి మోదీ మొత్తం 25 భారీ బహిరంగ సభల్లో పాల్గొనడమే అందుకు నిదర్శనం. ఈ రెండు రాష్ట్రాల ప్రచారంలో కాంగ్రెస్ విఫలమైందని చెప్పొచ్చు. గాంధీ కుటుంబం ఎదుర్కొంటోన్న అంతర్గత సంక్షోభానికి, పార్టీని పీడిస్తోన్న ఓటమి భయానికి కాంగ్రెస్ ప్రచారసరళి అద్దం పడుతోందంటున్నారు నిపుణులు. మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని ఉప ఎన్నికల ప్రచార అంకం ముగిసింది. ప్రచారంలో దూకుడు ప్రదర్శించిన బీజేపీ రెండు రాష్ట్రాల్లో అధికారపీఠం ఎక్కాలని చూస్తోంది. కాంగ్రెస్ మాత్రం హరియాణా, మహారాష్ట్ర ప్రచారంలో వెనకబడింది. సోనియా అసలు ప్రచారంలోనే పాల్గొనకపోతే, రాహుల్ నామమాత్రంగా పాల్గొన్నారు.




## స్థానిక నేతలు ఎక్కడ?

కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కెప్టెన్ అమరీందర్ సింగ్, అశోక్ గెహ్లోత్, కమల్‌నాథ్ లాంటి హేమాహేమీలు సైతం ఈ రాష్ట్రాల్లో కనీసం ఒక్కటంటే ఒక్క బహిరంగ సభను నిర్వహించలేదని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసిన ప్రియాంకా గాంధీ ఈ రెండు రాష్ట్రాల్లో ప్రచారంలో ఎక్కడా కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం రెండు రాష్ట్రాల ఎన్నికల్లో నామమాత్రంగా పాల్గొనడానికి స్థానిక నేతలే కారణమని భావిస్తున్నారు. ఢిల్లీ నేతలకంటే స్థానిక నేతలకే ఎన్నికల ప్రచారంలో అధిక ప్రాధాన్యతనివ్వాలని స్థానికనేతలు.. పార్టీ అధిష్టానానికి సూచించిన నేపథ్యంలోనే పెద్దలు ప్రచారంలో వెనకడుగువేసినట్టు తెలుస్తోంది. రాహుల్ రాష్ట్రంలో పర్యటించిన నేపథ్యంలో గాంధీ కుటుంబం ప్రచారంలో వెనుకబడిందన్న ప్రశ్నేలేదని పార్టీ సీనియర్ నేతలు వ్యాఖ్యానించారు. కాగా, పోలింగ్ రేపు జరగనుంది.

**మోదీ 25**
**రాహుల్ 7**

ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ 25 ర్యాలీల్లో పాల్గొని ఆయా రాష్ట్రాల్లో అధికారాన్ని తిరిగి చేపట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా మాత్రం ఒక్కటంటే ఒక్క బహిరంగ సభలో కూడా పాల్గొనకపోవడం ఎన్నికల్లో ఆ పార్టీ ఉదాసీనతకు అద్దంపడుతోంది. బీజేపీకే గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ బీజేపీ జాతీయ నాయకులు, ప్రధాని మోదీ రెండు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. రాహుల్ గాంధీ హరియాణాలో రెండు, మహారాష్ట్రలో ఐదు మొత్తంగా ఏడు బహిరంగ సభల్లో మాత్రమే పాల్గొన్నారు.



## బట్టలు ఫుల్.. బిల్లు నిల్..

విమానంలో వెంట తీసుకెళ్లే బ్యాగేజీ.. పరిమితికి మించి బరువుందని, అందుకు అదనపు రుసుము చెల్లించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో.. ఫొటోలో భలేగా పోజిస్తున్న ఈ అమ్మాయికి వెంటనే ఓ ఐడియా తళుక్కున మెరిసింది. వెంటనే బరువుగా ఉన్న లగేజీ బ్యాగ్‌ను తెరచి అందులో ఉన్న తన డ్రెస్‌లు అన్నింటినీ ఒకదానిపై మరోటి తొడుక్కుంది. ఇలా దాదాపు మూడు కేజీల బరువున్న డ్రెస్‌లను అదనంగా వేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారులకు కట్టాల్సిన 'అదనపు బరువు బిల్లు'ను తప్పించుకుంది. ఫిలిప్పీన్స్ దేశంలోని ఓ ఎయిర్‌పోర్ట్‌లో జరిగిందీ ఘటన.

# చిక్కడు.. దొరకడు.. ఎఫ్‌బీఐకి కూడా..

**న్యూయార్క్/న్యూఢిల్లీ:** ఆ హంతకుడిపై ఏకంగా రూ. 70లక్షల రివార్డు. దర్యాప్తులోనే మేటి అయిన అమెరికా అతని కోసం తెగ అన్వేషిస్తోంది. భారత్‌సహా నాలుగేళ్లుగా ప్రపంచాన్ని జల్లెడ పట్టినా అతడు దొరకలేదు. అమెరికా దర్యాప్తు సంస్థ (ఎఫ్‌బీఐ) టాప్ 10 వాంటెడ్ లిస్టులో స్థానం దక్కించుకున్నాడు. అతడే అహ్మదాబాద్‌కు చెందిన భద్రేశ్ కుమార్ పటేల్ (24). అమెరికాలోని డంకిన్ డోనట్స్ స్టోర్‌లో పనిచేస్తున్న అతడు తన భార్యను కిరాతకంగా చంపాడు. అనంతరం తప్పించుకొని పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్నాడు. 2015 ఏప్రిల్ 12న రాత్రి పనిచేస్తున్న అతడు తన భార్య ఫలక్ (21)తో కలిసి స్టోర్‌లోని కిచెన్‌కు



వెళ్లాడు. కాసేపటికి ఒక్కడే బయటకు వచ్చాడు. కొద్ది గంటల తర్వాత పోలీసులు ఆమె మృత దేహాన్ని కనుక్కొన్నారు. చాలా సార్లు కత్తితో పొడిచి మరీ హత్యచేశాడు. సీసీటీవీ ఫుటేజీల ప్రకారం అతడు ఓ ట్యాక్సీలో హోటల్‌కు వెళ్లి రాత్రంతా పడుకొని తెల్లవారాక మాయమయ్యాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అతడు కనిపించలేదు. ఎఫ్‌బీఐ అతడి కోసం అమెరికాలోనేగాక భారత్‌లోని గుజరాత్, మహారాష్ట్ర, ఢిల్లీలలో కూడా వెదికారు. ఇరుదేశాలు కలిసి చేసిన పెద్ద కేసు విచారణ ఇదే కావడం గమనార్హం.

## క్లుప్తంగా...

### అవసరమైతే అమిత్ షాతో మాట్లాడుతాం

**కోల్‌కతా:** బంగ్లాదేశ్ జలాల్లోకి అక్రమంగా వెళ్లినందుకు గురువారం అరెస్టయిన భారతీయ మత్స్యకారుడిని నిబంధనల ప్రకారం విడుదల చేస్తామని బంగ్లాదేశ్ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ పేర్కొన్నారు. ఇటీవల ఒక బీఎస్ఎఫ్ జవాన్‌ను ఓ బంగ్లాదేశీ సరిహద్దు భద్రతా బలగాలు తుపాకీతో కాల్చిచంపడం ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపబోదని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. అవసరమైతే దీనిపై తాను కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడుతానని వెల్లడించారు. 'బలగాల మధ్య సమన్వయలోపం కారణంగానే సరిహద్దు భద్రతాదళం(బీఎస్ఎఫ్) కానిస్టేబుల్ విజయ్ సింగ్ మరణానికి దారి తీశాయి' అని అసదుజ్జమాన్ చెప్పారు.

### ఆ పథకాలతో లాభమే

**నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ**



**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్ ధన్, ఆయుష్మాన్ భారత్, ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన వంటివి దీర్ఘకాలంలో లాభిస్తాయని నోబెల్ బహుమతి విజేత అభిజిత్ బెనర్జీ తెలిపారు. ప్రజలను ఈ పథకాలు కాపాడతాయని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన జన్ ధన్ యోజన ద్వారా ప్రజలు డబ్బును దీర్ఘకాలంపాటు దాచుకోగలరని చెప్పారు. శనివారం ఆయన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీని సందర్శించారు. 1983లో ఆయన ఇక్కడే తన మాస్టర్స్ పట్టా అందుకున్నారు. ఆయన చదువుతున్న కాలంలో రాజకీయాలపై చురుకుగా వ్యవహరించేవారు. కాలేజీ యాజమాన్యంతో తలెత్తిన వివాదంలో తీహార్ జైల్లో 10 రోజులు గడిపా రు. అనంతరం ఆ అభియోగాలను కొట్టేశారు.

### మార్స్‌పై సరస్సులు!

**హూస్టన్:** దాదాపు 300 కోట్ల సంవత్సరాల క్రితం అంగారక (మార్స్) గ్రహంపై ఉప్పునీటి సరస్సులు ఉండేవని ఓ అధ్యయనంలో వెల్లడైంది. మార్స్ గ్రహంపై ఉన్న వాతావరణం కారణంగా అవి ఎండిపోయాయని తెలిసింది. అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనం ప్రకారం.. 300 కోట్ల సంవత్సరాల క్రితం మార్స్‌పై ఉన్న గేల్ క్రేటర్ ప్రాంతంలోని సరస్సు ఏర్పడినట్లు పేర్కొన్నారు. 95 మైళ్ల వెడల్పు గల రాతి పరివాహకంగా ఇది ఏర్పడిందని, 2012 నుంచి నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్‌తో అన్వేషణ జరుగుతోందని వివరించారు.

### అనుకూల తీర్పు వచ్చినా వెంటనే మసీదు కట్టరాదు

**అయోధ్య:** రామ జన్మభూమి– బాబ్రీ మసీదు వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చినా ఆ ప్రాంతంలో మసీదు వెంటనే కట్టరాదని పలువురు ముస్లిం పిటిషనర్లు అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ప్రతివాదులుగా ఉన్న హాజీ మహబూబ్, ముఫ్తీ హసబుల్లా బాద్షాఖాన్, మహబూబ్ ఉమర్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుత పరిస్థితులను బట్టి, శాంతి సామరస్యాలను కాపాడటమే తమ లక్ష్యమన్నారు. అక్కడ మసీదు వెంటనే నిర్మించబోమని, ఆ స్థలం చుట్టూ సరిహద్దు గోడ నిర్మించి, వదిలేస్తామని అన్నారు. అయితే, ఇది తమ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, ఈ అంశంపై మత పెద్దలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# బాలీవుడ్ ప్రముఖులతో ప్రధాని భేటీ

- గాంధీజీ 150వ జయంత్యుత్సవాల ఏర్పాట్లపై చర్చ

**న్యూఢిల్లీ:** మహాత్ముని 150వ జయంత్యుత్సవాల సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ శనివారం తన అధికార నివాసంలో ప్రముఖ బాలీవుడ్ నటులు, నిర్మాతలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన.. 2022లో జరుపుకునే 75వ స్వాతంత్ర్య దిన వేడుకలపైనా చర్చించారు. 'గాంధీ ఎట్ 150' ఇతివృత్తంగా తీసిన వీడియోలను ప్రధాని విడుదల చేశారు. 1857 నుంచి 1947 వరకు జరిగిన స్వాతంత్ర్య పోరాటం, 1947–2022 కాలంలో దేశాభివృద్ధికి సంబంధించి స్ఫూర్తిదాయక కథనాలపై సినీ, టీవీ పరిశ్రమ దృష్టి సారించాలని వారిని కోరారు. కళారంగంలో చూపిసున్న సృజనాత్మకతను దేశంలో పర్యాటకరంగ అభివృద్ధికి ఉపయోగించాలని వారిని కోరారు. 'మీరెంతో అద్భుతంగా పనిచేస్తున్నారు. కళాకారులుగా మీ ప్రతిభ ప్రపంచమంతటికీ సుపరిచితం. మీ సృజనాత్మకతను మరింత విస్తరింపజేయడానికి ప్రభుత్వపరంగా చేతనైనంత సాయం అందిస్తా'అని ప్రధాని మోదీ వారికి తెలిపారని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల మామల్లపురంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో తాను జరిపిన సమావేశం అనంతరం ఆ ప్రాంతానికి పర్యాటకుల రాక పెరిగిందని తమిళనాడు సీఎంతెలిపారని ప్రధాని వారికి వివరించారు. 'కళాకారులుగా దేశానికి మేం చేయాల్సింది ఎంతో ఉంది. ప్రధాని మోదీ కూడా ఎన్నో పనులు చేస్తున్నారు'అని అనంతరం ఆమిర్ ఖాన్ అన్నారు. గాంధీజీని మరోమారు దేశానికి, ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని షారుఖ్ ఖాన్ అన్నారు. 'సినీ రంగానికి ప్రతినిధులుగా భావిస్తున్న మమ్మల్ని గాంధీజీ ఆదర్శాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చేందుకు భాగస్వాములుగా చేయడం ద్వారా మా బాధ్యత పెంచారు'అని దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్ అన్నారు. ప్రధాని మోదీతో భేటీ అయిన వారిలో బోనీ కపూర్ తదితరులు ఉన్నారు.



మోదీతో బాలీవుడ్ ప్రముఖులు ఆమిర్‌ఖాన్, షారూఖ్ ఖాన్, కంగనా రనౌత్ తదితరులు

### కాంగ్రెస్ నాశనం చేసింది

**హరియాణా ఎన్నికల ప్రచారంలో మోదీ**

**రెవారీ/ఎలెనాబాద్:** శనివారం ప్రధాని హరియాణాలోని రెవారీ, ఎలెనాబాద్‌లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. 'కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే తాత్కాలిక ఆర్టికల్ 370ని రద్దు చేయకుండా కాంగ్రెస్ 70 ఏళ్లు కాలయాపన చేసింది. 370 రద్దు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని విస్మరించింది. ఆ రాష్ట్రంలో పరిస్థితులు విషమిస్తున్నా పట్టించుకోకుండా నిద్ర పోయింది. ఇదే అదనుగా పాకిస్తాన్ కశ్మీర్‌లో ఒక భాగాన్ని ఆక్రమించుకుంది. సోదర భావాన్ని బోధించే సూఫీ సంస్కృతి నశించింది. ఇలా కాంగ్రెస్ విధానాలతో దేశం, కశ్మీర్ నాశనమయ్యాయి. ఢిల్లీలోని అప్పటి పాలకులు ప్రధాని పదవిని కాపాడుకునేందుకు మాత్రమే ప్రయత్నించారు' అని విమర్శించారు.

## భారత్ – అమెరికా రక్షణ వాణిజ్యం
# 18 బిలియన్ డాలర్లు

**వాషింగ్టన్:** భారత్–అమెరికాల మధ్య రక్షణ రంగ వాణిజ్యం రోజురోజుకూ పుంజుకుంటోంది. వచ్చే వారంలో భారత్ –అమెరికాల డిఫెన్స్ టెక్నాలజీస్ అండ్ ట్రేడ్ ఇనిషియేటివ్ (డీటీటీఐ) తొమ్మిదో సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం ముగిసేనాటికి రెండు దేశాల మధ్య రక్షణ రంగ వాణిజ్యం 18 బిలియన్ డాలర్ల (రూ. లక్షా ఇరవై ఏడువేల కోట్లు)కు చేరుకుంటుందని పెంటగాన్ వర్గాలు అంచనావేశాయి. ఇరుదేశాల మిలిటరీ టు మిలిటరీ సంబంధాలను బలపరిచేందుకు తాము కట్టుబడి ఉన్నామని అండర్ సెక్రటరీ ఆఫ్ డిఫెన్స్ ఫర్ అక్విజిషన్ అండ్ సస్టైన్‌మెంట్ ఎలెన్ ఎం లార్డ్ తెలిపారు. 2008లో ఇరు దేశాల మధ్య సున్నాగా ఉన్న వాణిజ్యం ఈ సంవత్సరం ముగిసేనాటికి 18 బిలియన్ డాలర్లకు చేరుకోవడం గొప్పవిషయమని తెలిపారు. గత ఆగస్టులో అమెరికా భారత్‌కు ట్రేడ్ అథారిటీ టైర్ 1 స్థాయిని ఇచ్చిందని, నాటో కూటమి దేశాలకు కాకుండా మరో దేశానికి ఈ గుర్తింపు ఇవ్వడం ఇదే ప్రథమమని తెలిపారు. వచ్చేవారం ఎలెన్ భారత్ చేరుకొని భారత డిఫెన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ అపూర్వ చంద్రతో భేటీ కానున్నారు.

# వర్షపు హోరు.. పవార్ హుషారు

**సతారా:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్(80) చేవతగ్గలేదని మరోసారి నిరూపించారు. జోరున వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా ప్రచారం ఆఖరి రోజైన శనివారం సతారాలో ఎన్నికల ర్యాలీ నిర్వహించడంతో ఆయనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా శరద్ పవార్ పార్టీ అభ్యర్థి ఎంపికలో తప్పు చేసినట్లు అంగీకరించారు. ఆయన మాట్లాడుతూ.. 'తప్పు చేస్తే ఒప్పుకోవాలి. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థి ఎంపికలో తప్పు చేశా. ఆ విషయాన్ని మీ ముందు అంగీకరిస్తున్నా. కానీ, ఆ తప్పును సరిదిద్దుకోబోతున్నందుకు సంతోషంగా ఉంది. 21న జరగనున్న పోలింగ్ కోసం సతారా ఓటర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు' అని పేర్కొన్నారు. 'ఈ ఎన్నికల్లో ఎన్‌సీపీకి వరుణ దేవుడి ఆశీస్సులు కూడా లభించాయి. వరుణుడి కటాక్షంతో సతారా ప్రజలు అద్భుతం సృష్టించబోతున్నారు'అని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న మిగతా నేతలంతా వర్షంలో తడవకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేసుకున్నప్పటికీ ఆయన ఆగలేదు. తడుస్తూనే ప్రసంగం కొనసాగించారు. పోరాట యోధుడు కాబట్టే శరద్ పవార్ 5 దశాబ్దాలుగా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని నెటిజన్లు ప్రశంసలు కురిపించారు. కాగా, సతారా ఉప ఎన్నికకుగాను ఛత్రపతి శివాజీ వంశీకుడు ఉదయన్ భోసాలేకు ఎన్‌సీపీ టికెట్ కేటాయించింది. ఆయన అనంతరం బీజేపీ తీర్థం పుచ్చుకుని, ఆ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.



జోరువానలో ప్రసంగిస్తున్న శరద్ పవార్



మహారాష్ట్రలోని షోలాపూర్‌లో స్వతంత్ర అభ్యర్థి మహేశ్ కోటె తరఫున ప్రచారంలో పాల్గొన్న తెలుగు సినీనటులు స్నేహ ఉల్లాల్, బ్రహ్మానందం

# బ్రెగ్జిట్ ఆలస్యానికే ఓటు

- బ్రిటన్ పార్లమెంట్ నిర్ణయం
- ప్రధాని బోరిస్ జాన్సన్‌కు ఎదురుదెబ్బ
- గడువుకే కట్టుబడతామని జాన్సన్ స్పష్టీకరణ



**లండన్:** బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. యూరోపియన్ యూనియన్(ఈయూ)తో కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందం జాప్యం కానుంది. ఈ మేరకు శనివారం జరిగిన చారిత్రక సమావేశం నిర్ణయం తీసుకుంది. బ్రెగ్జిట్ కోసం ఈయూతో కుదుర్చుకున్న గొప్ప ఒప్పందానికి మద్దతు తెలపాలంటూ ఈ అంశంపై ప్రధాని జాన్సన్ పార్లమెంట్‌లో చర్చను ప్రారంభించారు. ఇప్పటి వరకు బ్రెగ్జిట్ తర్వాత అవసరమయ్యే చట్టాలు రూపొందనందున ఈ గడువును 31వ తేదీ నుంచి పొడిగించాలని శనివారం అర్ధరాత్రిలోగా ఈయూను కోరాలంటూ కన్జర్వేటివ్ పార్టీ ఎంపీ ఆలివర్ లెట్విన్ సవరణ తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఈ తీర్మానానికి అనుకూలంగా 322 మంది ఎంపీలు, వ్యతిరేకంగా 306 ఎంపీలు ఓట్లేశారు. ప్రధాని కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందానికి ఎంపీల మద్దతు లేదనేందుకు ఈ ఫలితాలే నిదర్శనమని లేబర్ పార్టీ నేత కార్బైన్ వ్యాఖ్యానించారు. ప్రధాని జాన్సన్ మాట్లాడుతూ.. 'ఈ ఓటింగ్ అర్థరహితం. అక్టోబర్ ఆఖరు కల్లా బ్రెగ్జిట్ అమలు చేయాలన్న నిర్ణయానికే తాను కట్టుబడి ఉంటానని, తాజా ఓటింగ్ మేరకు ఈయూను గడువు పొడిగించాలని కోరబోను'అని స్పష్టం చేయడం గమనార్హం. బ్రెగ్జిట్‌తో తాము కుదుర్చుకున్న ఒప్పందాన్ని వచ్చే సోమవారం సభలో ప్రవేశపెట్టి, మంగళవారం ఓటింగ్‌కు కోరతామన్నారు. కాగా, పార్లమెంట్‌లో చర్చ జరుగుతుండగా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న ప్రజలు ప్రధాని జాన్సన్ ఈయూతో కుదుర్చుకున్న ఒప్పందంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, శనివారం జరిగిన 'ప్రతినిధుల సభ' సమావేశాన్ని విశ్లేషకులు 'సూపర్ సాటర్‌డే సెషన్'అని అంటున్నారు. ఇలాంటి అసాధారణ సమావేశం 1982లో మార్గరెట్ థాచర్ ప్రధానిగా ఉండగా ఫాక్‌ల్యాండ్ యుద్ధంపై ఓటింగ్ కోసం ఏర్పాటైంది.

MRF

WALK-IN INTERVIEW

MRF Limited requires fresh / experienced Supervisors for its manufacturing plants. The company offers challenging career and growth opportunities with a competitive compensation package commensurate with qualification and experience.

| Qualifications | Required Disciplines | Relevant Experience | Age |
|---|---|---|---|
| Graduates | Production / Quality & Technical Depts. - B.Sc. - Any Discipline | Up to 2 Years | Less than 23 Years |
| Diploma | Maintenance Department - Mechanical / Electrical / Instrumentation | 2 - 3 Years | Less than 25 Years |

Candidates with experience in process industries like chemical, glass, cement, fertilizers & ferrous and non-ferrous will be considered.

Candidates with 50% marks and meeting the above criteria may walk in to attend the preliminary screening (Assessment Tests & Group discussion) and bring a. Resume b. Photocopies of Educational testimonials at one of the following Venues:

| Location / Venue | Date & Time | Required Candidates (Highest Qual.) |
|---|---|---|
| VIJAYAWADA / P.B. Siddhartha College of Arts and Science, A S Rama Rao Road, Mogalrajapuram, Siddhartha Nagar, Vijayawada - 520 010. | 22nd Oct 2019 - Tuesday - 9 am | B.Sc. |
| | 23rd Oct 2019 - Wednesday - 9 am | DME / DEEE & Dip in Instru. |
| HYDERABAD / Avanthi PG College, Musarambagh, Dilsukhnager, Near Vijaya Diagnostic Centre Hyderabad - 500 036. | 24th Oct 2019 - Thursday - 9 am | B.Sc. |
| | 25th Oct 2019 - Friday - 9 am | DME / DEEE & Dip in Instru. |
| WARANGAL / Chaitanya Degree College (Autonomous) Kishanpura, Hanamkonda, Warangal - 506 001. | 30th Oct 2019 - Wednesday - 9 am | B.Sc. |
| | 31st Oct 2019 - Thursday - 9 am | DME / DEEE & Dip in Instru. |
| VISAKHAPATNAM / Dr. Lankapalli Bullayya College, Block - 8, Placement Cell, Resapuvanipalem, Dwaraka Nagar, Visakhapatnam - 530 013. | 5th Nov 2019 - Tuesday - 9 am | B.Sc. |
| | 6th Nov 2019 - Wednesday - 9 am | DME / DEEE & Dip in Instru. |

Other candidates (Eg. Engineering / MBA) are requested to apply through our website www.mrftyres.com/careers

epaper.sakshi.com

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, తిథి బ.సప్తమి రా.2.48 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం ఆరుద్ర ప.3.25 వరకు, తదుపరి పునర్వసు వర్జ్యం రా.3.04 నుంచి 4.36 వరకు దుర్ముహూర్తం సా.4.00 నుంచి 4.46 వరకు, అమృతఘడియలు... ఉ.5.44 నుంచి 7.13 వరకు.

**సూర్యోదయం** : 5.56
**సూర్యాస్తమయం** : 5.34
**రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు

పీయుష్ గోయల్ (కేంద్ర మంత్రి)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

"గుడ్ ఈవెనింగ్ మిస్టర్ మినిస్టర్, మీ ఒపీనియన్ కావాలి" అన్నాడతను నా క్యాబిన్‌లోకి వచ్చీ రావడంతోనే!!

అతడిని ఎక్కడో చూసినట్లుంది. అది కూడా గడ్డంతో చూసినట్లుంది. నా క్యాబిన్‌లోకి వచ్చినప్పుడు మాత్రం గడ్డం లేదు.

"కూర్చోండి ప్లీజ్! ఇఫ్ ఐయామ్ నాట్ మిస్టేకెన్.. అండ్.. అన్‌లెస్ ఐయామ్ వెరీమెచ్ మిస్టేకెన్.. మీకు గడ్డం పెంచే అలవాటు ఉంది కదా" అన్నాను.

నవ్వాడు. "పెంచే అలవాటూ ఉంది, ఉంచుకోని అలవాటూ ఉంది. ఆ కారణంగానే మీరు నన్ను వెంటనే గుర్తుపట్టలేక పోవడం సహజమే కానీ, మిమ్మల్ని విమర్శించిన వ్యక్తిని కూడా మీరు పోల్చుకోలేక పోవడంలో కొంత సహజత్వమేదో లోపించినట్లుగా ఉంది మిస్టర్ మినిస్టర్! విమర్శించిన మనిషిని ఎవరూ తమ కెరీర్‌లో మర్చిపోలేరు కదా.." అన్నాడు.

"మీరు నన్ను విమర్శించారా?! ఎవరికైనా నన్ను విమర్శించే అవసరం వచ్చేంత పెద్ద కెరీర్‌లో నేనేమీ లేనే!!" అన్నాను ఆశ్చర్యపోతూ.

"అఫ్‌కోర్స్ మిస్టర్ మినిస్టర్.. మిమ్మల్ని నేను మీ ఎదురుగా విమర్శించలేదు. మీ పక్కనా విమర్శించలేదు. నా మానాన నేను మిమ్మల్ని ట్విట్టర్‌లో విమర్శించుకున్నాను. అది మీ దృష్టికి వచ్చే ఉంటుంది. నా ట్విట్టర్ అకౌంట్ లోని ఫొటోలో నేను గడ్డంతో ఉన్నాను. మీరు నన్ను మరింత తేలిగ్గా గుర్తుపట్టడం కోసం ఆ గడ్డంతోనే మీ దగ్గరకు వచ్చేవాడినే కానీ, ఉదయమే షేవ్ చేసుకున్నాను. షేవ్ చేసుకున్నాక తెలిసింది నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ తన పుస్తకావిష్కరణ కోసం యు.ఎస్. నుంచి ఇండియా వస్తున్నారని!!" అన్నాడు.



అప్పుడు గుర్తుకొచ్చాడతను!

"రవీ నాయర్.. రైట్?!" అన్నాను.

చిరునవ్వుతో తల ఊపాడు.

"మిస్టర్ నాయర్.. మీరు మీ ట్విట్టర్‌లో నన్నొక్కర్నే విమర్శించలేదు. మా టీమ్ మొత్తాన్నీ విమర్శించారు. మేమెప్పుడూ మాకు సంబంధం లేని వాటి గురించే ఎక్కువగా మాట్లాడుతూ ఉంటామని కదా మీరు విమర్శించారు. హోంమంత్రి చరిత్ర గురించి, ఆర్థికమంత్రి అర్బన్ నక్సలిజం గురించి, మానవ వనరుల మంత్రి అంతర్జాతీయ వాణిజ్యం గురించి మాట్లాడతారని విమర్శించారు. ఆ వరసలోనే నన్నూ విమర్శించారు.. వాణిజ్యమంత్రి గురుత్వాకర్షణ శక్తి గురించి మాట్లాడతారని. సో ఫన్నీ యు నో! అది మీ విమర్శ కాదు. మీ అబ్జర్వేషన్. చెప్పండి ఏ విషయం మీద మీకు నా ఒపీనియన్ కావాలి ఇప్పుడు?" అన్నాను.

"అది కూడా మీకు సంబంధం లేని విషయం మీదే మిస్టర్ మినిస్టర్" అన్నాడు.

పెద్దగా నవ్వాను. "నాకు సంబంధం లేనిదైతేనే నేను చక్కగా చెప్పగలనని కదా మిస్టర్ నాయర్ మీ నమ్మకం. అడగండి. మీ జర్నలిస్టులకు అన్నీ కావాలి. మేము మాత్రం మా శాఖల గురించే మాట్లాడాలి" అన్నాను.

తనూ నవ్వాడు. "నేనిప్పుడు మిమ్మల్ని అడగబోతున్నది కష్టకాలపు ఆర్థిక దరిద్రాల నుంచి దేశాన్ని గట్టెక్కించేందుకు అభిజిత్ బెనర్జీ రాసిన పుస్తకం మీద మీ ఒపీనియన్ గురించి. చెప్పండి. అలాంటి ఒక పుస్తకం ఈ దేశానికి అవసరమనే మీరు భావిస్తున్నారా?" అని అడిగాడు.

అతడి వైపు చూశాను.

"భారతదేశ ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత ప్రపంచంలో ఇద్దరికి మాత్రమే ఉంది మిస్టర్ నాయర్. ఒకరు నిర్మలా సీతారామన్. ఈ దేశ ఆర్థికశాఖ మంత్రి. ఇంకొకరు నిర్మలా బెనర్జీ. అభిజిత్ తల్లి. ఆమెకున్న అర్హత కూడా అభిజిత్ తల్లి అవడం కాదు. కొడుకు అమెరికా పౌరుడిగా మారినప్పటికీ ఆమె ఇంకా ఈ దేశ పౌరురాలిగానే ఈ దేశంలోనే ఉండిపోవడం.." అన్నాను.

లేని గడ్డాన్ని బరుక్కుంటూ నా వైపే చూస్తుండిపోయాడు రవీ నాయర్.

# తలయో... తోకయో!

## జనాంతికం


వర్ధెల్లి మురళి

లైట్స్ ఆన్..

కెమెరా... యాక్షన్...

''మోదీ, నేనూ మంచి స్నేహితులం. మా మధ్య ఎటువంటి విభేదాలు లేవు...''

కట్..., సార్ డైలాగ్ అతకడం లేదు. మార్చేద్దాం.

కొంచెం స్క్రిప్టును అర్థం చేసుకుని రాయండి.

ఓకే, టేక్ టూ.. షాట్ రెడీ.

''నరేంద్ర మోదీతో నాకెటువంటి విభేదాలు లేవు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే అప్పుడు విభేదించా...''

కట్. ఓకే . థాంక్యూ సర్. బాగా వచ్చింది.

రాష్ట్ర ప్రయోజనాలకోసం ఇకముందు కూడా వ్యతిరేకిస్తూనే వుంటా... అని మరో డైలాగ్ లింక్ చేద్దాం సార్... సిచువేషన్ బాగా పండుద్ది.

స్టోరీ లైన్ తెలియకుండా సలహాలివ్వకండి ప్లీజ్. ఇక్కడ సీన్ కట్ చేస్తాం. మరోచోట ఓపెన్ చేస్తాం. ఇంకోచోట ఈ డైలాగ్‌కు లింకు కలుపుతాం.

అర్థమైంది సార్.

* * * * *

తెలుగుదేశం పార్టీని స్థాపించిన కీర్తిశేషులు ఎన్.టి. రామారావు సినిమా రంగంలో ఒక మహానటుడని ఎవరూ పరిచయం చేయవలసిన అవసరం లేదు. మూడు వందల సినిమాల్లో విభిన్న షేడ్స్ వున్న వందలాది పాత్రలను ఆయన పోషించాడు. మనకు తెలిసిన రామాయణ, మహాభారత కథల్లోనే అనేక పాత్రల్లో ఆయన కనువిందు చేశాడు. రామాయణ కథానాయకుడైన రాముడిగానూ, ప్రతినాయకుడు రావణుడిగానూ అద్భుతంగా నటించి, అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పాడు. ఇరవై నాలుగు సార్లు శ్రీకృష్ణుని వేషం వేసి, నిజంగా కృష్ణుడే దిగివచ్చినా జనం నమ్మలేని స్థాయిలో జీవించారు. రారాజు సుయోధనుడిగా, రాధేయుడు కర్ణునిగా, భీముడిగా, అర్జునుడిగా చిరకాలం గుర్తుండిపోయేలా నటించాడు. నలభయ్యేళ్లు నిండని వయసులో ఎనభయ్యేళ్లు దాటిన భీష్ముని పాత్రను నభూతో నభవిష్యతి అన్న రీతిలో పోషించి మెప్పించాడు.

కానీ, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత మాత్రం ఎన్టీఆర్ వేషాలు మార్చలేకపోయాడు, స్వభావాన్ని మార్చుకోలేకపోయాడు. సిద్ధాంతాలను ఏమార్చలేకపోయాడు. ప్రజా జీవితంలో ఒకే పాత్రకు పరిమితమయ్యాడు. తెలుగువాడి ఆత్మగౌరవం కోసం పార్టీ పెడుతున్నానని ప్రకటించాడు. పేదవాడి ఆకలి మంటల్లో పుట్టింది నా పార్టీ అన్నాడు. తుదివరకు అదే పంథాలో కొనసాగాడు. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే తన ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసినప్పుడు జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో కలిసి వచ్చినందుకు కృతజ్ఞతగా కమ్యూనిస్టులతోపాటు బీజేపీకి కూడా కొన్ని సీట్లను ఎన్టీఆర్ కేటాయించారు. ఇందిరాగాంధీ హత్యానంతరం సాను భూతి ప్రభంజనంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ రెండేసీట్లు సాధించింది. అందులో ఒకటి అప్పుడు ఎన్టీఆర్ కేటాయించిన హన్మకొండ నియోజకవర్గం. కాంగ్రెస్ దిగ్గజం పీవీ నరసింహారావుపై బీజేపీ తరపున పోటీచేసిన జంగారెడ్డి గెలిచారు. సోషలిస్టు భావజాల ప్రభావంతో పరిపాలన చేసిన ఎన్టీఆర్ కమ్యూనిస్టుల మైత్రిని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. తన ప్రధాన శత్రువైన కాంగ్రెస్ పార్టీతో ఎప్పుడూ రాజీపడలేదు.

'ఉదర పోషణార్థం బహుకృత వేషం' అన్నారు. వెన్నుపోటుతో ఎన్టీరామారావును తొలగించి అధికారంలోకి వచ్చిన ఆయన అల్లుడు చంద్రబాబునాయుడు తన వ్యక్తిగత స్వార్థం కోసం, అధికారం కోసం, అధికారంలో నిరంతరం కొనసాగడం కోసం వేసినన్ని వేషాలు, పిల్లి మొగ్గలు ప్రపంచ రాజకీయ చరిత్రలో మరో నాయకుడు వేసి ఉండడు. యూ-టర్న్ అని గూగుల్‌లో సెర్చ్ చేస్తే ఒక దశలో చంద్రబాబు బొమ్మ కనిపించేదట. విధానాల విషయంలో, పార్టీలతో పొత్తుల విషయంలో బాబు తీసుకున్న యూ-టర్న్‌లను లెక్కతీసి పంపిస్తే గిన్నీస్ రికార్డుల పుస్తకం వాళ్లు కళ్లకు అద్దుకుని అచ్చువేస్తారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క ప్రత్యేక హోదాపైనే కనీసం పది సార్లు మాట మార్చాడు. వ్యవసాయం దండగ అన్న నోటితోనే వ్యవసాయం పండగ అనగలడు. సంపూర్ణ మద్యనిషేధం, రెండు రూపాయలకే కిలో బియ్యం హామీతో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆ రెండు హామీలనూ అటకెక్కించగలడు. రైతులకు రుణమాఫీ చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్వెవ్వెవ్వే అని వెక్కిరించగలడు. యువతకు ఉద్యోగాల ఎరవేసి ఏమార్చగలడు. ఘనాబొడ్డు వాగ్దానాల్లో చంద్రబాబుకు సాటి రాగల రాజకీయ నేత కాగడా వేసుకుని గాలించినా ఎక్కడా దొరకడు. కాంగ్రెస్ వ్యతిరేక పునాదులపై ఎన్టీఆర్ నిర్మించిన తెలుగుదేశం పార్టీని లోపాయికారీగా ఒకసారి, బహిరంగంగా మరోసారి కాంగ్రెస్ పెద్దల పాదాల చెంతకు చేర్చిన విడ్డూరాన్ని లోకమంతా చూసింది. డాక్టర్ వైఎస్సార్ దురదృష్టకర మరణానంతరం భవిష్యత్తులో జగన్‌మోహన్‌రెడ్డితో ముఖాముఖి రాజకీయాల్లో తలపడలేమన్న భయంతోనే, మొగ్గలోనే ఆయనను తుంచేయాలని కాంగ్రెస్‌తో కలిసి చేసిన కుట్ర కేసుల వ్యూహరచన ప్రజలందరికీ తెలిసిన తాజా చరిత్ర. జగన్‌మోహన్‌రెడ్డిపై అమలుచేసిన కక్షసాధింపు చర్యల ద్వారా కాంగ్రెస్ పెద్దలతో చంద్రబాబు లోపాయికారి చెలిమి చిగురించి మొగ్గతొడిగింది. మొన్నటి ఎన్నికలకు ముందు, మోదీతో సఖ్యత చెడిన తర్వాత కాంగ్రెస్‌తో బహిరంగ మైత్రికి ఆ చెలిమి ఉపకరించింది. కాంగ్రెస్ నాయకులు, బీజేపీ వ్యతిరేక పక్షాలతో అంటకాగి, వేదికలెక్కి చంద్రబాబు చేసిన వీరాలాపాలు ఇంకా జనం చెవుల్లో రింగుమంటూనే ఉన్నాయి. మోదీ ఓ చీడ పురుగు అన్నాడు. అన్ని శక్తులను ఏకంచేస్తా, మోదీ సర్కార్‌ను పీకేస్తా అని గర్జించాడు. రాహుల్‌గాంధీని పొగిడాడు. భవిష్యత్తు నేతగా ప్రశంసించాడు. కానీ, ఆ ఢిల్లీ పప్పు ఉడకలేదు. మళ్లీ మోదీ గెలిచాడు. భారీ మెజారిటీతో గెలిచాడు. ఇక్కడ మన అమరావతి పప్పూ ఉడకలేదు. కనీవినీ ఎరుగని ఓటమి మూటగట్టుకోవలసి వచ్చింది. ఇప్పుడు కిం కర్తవ్యం?



చేసిన దోపిడీ సామాన్యమైనది కాదు. పీడకలలా వెంటాడుతున్నది. విభజన కారణంగా రాజధాని నగరాన్ని కోల్పోయిన రాష్ట్రానికి అనుభవజ్ఞుడు ముఖ్యమంత్రిగా ఉంటే బాగుంటుందని కొందరు పెద్దతరం వాళ్లు భావించిన కారణంగా, మోదీ అనుకూల గాలి కారణంగా వెంట్రుకవాసి తేడాతో చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ అధికారం దక్కింది. ఆ అధికార పీఠాన్ని ఆయన దుర్వినియోగం చేశాడు. ఆయనపై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిగితే లోకం దిగ్భ్రాంతికి గురికాగల విషయాలు బైటకు వస్తాయని పలువురు భావిస్తున్నారు. అసలు రాజధాని స్కీమే ఒక పెద్ద స్కామని చెబుతున్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా బినామీల పేర్లతో వేల ఎకరాలు తాను, తన అనుయాయులు సేకరించుకున్న తర్వాతనే రాజధాని ప్రాంతాన్ని ప్రకటించారని ప్రజలు విశ్వసిస్తున్నారు. నిజంగా రాజధాని అక్కడ ఏర్పడి ఉన్నట్లయితే ఈ నేతలు ఎన్నివేల కోట్లు అప్పనంగా సంపాదించి ఉండేవారో ఊహాశక్తికి వదిలేయాల్సిందే! రాజధాని కథ అక్కడితో ఆగలేదు. రైతుల భూమిలో పైసా ఖర్చు లేకుండా సింగపూర్ కంపెనీ చేసే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పాలకుల వాటా కూడా కళ్లు చెదిరేలా ఉంటుందని చెబుతున్నారు. రాజధాని నిర్మాణంలో ప్రతి దశలోనూ కాసులు పిండుకునే విధంగానే డిజైన్ చేశాడు. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఏటీఎమ్‌లా మారిందని సాక్షాత్తూ ప్రధానే ఆరోపించారు. ఇసుక మేటల్లో వాటాలు పిండుకోవడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒక మాఫియా నెట్‌వర్క్‌నే ఏర్పాటు చేశారు. స్వయంగా యువరాజుకే వాటాలిస్తున్నామనే ధైర్యంతో ఈ మాఫియా చెలరేగిపోయి వేలకోట్ల ప్రజాధనాన్ని పిండేసింది. కొత్తగా ఏర్పడిన జగన్ ప్రభుత్వం ఇసుక సరఫరా నుంచి ఈ మాఫియాను దూరంగా పెట్టి ప్రజలకు చౌకగా అందించడంకోసం కొంత విరామాన్ని పాటించడంతో తెలుగుదేశం నేతలు కొందరు హిస్టీరియా వచ్చినట్టుగా ప్రవర్తించడమే జరిగిన దోపిడీకి రుజువు. ఆవు చేలో మేస్తే, దూడ గట్టున మేయదు కదా! బాస్ వ్యవహారశైలిని చూసిన అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు చెలరేగిపోయారు. వీరి అవినీతిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఒక పుస్తకాన్నే అచ్చేసి పంపిణీ చేసింది.

ఓట్ల కొనుగోలుతో మళ్లీ అధికారంలోకి రావాలన్న ప్రణాళిక బెడిసికొట్టింది. కేంద్రంలోనూ తమ అంచనాలు తప్పి మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చింది. వైఎస్ జగన్ పరిపాలన తీరుతెన్నులు చూసిన తర్వాత భవిష్యత్తులో మళ్లీ తమకు అధికారం దక్కే ఆశలు సన్నగిల్లుతున్నాయి. చేసిన అవినీతి కార్యక్రమాలపై విచారణ జరిగితే ఏమవుతుందోనన్న భయం వెంటాడుతున్నది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి చంద్రబాబు అండ్ కోకు వున్న ఒకే మార్గం కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకుని మళ్లీ చేరువకావడం. కానీ, ఎన్నికల ముందు బీజేపీనీ, నరేంద మోదీని చంద్రబాబు అండ్ కో నానాతిట్లు తిట్టి ఉన్నారు. అవన్నీ మరిచిపోయి ఇప్పుడు మళ్లీ దగ్గర చేరనిస్తారా? ఈ సమస్యకు పరిష్కారం ఎలా?... ఈ సకల చరాచర జగత్తులో ప్రతిదానికీ ఒక వెల వుంటుందని నమ్మేతత్వం చంద్రబాబు అండ్ కో ది. ఈ సమస్యకూ ఒక వెలను నిర్ణయించి చెల్లించేందుకు సిద్ధపడిపోయారు. ఆ వెల తెలుగుదేశం పార్టీ ఉనికి! అధినేతతో సహా టోకున టీడీపీ మొత్తాన్ని విలీనం చేసుకునేందుకు బీజేపీ నేతలు సిద్ధంగా లేరు. తమ పార్టీలోని నాయకులు కార్యకర్తలు ఎవరినైనా ఎంతమందినైనా బీజేపీలో చేర్చుకుని తనతోపాటు మిగిలే అవశేష తెలుగుదేశాన్ని ఏపీలో జూనియర్ పార్టనర్‌గా చేర్చుకోవాలని ఢిల్లీ అధికార సౌధాల్లో విజ్ఞప్తుల కార్యక్రమం దీక్షతో జరుగుతున్నదని అభిజ్ఞవర్గాల భోగట్టా. ఇప్పటికే బీజేపీలో చేరిన మాజీ టీడీపీ నేతలు ఈ బ్రోకరేజీ పనిలో వున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటివరకైతే బీజేపీ నాయకత్వం గుంభనంగానే వ్యవహరిస్తున్నది. కానీ, ఒక నాయకుడు తన స్వీయరక్షణకోసం లక్షలాది మంది కార్యకర్తల శ్రమతో నిర్మితమైన పార్టీని పణంగా పెట్టాలని చూడటం కచ్చితంగా రాజకీయ రంగంలో ఒక హీనదశకు సంకేతం.

* * * * *

ఎప్పటిలాగే శవాన్ని భుజాన వేసుకుని నడుస్తున్నాడు విక్రమార్కుడు. శవంలోని బేతాళుడు విక్రమార్కుడితో ఇలా అన్నాడు. త్వరలో తెలుగుదేశం పార్టీ 40వ వార్షికోత్సవం రానున్నది. ఆనాటికి ఆ పార్టీ 'తల'పార్టీగా కొనసాగుతుందా? లేక తోక పార్టీగా మిగులుతుందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి కూడా చెప్పకపోతే నీ తల వేయి ముక్కలవుతుందని అన్నాడు. అసలే అమావాస్య చీకటి. కాంతి లేని చంద్రుడు. దారి కనిపించడం లేదు. చిరాగ్గా వుంది విక్రమార్కుడికి. తనలో తానే ఏదో గొణుక్కుంటూ నడవసాగాడు.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### క్షమాభిక్ష



"ఇంద్రాణీ ముఖర్జీకి షీనా బోరా హత్య కేసులో క్షమాభిక్ష లభించలేదు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో చిదంబరాన్ని పట్టుకోవడానికి అప్రూవర్‌గా మారుతున్నట్టు ఆమె సీబీఐతో ఒక ఒప్పందం కుదుర్చుకుని ఉండొచ్చు. ఎందుకంటే ఆమె పగతో రగిలిపోతూ ఉంది. ఎప్పుడూ ఇలా జరగలేదా? చిదంబరం అరెస్ట్ అయినప్పుడే మనందరికీ తెలుసు.. ఆమె తప్పించుకుంటుందని. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. అనుకోని సంఘటనలు ఎన్నో జరిగాయి. నేను అన్నది తప్పంటారా?"

– సంగీత, రచయిత

### కృతజ్ఞతలు



"మా అందరినీ ఇలా ఒక దగ్గర కలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు చెబుతున్నా. మహాత్మా గాంధీ 150వ జయంతి నేపథ్యంలో ఒక మంచి పని కోసం అందరినీ కలుసుకోవడం బావుంది. గాంధీని మన దేశానికీ, ప్రపంచానికీ పునఃపరిచయం చేయాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నా"

– షారూక్ ఖాన్, హీరో

### మహాభారతం



"ప్రస్తుతం 900-1000 బీసీఈ క్రితం జరిగినట్టుగా భావిస్తున్న మహాభారతం 1500-2000 బీసీఈ క్రితం జరిగినట్టు భారత పురాతత్వ పరిశోధనా సంస్థకు చెందిన సీనియర్ పురాతత్వ శాస్త్రవేత్త చెబుతున్నారు. ప్రఖ్యాత పురాతత్వ శాస్త్రవేత్త బీబీ లాల్ పరిశోధనల మేరకు ఈ నిర్ణయానికి వచ్చినట్టు ఆయన చెబుతున్నారు"

– వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

### ప్రత్యామ్నాయం



"ఒక ఫొటోలో అబ్రమ్ ప్లాస్టిక్ బాటిల్లో నీళ్లు తాగుతున్నాడని అనుకుని, తండ్రి షారూక్ ఖాన్‌ను నిలదీయాలని అనుకున్నా, తర్వాత అర్థమైంది.. అది స్టీల్ బాటిల్ అని. రేపటి పౌరులు ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా మంచి ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడం చాలా బావుంది"

– జుహీ చావ్లా, నటి

### ప్రమాదం



"మరో మనిషి ప్రాణం తీయడాన్ని ఏవిధంగానూ సమర్థించుకోలేం. చట్ట ప్రకారం దోషులను కచ్చితంగా శిక్షించాల్సిందే. ద్వేషపూరిత ప్రసంగాలతో ఇదే ప్రమాదం. అవి సమాజంలో అలజడికీ, విధ్వంసానికీ మాత్రమే దారితీస్తాయి"

– షమా మహమద్, కాంగ్రెస్ నేత

### గ్రే లిస్ట్



"పాకిస్తాన్ 2012లో ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో చేరింది. కానీ, 2015లో మోదీ అధికారంలోకి వచ్చాక అందులోంచి బయట పడింది. తర్వాత మళ్లీ 2018లో మాత్రమే పాక్ గ్రే లిస్ట్‌లో చేరింది. గ్రే లిస్ట్ నుంచి శ్రీలంక, ఇథియోపియాలను తొలగించి, ఐస్‌లాండ్‌ను కొత్తగా చేర్చారు. ఇరాన్, ఉత్తర కొరియాలను మాత్రమే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు"

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

## తులసికి ఇంటిపోరు

అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం డెమొక్రటిక్ పార్టీలో సాగుతున్న పోటీ ఇద్దరు మహిళా నేతల మధ్య చిచ్చు రగిల్చింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో పోటీ పడిన హిల్లరీ క్లింటన్‌ను సెనెటర్ తులసీ గబ్బార్డ్ 'యుద్ధోన్మాదుల రాణి'గా అభివర్ణించారు. ఇక తెరచాటు రాజకీయాలు మానుకుని, బయటకు రావాలని సవాల్ విసిరారు. తులసి ఎన్నారై కావడం వల్ల ప్రవాస భారతీయుల్లో ఆమెకు చెప్పుకోదగ్గ మద్దతు ఉంది. అటు హిల్లరీకి కూడా మంచి పలుకుబడి ఉంది. ఈమధ్య హిల్లరీ ఒక ఇంటర్వ్యూలో తులసి పేరెత్తకుండా పరోక్షంగా ఆరోపణలు చేశారు. పార్టీ అభ్యర్థిత్వానికి పోటీపడే ఒక మహిళకు రష్యా, ట్రంప్‌ల మద్దతుందని, ఆమె వారి ఏజెంటని నిందించారు. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడినా తమ హవా నడవాలన్నది రష్యా ఉద్దేశమన్నారు. దీంతో తులసి ఆగ్రహం కట్టలు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా మాధ్యమాల్లో సాగుతున్న దుష్ప్రచారం వెనక ఉన్నదెవరో బట్టబయలైందని, ఇకనైనా హిల్లరీ పిరికితనాన్ని వీడి ధైర్యంగా వెలుపలకు రావాలని తులసి సవాలు చేస్తున్నారు. మొత్తానికి ట్రంప్‌తో పోటీ సంగతెలా ఉన్నా పార్టీలో అంతః కలహాలు బద్దలయ్యాయి.

# హిందుత్వ వ్యతిరేకతే కాంగ్రెస్ బలహీనత


శేఖర్ గుప్తా

వీర సావర్కర్, జాతీయవాదంపై సోనియా, రాహుల్ కాంగ్రెస్ పార్టీ నేర్చుకోవల్సిందేమిటి? వీర సావర్కర్ పట్ల కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అయోమయం మరోసారి జాతీయవాదంపై దాని ద్వైదీభావాన్ని బట్టబయలు చేసింది. సావర్కర్‌కు భారతరత్న అవార్డుపై తాజా వివాదం కాంగ్రెస్‌ని బట్టలూడదీయించినంత పనిచేసింది. సావర్కర్‌ని నాజీగా, గాంధీ హత్యకు కుట్రదారుగా ఖండించడానికి, 'మేం సావర్కర్‌జీని గౌరవిస్తాం కానీ ఆయన భావజాలంతో ఏకీభవించలేం' అంటూ మన్మోహన్ సింగ్ సూక్ష్మభేదంతో చెప్పడానికి మధ్య కాంగ్రెస్ పార్టీకి ఒక సున్నితమైన అంశంపై తన పంథా గురించి ఏమీ తెలీదని అనిపిస్తోంది.

మన్మోహన్ వివేకంతో కూడిన ప్రకటన చేసిన 24 గంటల తర్వాత, కాంగ్రెస్ పార్టీ సింగ్ ప్రకటన నుంచి దూరం జరగడానికి ప్రయత్నించింది. సింగ్ ప్రకటనను తేలికపర్చడానికి కాంగ్రెస్ ప్రతినిధి రణదీప్ సింగ్ సుర్జేవాలా చేసిన ప్రయత్నం నిస్పృహతోనూ కూడి ఉంది. మన్మోహన్ ప్రకటనలో కుతర్కం గానీ, సందిగ్ధత గానీ లేదు. నిజానికి ఆయన చేసిన ప్రకటన ప్రారంభం నుంచి తన పార్టీ వైఖరిగా ఉండి ఉండాలి. అప్పుడే ఆ పార్టీ స్వీయ విధ్వంసంవైపు పోకుండా అది కాపాడి ఉండేది. ప్రత్యేకించి సావర్కర్ వీరాభిమానులు 1970లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ సావర్కర్ గౌరవార్థం పోస్టేజీ స్టాంప్ విడుదల చేసిన చిత్రాన్ని, సావర్కర్‌కి ఇందిర అందించిన నివాళిని గుర్తు చేస్తూ ఫాసిమైల్ పంపుతున్న ప్రస్తుత సందర్భంలో కాంగ్రెస్ తనవైఖరిని పునరాలోచించుకోవలసింది. సావర్కర్ జీవితంపై డాక్యుమెంటరీకి ఇందిర ప్రోత్సాహమివ్వడమే కాకుండా ఆయన స్మారక నిధికి రూ.11,000 (నేటి విలువలో రూ. 5 లక్షలు) డొనేషన్ కూడా ఇచ్చారు. మరి కాంగ్రెస్ తన ప్రస్తుత వైఖరిని ఇందిరతో పోల్చుకోగలదా?

ఇందిర, పీవీ నరసింహారావు లాంటి వ్యక్తి కాదు. హిందుత్వకు సన్నిహితుడు కానప్పటికీ మెతక లౌకికవాదం ప్రదర్శించడమే కాకుండా తన 'ధోవతీలో కాకీ నిక్కర్ ధరించినందుకు'గాను పీవీని కాంగ్రెస్ పార్టీ తృణీకరించింది, పార్టీలో ఆయనకు స్థానం లేకుండా చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మళ్లీ పార్టీ పాత తరహా కరడుగట్టిన లౌకికవాదానికి మళ్లాలని డిమాండు చేస్తున్నారు. లౌకికవాదంపైగానీ, హిందుత్వపైగానీ ఇందిర మెతకవైఖరితో వ్యవహరించారని కాంగ్రెస్ పార్టీలో ఎవరూ ఆరోపించలేరు. సైద్ధాంతికత కంటే రాజకీయానికే ఆమె ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆర్ఎస్ఎస్/జనసంఘ్‌ను అసహ్యించుకున్నప్పటికీ, వారిని దేశపటం నుంచి పరిత్యజించాలని ఆమె అనుకోలేదు. ఆరెస్సెస్‌పై ఆమె ఆరోపణ ఏమిటంటే, అది స్వాతంత్య్రోద్యమంలో భాగం కాకుండా బ్రిటిష్ వారితో కుమ్మక్కయిందనే. వీర సావర్కర్‌ని ఆరెస్సెస్ చేతిలో పెట్టాలని ఇందిర భావించలేదు. ఆరెస్సెస్‌కి ఒక పెద్ద సమస్య ఉంది. స్వాతంత్య్రోద్యమంలో పాల్గొన్న నిజమైన హీరోలు ఎవరూ ఆ సంస్థకు లేరు. కాంగ్రెసేతర నేతలైన భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్‌ను కూడా వారి భావజాలం నుంచి ఆరెస్సెస్ తొలగించివేసింది.



జాతిహితం

గాంధీ, నెహ్రూ వంశానికి చెందని ఎవరినైనా కౌగిలించుకోవడానికి ఆరెస్సెస్ సిద్ధంగా ఉంది. మోదీ ప్రభుత్వం ఇప్పుడు నెహ్రూ కంటే సర్దార్ పటేల్‌ని భారత గణతంత్ర రాజ్య సంస్థాపకుడిగా ఎత్తిపట్టాలని చూస్తోంది. కానీ పటేల్ ఎన్నడూ ఆరెస్సెస్ అభిమాని కాదని, గాంధీ హత్య తర్వాత ఆ సంస్థను పటేల్ నిషేధించారని మర్చిపోవద్దు. ఆరెస్సెస్ పట్ల ఆయనకు వ్యతిరేకత ఉన్నప్పటికీ, నెహ్రూతో పటేల్ విభేదాలు మరింత బలంగా ఉన్నాయి కాబట్టే కాంగ్రెస్ నుంచి బీజేపీ లాగేసుకున్న తొలి ప్రముఖ వ్యక్తిగా పటేల్ నిలిచారు.

ఆరెస్సెస్ మేధావి, దాని అధికార వాణి ఆర్గనైజర్ సంపాదకుడు శేషాద్రి ఒక ముఖ్యమైన రాజకీయ అంశాన్ని లేవనెత్తారు. ఇందిర జనసంఘ్/బీజేపీలను హిందుత్వపార్టీగా ఎన్నడూ వర్ణించలేదు. తన రాజకీయాలను హిందూయిజానికి వ్యతిరేకంగా ఆమె ఎన్నడూ నిలపలేదు లేదా మెజారిటీ ప్రజానీకం విశ్వాసాన్ని తన ప్రధాన ప్రత్యర్థులకు ఆమె ఎన్నడూ అప్పగించలేదు. బనియా పార్టీగా మాత్రమే వారిని ఆమె కొట్టివేసేది. జనసంఘ్, బీజేపీలను హిందూ పార్టీగా పిలిస్తే హిందువుల నుంచి రాజకీయ మద్దతు వారికి లభిస్తుంది. బనియాలు అని ముద్రిస్తే వారు ఓట్లపరంగా అతి చిన్న బృందానికి పరిమితం అవుతారు. పైగా జనసంఘ్, బీజేపీలు సంపన్నులకు, వడ్డీవ్యాపారులకు, లాభాపేక్షగల వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చినందున, గ్రామీణ ప్రాంతంలో చాలామంది హిందువులు బీజేపీ పట్ల పెద్దగా అనుకూలంగా ఉండేవారు కాదు. అందుకే ఇందిర వారిని సమాజానికి ఏమాత్రం మంచి చేయని ఫక్తు వ్యాపారులుగా, బనియాలుగా ముద్రించి తృణీకరించేవారు. సోనియా గాంధీ హయాంలో కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని బనియాలపై కాకుండా హిందుత్వపై, హిందూయిజంపైకి మళ్లించిందని శేషాద్రి వ్యాఖ్యానించారు. ఇందిర కాంగ్రెస్‌కు, నేటి కాంగ్రెస్‌కి మధ్య ఉన్న వ్యత్యాసం ఇదే. ఇందిర వామపక్ష మేధావులను తన దర్బారులో చేర్చుకుని, తన రాజకీయాల కోసం వారి ఆలోచనలను వాడుకున్నారు. కానీ సోనియా మాత్రం వామపక్షాలను, వారి మేధావులను దూరం పెట్టి తన రాజకీయాలను నడిపారు.

ఇందిర వారసులు జాతీయవాదం, మతం, సోషలిజం వంటి అంశాలపై భీకర రాజకీయ త్రిశూలధారులైన మోదీ, షాల బీజేపీని ఎదుర్కొంటున్నారు. వీరిని సోనియా–రాహుల్ కాంగ్రెస్ ఎలా ఎదుర్కోగలుగుతుంది? శబరిమల, ట్రిపుల్ తలాక్, అయోధ్య వంటి ప్రతి అంశంలోనూ కాంగ్రెస్ ఓడిపోయింది. కరడుగట్టిన సోషలిజాన్ని మాత్రమే కాంగ్రెస్ తిరిగి పాటిస్తూ జాతీయవాదాన్ని, మతాన్ని, సంస్కృతిని బీజేపీకి అప్పగించేటట్లయితే లోక్‌సభలో 52 స్థానాలు దానికి దక్కడం కూడా అదృష్టమేనని చెప్పాలి. రాజకీయవేత్తకాని మన్మోహన్ సింగ్ దాన్ని అర్థం చేసుకున్నారు. కానీ ఆయన పార్టీ మాత్రం సింగ్ మాటల్ని ఎన్నడూ వినలేదు.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



గత గురువారం కర్వా చౌత్ పండగ. ఉత్తరాదివారు జరుపుకునే పండగ ఇది. భర్త క్షేమం కోరి రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం చంద్రుడిని చూశాక ఆహారం తీసుకుంటారు. హిందీ పరిశ్రమలో చాలామంది తారలు ఉపవాసం ఉన్నారు. ఇది ప్రియాంకా చోప్రాకి తొలి కర్వా చౌత్. భర్తతో కాలిఫోర్నియాలో ఉన్న ప్రియాంకా కర్వా చౌత్ పండగ చేసుకున్నారు. “నా భార్య భారతీయురాలు. తను హిందు. తన సంస్కృతీ సంప్రదాయాల గురించి నాకు చెప్పింది. తనంటే నాకు చాలా ప్రేమ, ఆరాధన. పండగ రోజు మేం చాలా సరదాగా గడిపాం” అని నిక్ జోనస్ ఈ పండగ ఫొటోను షేర్ చేశారు. “మై ఎవిరీథింగ్” అని ప్రియాంక పేర్కొన్నారు.



● భర్త నిక్ జోనస్‌తో...

# ప్రియాంక ఈజ్ ద స్కై

**ఆకాశంలో సగం కాదు.. ఆకాశం మొత్తం తనే అయ్యారు ప్రియాంక. మామూలు ఆకాశం కాదు. సినీ వినీలాకాశం! నింగీ నాదే, నేలా నాదే అని చేతులు చాచారు. బాలీవుడ్ ఆమెదే అయింది. హాలీవుడ్ ఆమెదే అయింది. సినిమాలు.. సీరియళ్లు.. ప్రేమ.. పెళ్లి.. ఇప్పుడు..'ది స్కై ఈజ్ పింక్'! ఈ చిత్రంతో 'ప్రియాంక ఈజ్ ద స్కై' అనిపించారు. ఈ 'స్కై'ని సాక్షి అందుకుంది. ఎక్స్‌క్లూజివ్‌గా ఇంటర్వ్యూ తీసుకుంది.**

సాక్షి ఎక్స్‌క్లూజివ్

● ప్రియాంకా చోప్రా

**● ఫిల్మీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టి, స్టార్ హీరోయిన్ అయి హాలీవుడ్ వరకూ వెళ్లిన మీ జర్నీ గురించి కొన్ని మాటలు...**

**ప్రియాంక:** ఈ ప్రయాణంలో చాలామంది సహాయం ఉంది. వాళ్లందరికీ ఎంతో వినయంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ పనిని గుర్తించి అభినందించినప్పుడు కలిగే అనుభూతి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆ అభినందనలే ఇంకా ఇంకా బాగా పని చేయడానికి ఉత్సాహాన్నిస్తాయి. ఎవరి అండా లేకుండా ఒంటరిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాను. చాలా హార్డ్‌వర్క్ చేశాను. నా ముఖం మీదే తలుపులేసిన సందర్భాలున్నాయి. అలాంటి దురదృష్టకర సంఘటనలు ఎదురైనప్పటికీ నేను అదృష్టవంతురాలినే. ఎందుకంటే నన్ను నేను నిరూపించుకోవడానికి ఉపయోగపడే అవకాశాలు కూడా వచ్చాయి. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే 'సక్సెస్' ఖాయం అని నా ఒపీనియన్. 'ఇది మన కెరీర్‌కి ఉపయోగపడుతుంది' అనిపించిన ఏ అవకాశాన్నీ తేలికగా తీసుకోలేదు. ఆ క్యారెక్టర్ల కోసం ఎంత కష్టపడాలో అంతా పడ్డాను. ఇప్పటికీ పడుతున్నాను. ఎప్పటికీ కష్టపడతాను. ఈ జర్నీలో రాళ్ల బాట చూశాను. పూల బాటకు ఆ రాళ్ల బాట ఉపయోగపడింది.

**● కొన్నిసార్లు కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. అప్పుడు ఏమనిపిస్తుంది?**

అలాంటి సమయాల్లో కొంచెం నిరుత్సాహం ఉంటుంది. అయితే జీవితంలో నేను నమ్మేదేంటంటే... ప్రతి ఫెయిల్యూర్‌ని సవాల్‌గా తీసుకుని ఎదగాలని. నాకెప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవాలన్నా, కొత్త పనులు చేయాలన్నా ఇష్టం. మీరు నా కెరీర్‌ని గమనిస్తే అది అర్థమవుతుంది. ఒకదానికి ఒకటి పోలిక లేని పాత్రలు చేసుకుంటూ వచ్చాను. 'ఇలాంటి పాత్రలే చేయాలి' అనే హద్దులను నటిగా చెరిపేయాలనుకున్నాను. నిర్మాతగా కూడా జస్ట్ కమర్షియల్ చిత్రాలకే పరిమితం కాదల్చుకోలేదు. మా పర్పుల్ పెబెల్ పిక్చర్స్‌పై తీసిన మరాఠీ చిత్రం 'వెంటిలేటర్'కి మూడు నేషనల్ అవార్డులు వచ్చాయి. ఇంకా పంజాబీ, భోజ్‌పురి భాషల్లో కూడా మంచి సినిమాలు నిర్మించాం. ఇప్పుడు చిత్రపరిశ్రమ, ప్రేక్షకుల్లో చాలా మార్పు వచ్చింది. కొత్త సినిమాలను, తమను కదిలించే కథలను చూడ్డానికి ఆడియన్స్ ఇష్టపడుతున్నారు. వరల్డ్ సినిమాల్లో ఉండటానికి ఇదే సరైన సమయం అని భావిస్తున్నాను.

**● కథానాయికగా మరో మూడేళ్లల్లో 20 ఏళ్లు కంప్లీట్ చేసుకుంటారు. హీరోయిన్‌గా తమిళ చిత్రం 'తమిళన్' (2002)తో స్టార్ట్ అయ్యారు. ఇన్నేళ్ల కెరీర్ మీకు నేర్పించిన విషయాలేంటి?**

జీవితం చాలా నేర్పిస్తుంది. ఒడిదుడుకులను దాటుకుంటూ ఈదమని చెబుతుంది. అలాంటి క్లిష్టమైన సమయాల్లో ఓ 'వారియర్'లా మారిపోవాలి. ఆటను ధైర్యంగా ముందుకు తీసుకెళ్లాలి. పరిస్థితులు తలకిందులుగా ఉన్నప్పుడు మనం ఎలా లేవాలన్నది మన చేతుల్లోనే ఉంటుంది. మనం ప్రతి ఒక్కరం ఫెయిల్యూర్‌ని ఎదుర్కోవాలి. ఎందుకంటే ఒక అపజయం తర్వాత మనం ఏం చేస్తున్నాం అనేది ముఖ్యం. మనకు మనమే ఆదర్శంగా నిలవాలి. మనకు మనమే ధైర్యం చెప్పుకోవాలి. మనల్ని మనమే ప్రోత్సహించుకోవాలి. మనల్ని మనం నమ్మాలి. సమస్యలు ఎదురైనప్పుడు 'మన బలం ఏంటి?' అని ఆలోచించా. ఆ బలం తెలుసుకుని, ఆ దిశగా వర్కవుట్ చేయడం మొదలుపెట్టా. నా ముఖం మీదే తలుపులు వేశారని చెప్పాను కదా. అప్పుడు నేనేం కుంగిపోలేదు. మనల్ని మనం నిరూపించుకుంటే మనం ఏ పని చేయాలనుకుంటున్నామో దాన్ని డిమాండ్ చేసే స్థాయిలో ఉంటాం అని నమ్మాను. నిరూపించుకోవడానికి కష్టపడ్డాను. ఇప్పుడు నేనేం చేయాలనుకుంటున్నానో అదే చేస్తున్నాను.

**● ఇక్కడ తిరుగులేని స్టార్ హీరోయిన్ అనిపించుకుని, విదేశాల్లో కొత్త నటిగా జర్నీ మొదలు పెట్టినప్పుడు ఎలా అనిపించింది?**

వేరే దేశానికి వెళ్లి, 'నేను ప్రియాంకా చోప్రా.. ఇండియన్ యాక్టర్‌ని' అని పరిచయం చేసుకున్నప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఇక్కడ ఆల్రెడీ ప్రూవ్డ్. అక్కడ ప్రూవ్ చేసుకోవడానికి కష్టపడాలి. మామూలుగా చిన్న వయసులో కెరీర్ ఆరంభిస్తే, ఓ 30 ఏళ్లు వచ్చేసరికి సెటిల్ అయిపోతాం. బాలీవుడ్‌లో అలానే సెటిల్ అయ్యాను. కానీ, 30 ఏళ్లు దాటాక విదేశాల్లో కెరీర్‌లో మొదలుపెట్టడం సవాల్‌గా అనిపించింది. అయితే ఎంజాయబుల్‌గానే ఉంది.

**● బాలీవుడ్ స్క్రీన్ మిమ్మల్ని బాగా మిస్సవుతోంది. మూడేళ్ల తర్వాత 'ది స్కైజ్ ఈజ్ పింక్'తో మళ్లీ హిందీ తెరపై కనిపించారు. మీకెంతో ఇచ్చిన హిందీ పరిశ్రమను మిస్సవుతున్న ఫీలింగ్ లేదా?**

'జై గంగాజల్' (2016) తర్వాత హిందీ సినిమా చేయాలనుకున్నాను. చాలా కథలు కూడా విన్నాను. అప్పటికే అమెరికన్ టీవీ సిరీస్ 'క్వాంటికో' టెలికాస్ట్ కూడా మొదలైంది. ఈ సిరీస్ త్రీ సీజన్స్‌గా వచ్చిన విషయం తెలిసిందే. ఆ షూటింగ్‌కి ఎక్కువ టైమ్ పట్టేసింది. హిందీ సినిమా చేయాలని ఉన్నా చేయలేకపోయాను. ఫైనల్లీ 'ది స్కై ఈజ్ పింక్'తో మళ్లీ హిందీ ప్రేక్షకులకు కనిపించాను. ఈ మూడేళ్లల్లోనే సినిమా లపరంగా చాలా మార్పొచ్చింది.

**● 'ది స్కై ఈజ్ పింక్' ఒప్పుకోవడానికి ప్రధాన కారణం మళ్లీ హిందీలో చేయాలనా? కథ బాగా నచ్చిందా?**

నేను న్యూయార్క్‌లో ఉన్నప్పుడు ఈ కథ నా దగ్గరకు వచ్చింది. కథ చదివాక ఇది పక్కన పెట్టేసే స్క్రిప్ట్ కాదనిపించింది. 'కేర్‌టేకర్స్' గురించి ఆలోచింపజేసిన కథ అది. నాకు తెలిసి వాళ్లను ఎవరూ గుర్తు పెట్టుకోరు. నాకు మా నాన్నగారి ఆరోగ్యం బాగాలేని రోజులు గుర్తొచ్చాయి. అప్పుడు మా అమ్మగారు పక్కనే ఉండి చాలా కేర్ తీసుకున్నారు. ఒక వ్యక్తికి బాగా లేకపోతే ఇంటిల్లిపాదీ బాధపడతాం. మనకు ఇష్టమైన వ్యక్తి మన కళ్లముందే అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు మనం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటాం. అది ఆ కుటుంబంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది? వైవాహిక జీవితంపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అనే విషయాలు ఆ కథలో ఉన్నాయి. వ్యక్తిగతంగా మా నాన్నగారి పరిస్థితి చూశాను. అలాంటి అంశాలతో ఉన్న ఈ కథ నన్ను బాగా కదిలించింది.

**● మీ భర్త నిక్ జోనస్‌తో విదేశాల్లో స్థిరపడటం ఎలా ఉంది? మ్యారీడ్ లైఫ్ ప్లాన్స్ గురించి?**

ముంబైకి దూరంగా ఉంటున్నాను. అయితే నేను ఎక్కడున్నా నా చుట్టూ నేను ప్రేమించేవాళ్లు ఉంటే చాలు.. నేను ఆనందంగా ఉంటాను. వైవాహిక జీవితం విషయానికి వస్తే... ప్రస్తుతం నా 'విష్ లిస్ట్'లో ప్రధానంగా రెండు కోరికలు ఉన్నాయి. ఒకటి లాస్ ఏంజిల్స్‌లో ఇల్లు కొనడం.. రెండు.. తల్లి కావడం. మాతృత్వం తాలూకు అనుభూతిని ఆస్వాదించాలని ఉంది. అయితే అది వచ్చే రెండు మూడేళ్లల్లో మాత్రం ఉండదనే అనుకుంటున్నాను.

**● 'ది స్కైజ్ ఈజ్ పింక్'కి నటిగా, నిర్మాతగా రెండు బాధ్యతలు తీసుకోవడం ఎలా అనిపించింది?**

ఒక ఆర్టిస్ట్‌గా సినిమా చేసిన తర్వాత జస్ట్ ప్రమోట్ చేస్తే చాలు. వేరే ఏ బాధ్యతలూ ఉండవు. కానీ నిర్మాత బాధ్యత చాలా పెద్దది. ఒక సినిమాకి 150 మంది పని చేస్తున్నారంటే అందరి బాధ్యత ఒక్క నిర్మాతదే. సినిమా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకూ చాలా పని ఉంటుంది. బరువైన బాధ్యత అయినా ఇష్టంగా చేశాను. ఎందుకంటే 'ది స్కైజ్ ఈజ్ పింక్' కథ అందరికీ చెప్పాలి. నటిగా తెరపై చెబుతాను. కానీ నిర్మాతగా కూడా చేస్తే ఇంకా సంతృప్తి ఉంటుందనిపించింది. అందుకే నేను ఒక నిర్మాతగా చేశాను.

**● ఈ చిత్రం లొకేషన్‌లో మరచిపోలేని సంఘటన ఏదైనా జరిగిందా?**

ఇది చాలా ఎమోషనల్ మూవీ. షూటింగ్‌కి ప్యాకప్ చెప్పిన తర్వాత బరువైన మనసుతో ఇంటికి వెళ్లేదాన్ని. సినిమాలో అయేషా చౌదరి (జైరా వాసిమ్) కి ఆరోగ్యం బాగుండదు. జీవితకాలాన్ని పొడిగించాలంటే తను ఆపరేషన్ చేయించుకోవాలి. కానీ దానివల్ల మంచాన పడే అవకాశం ఉన్నందున సర్జరీ చేయించుకోనని తల్లి అదితీ చౌదరీ (ప్రియాంకా చోప్రా)కి చెబుతుంది. కూతురి నిర్ణయాన్ని తల్లి ఆమోదిస్తుంది. ఓ తల్లి తన బిడ్డని కోల్పోవడం అంటే అది ఎంత బాధగా ఉంటుందో తెలుసుకోవడానికి తల్లే కానవసరంలేదు. కానీ ఈ సీన్‌లో యాక్ట్ చేసేటప్పుడు ఆ ఎమోషన్ ఎలా చూపించాలని చిత్రదర్శకురాలు సోనాలీ బోస్ దగ్గర అడిగాను. అప్పుడామె 'నా నిజజీవితంలో జరిగిన ఘటన ఇది. అనారోగ్యంతో నా కుమారుడు చనిపోయాడు' అని చాలా ఎమోషనల్‌గా అన్నారు. అంతే.. నేను ఏడుపు ఆపుకోలేకపోయాను. ఆ రోజు షూటింగ్‌లో ఏడుస్తూనే ఉన్నాను. అప్పుడు కలిగిన ఆ బాధను ఎప్పటికీ మరచిపోలేను. 'ది స్కైజ్ ఈజ్ పింక్' అంటే చాలు.. నాకు ఎక్కువగా గుర్తొచ్చే విషయం ఇదే.

**● సినిమాలో ఓ తల్లిగా కూతురి మీద మీకు అమితమైన ప్రేమ ఉంది. నిజజీవితంలో మీ అమ్మ మధు చోప్రాతో మీ బాండింగ్ గురించి?**

ఈ సినిమాలో తల్లి తన కూతుర్ని చాలా ప్రేమిస్తుంది. ఓ ఫ్రెండ్‌లా ట్రీట్ చేస్తుంది. నిజజీవితంలో మా అమ్మ నాతో అలానే ఉంటారు. మేమిద్దరం కలిసి పార్టీలకు వెళతాం లేదా వేరే ఈవెంట్స్‌కి వెళతాం. నాకు సంబంధించిన ప్రతి విషయం ఆమెకు తెలుసు. నా బాయ్‌ఫ్రెండ్స్ నుంచి భర్త వరకూ ఇప్పటివరకూ నా జీవితంలో జరిగిన ప్రతిదీ మా అమ్మకు తెలుసు. నీ లైఫ్‌లో నీకు బెస్ట్ పర్సన్ ఎవరు? అంటే 'మా అమ్మ' అంటాను. నా తల్లి నాతో ఎలా ఉన్నారో నేను సినిమాలో అలానే ఉన్నాను.



● తల్లి మధు చోప్రాతో..

**● మీ భర్త నిక్ జోనస్ 'స్కైజ్ ఈజ్ పింక్' షూటింగ్ లొకేషన్‌కి వచ్చినప్పుడు కంట తడిపెట్టుకున్నారని విన్నాం. బహుశా మీరు ఎమోషనల్ సీన్‌లో నటిస్తున్నప్పుడే ఆయన ఎమోషన్ అయ్యారా?**

మా పెళ్లికి నాలుగు రోజుల ముందు వరకూ నేను ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నాను. లొకేషన్‌కి నిక్ వచ్చేవాడు. షాట్ గ్యాప్‌లో మేమిద్దరం పెళ్లి పనుల గురించి మాట్లాడుకునేవాళ్లం. 'పెళ్లి పనులు నేను చూసుకుంటాలే. నువ్వు కూల్‌గా షూటింగ్ చేసుకో' అన్నారు. ఎందుకంటే ఇది ఎమోషనల్ మూవీ అని తనకు తెలుసు. నిక్ షూటింగ్ స్పాట్‌కి వచ్చిన రోజు ఎమోషనల్ సీన్ షూట్ జరుగుతోంది. మా సోనాలీకి ఎవరో సన్నగా ఏడుస్తున్నట్లుగా వినిపించిందట. చూస్తే.. తన పక్కనే ఉన్న నిక్ ఏడుస్తుండటం ఆమెకు కనిపించింది. 'నీ భర్తను ఏడిపించేశావ్. ఇది చాలా గొప్ప సీన్' అని ఆమె అన్నారు.

**● ఫైనల్లీ.. హైదరాబాద్ బిర్యానీ గురించి?**

నేను ఫుడ్ లవర్‌ని. నాకు హైదరాబాదీ బిర్యానీ అంటే చాలా చాలా ఇష్టం.

**– డి.జి. భవాని**

# ఇన్నర్‌వ్యూ
సండే స్పెషల్

## గ్రేట్ సునీతా!

''గాంధీజీ వంటి ఒక వ్యక్తి ఈ భూమండలంపై రక్తమాంసాలతో నడయాడారా.. అని భావితరాల వాళ్లు విస్మయం చెందుతారు'' అని ఐన్‌స్టీన్ అన్నారు. ఇప్పుడు ఇంచుమించు అదే టోన్‌లో సునీతా కృష్ణన్ గురించి, బాలీవుడ్ నటి అనుష్కా శర్మ గురించి అన్నారు! సునీత స్టోరీ చాలావరకు ప్రపంచానికి తెలుసు. సునీత స్వస్థలం బెంగళూరు. పదిహేనేళ్ల వయసులో ఆమెపై ఎనిమిదిమంది సామూహికంగా లైంగిక దాడి చేశారు. ఆ పీడకల నుంచి తనకు తానుగా బయటపడి, అత్యాచార బాధితుల కోసం; బాలికలు, మహిళల అక్రమ రవాణాను నివారించడం కోసం ఆమె గత ముప్పై ఏళ్లుగా కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకు 20 వేల మందికి పైగా బాధితుల్ని కాపాడారు. వారికి పునరావాసం కూడా కల్పించారు. అంతేనా! ప్రభుత్వాలను కదలించి చట్టాలు కచ్చితంగా అమలయ్యేలా ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ఎపిసోడ్‌లో అమితాబ్ బచన్ సునీతను ఈ దేశానికి పరిచయం చేశారు. టీవీలో తొలిసారిగా సనీతా కృష్ణన్ చూసి, ఆమె చెప్పిన విషయాలు విన్న అనుష్క.. వెంటనే తన ట్విట్టర్ అకౌంట్‌లోకి వెళ్లి, ''ఇలాంటి మనిషి మనమధ్య ఉన్నందుకు మనమంతా ఆమెకు కృతజ్ఞతలు తెలియజెయ్యాలి'' అని కామెంట్ పెట్టారు. సునీతను పరిచయం చేసినందుకు అమితాబ్‌కీ ధన్యవాదాలు తెలిపారు. ''నాకు చావంటే భయం లేదు. స్త్రీలకు సహాయపడేందుకే నేను నా జీవితాన్ని అంకితం చేశాను'' అని సునీతా కృష్ణన్ అనడం కూడా అనుష్కను ఉత్తేజపరిచినట్లు కనిపిస్తోంది. ''ఘోరమైన జీవిత వాస్తవాల మధ్య ఒక పోరాట యోధురాలు'' అని కూడా సునీతను ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు అనుష్క.



అనుష్కా శర్మ



'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా ఎపిసోడ్‌లో సునీతా కృష్ణన్‌తో అమితాబ్ బచన్.

**టీవీలో చూసి సునీతా కృష్ణన్ గురించి తొలిసారిగా తెలుసుకున్న బాలీవుడ్ నటి అనుష్క ఎంతో ఉత్తేజానికీ, ఉద్వేగానికీ లోనయ్యారు.**

## గట్టి పిల్ల



రష్మికా మందన్నా

రష్మికా మందన్నా 'ఇన్నర్‌వ్యూ' ని తెలుసుకోవడం తేలికైన విషయమేమీ కాదు. చక్కటి ఆ చిరునవ్వు తోనే 'చెప్పితీరాల్సిన' సిట్యుయేషన్‌ని అలవోకగా దాటవేస్తారు రశ్మిక. అలాగని మొహమాట పడే అమ్మాయి కూడా కాదు. ''మీకూ, విజయ్ దేవరకొండకు' సమ్‌థింగ్ సమ్‌థింగ్ అట కదా'' అని 'డియర్ కామ్రేడ్' చిత్రం విడుదల సందర్భంగా రశ్మిక హైదరాబాద్ వచ్చినప్పుడు ఒక రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఆమె తనదైన చిరునవ్వుతో.. ''అంత సీన్ లేదు'' అని అనడం మీకు గుర్తుండే ఉంటుంది. ఏ పాత్రలోనైనా కుదురుగా ఇమిడిపోగల రశ్మిక ఏ ప్రశ్నకైనా తడబడకుండా సమాధానం చెబుతారు. అందుకని ఆమెని ఇరుకున పెట్టడం అనే వృథా ప్రయాస మాని, ఆమె నటిస్తున్న సినిమాల్లో చిన్న చిన్న షాట్స్‌ని పాప్పరాజ్జీలు (వెంటాడే ఫొటో జర్నలిస్టులు) గుట్టు చప్పుడు కాకుండా నొక్కేస్తూ ఉంటారు. అలా నొక్కి వేయబడిన ఓ ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో రశ్మిక గొర్రెపిల్లల్ని కాస్తున్న పల్లె పడుచుగా కనిపిస్తున్నారు! దాంతో ఈ అతిలోక సుందరి.. అతి సాధారణమైన ఈ సీన్‌ని ఏ సినిమా కోసం చేసి ఉంటారా అన్న డిబేట్ కూడా అప్పుడే నెట్‌లో మొదలైపోయింది. ప్రస్తుతం రశ్మిక.. పేరింకా ఖరారు కాని ఒక తెలుగు సినిమాలో నటిస్తున్నారు. గొర్రెల కాపరిగా ఆమె ఆ సినిమాలో కనిపించబోతున్నారా? లేక, 'సుల్తాన్' అనే తమిళ సినిమాకు ఆమె సంతకం చేశారు.. అందులో ఇలా నటించబోతున్నారా.. తేల్లేదు. ఏమైనా ఈ అందాల రాశి గొర్రెల కాపరిగా నటించడం తమకు అన్యాయం చేయడమేనని అని ఆమె అభిమానులు బాధపడిపోతున్నారు. ఈ విషయాన్ని రశ్మిక సన్నిహితులైన వారు ఆమెతో అంటే.. ఎప్పటిలా చిరునవ్వు నవ్వుతూ.. ''క్యారెక్టర్‌లో కనిపించే అందం.. క్యారెక్టర్ వేస్తున్న నటిలో కనిపించే అందం కన్నా గొప్పది'' అన్నారు తప్ప.. ఆ సీన్ తెలుగుదా, తమిళ్‌దా చెప్పలేదు. గట్టి పిల్లే. ఇంత గుట్టా?!



దొంగిలించబడ్డ సీన్‌లో గొర్రెల కాపరిగా రశ్మిక

**ఏమైనా ఈ అందాల రాశి గొర్రెల కాపరిగా నటించడం తమకు అన్యాయం చేయడమేనని ఆమె అభిమానులు అన్నమూ నీళ్లు మాని ఒకటే బాధపడిపోతున్నారు.**

బ్యూటిప్స్

## దీప కాంతి

**వెలుగుతున్న ప్రమిదను చేత పట్టుకున్నప్పుడే కాదు, మిగతా సమయాల్లోనూ మోము అంతే కాంతిమంతంగా మెరవాలనుకుంటారు. అందుకు ఇంట్లోనే తయారుచేసుకొని వాడదగిన కొన్ని సహజ సౌందర్య చికిత్సలివి.**





● ఓట్స్‌లో పాలు లేదా పెరుగు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా ఈ రోజు నుంచి వారం రోజుల పాటు రోజూ చేస్తూ ఉంటే మీ ముఖకాంతి పెరుగుతుంది.

● పొడిచర్మం గలవారు బాదం పొడిలో పాలు లేదా పెరుగు, తేనె, కొన్ని చుక్కల గ్లిజరిన్ కలిపి ముఖానికి, చేతులకు రాసుకోవాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. బాదం పొడి, తేనె చర్మానికి అద్భుతమైన మాయిశ్చరైజర్లుగా ఉపయోగపడతాయి.

● స్ట్రాబెర్రీ లేదా కమలాలు చర్మానికి రసాయనాలు లేని బ్లీచ్‌లా ఉపయోపడతాయి. వీటి రసాన్ని ముఖానికి రాసి, 5–10 నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. చర్మంపైన జిడ్డు తగ్గి పిగ్మెంటేషన్, మొటిమల వంటి సమస్యలను నివారిస్తాయి.

● గుడ్డులోని తెల్లసొనలో కొద్దిగా తేనె కలిపి ముఖానికి, గొంతుకు రాయాలి. పదినిమిషాల తర్వాత కడిగేయాలి. ఈ ప్యాక్ చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. ముఖంపైన అతి సన్నని వెంట్రుకలను కూడా నివారిస్తుంది.



సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
20-10-2019



'బాహుబలి' టీమ్ సభ్యులు మళ్లీ కలిశారు. లండన్‌లో 'రాయల్ రీ-యూనియన్' జరుపుకున్నారు. విషయమేంటంటే.. లండన్ ఆల్బర్ట్ హాల్‌లో 'బాహుబలి 1'ని శనివారం ప్రదర్శించారు. అక్కడ ప్రదర్శితం అయిన తెలుగు చిత్రం ఇదే కావడం విశేషం. చిత్ర ప్రదర్శనతో పాటే సంగీత దర్శకుడు కీరవాణి లైవ్ ఆర్కెస్ట్రాతో మ్యూజిక్ అందించడం మరో విశేషం.

# ఏది పడితే అది రాయొద్దు!



● అమితాబ్ బచ్చన్

'అమితాబ్ బచ్చన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు', ' కాలేయ సంబంధిత సమస్యలంట' అనేవి శుక్రవారం అమితాబ్ ఆరోగ్యానికి సంబంధించి చక్కర్లు కొట్టిన వార్తలు. శనివారం రాత్రి అమితాబ్ తన బ్లాగ్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ– ''అనారోగ్యం, మెడికల్ ఇష్యూలు అనేవి ఆ వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత విషయాలు. వాటి గురించి ఏది పడితే అది రాయకూడదు. ఆ కోడ్‌ను ఎప్పుడూ బ్రేక్ చేయకూడదు. అలా చేయడం ప్రొఫెషనల్ కోడ్‌ను ఉల్లంఘించడమే. ఆ వ్యక్తిగత స్పేస్‌ను అర్థం చేసుకొని, గౌరవం ఇవ్వండి. ప్రపంచంలో అన్ని విషయాలూ అమ్మకానికి కాదు'' అని ఘాటుగా రాసుకొచ్చారు అమితాబ్.

# అందరూ లైక్ చేస్తున్న పాట



● అల్లు అర్జున్

'సామజవరగమన... నిను చూసి ఆగగలనా...' ఇప్పుడు సోషల్ మీడియా నుంచి ఫోన్ రింగ్ టోన్, కాలర్ ట్యూన్స్ వరకూ ఎక్కువగా వినిపిస్తున్న పాట ఇది. 'అల వైకుంఠపురములో' సినిమాలో తమన్ స్వరపరిచిన ఈ పాట విడుదల అయినప్పటినుంచే బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి రాసిన ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ పాట విడుదల అయినప్పటి నుంచి ఎన్నో రికార్డులను సృష్టించింది. తాజాగా ఈ పాట యూట్యూబ్‌లో 7 లక్షల లైక్స్ సాధించింది. ఇన్ని లైక్స్ రావడం తెలుగులో ఇదే ప్రథమం అని, ఇప్పటివరకూ ఈ పాట 40 మిలియన్ల (4 కోట్లు) వీక్షణలు పొందిందని చిత్రబృందం పేర్కొంది. అల్లు అర్జున్, పూజా హెగ్డే జంటగా త్రివిక్రమ్ దర్శకత్వంలో అల్లు అరవింద్, యస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జనవరి 12న విడుదల కానున్న ఈ చిత్రానికి సహనిర్మాత: పీడీవీ ప్రసాద్.

# రచయితలు సరస్వతీ పుత్రులు

''రచయితల సంఘం అంటే సరస్వతీ పుత్రుల సంఘం. అలాంటి సరస్వతీపుత్రుల సంఘం లక్ష్మీదేవి కటాక్షంతో అద్భుతమైన సొంత భవనం కట్టుకునేలా అభివృద్ధి చెందాలి'' అని సీనియర్ నటుడు కృష్ణంరాజు అన్నారు. ఈ ఏడాది నవంబరు 3న రచయితల సంఘం రజతోత్సవ వేడుక జరగనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ని ఫిలిం నగర్ ప్రొద్యూసర్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన కర్టెన్ రైజర్ వేడుకకు సంబంధించిన టీజర్‌ను కృష్ణంరాజు ఆవిష్కరించారు. 1932 నుంచి ఇప్పటి వరకు తెలుగు చిత్రపరిశ్రమ అభివృద్ధి కోసం సినీ రచయితల కృషిని గుర్తు చేసుకున్నారు కొందరు అగ్ర రచయితలు. ఈ వేడుకలో కృష్ణంరాజు మాట్లాడుతూ – '''లక్ష్మీ ఎదురుగా వస్తే నమస్కరించు. కానీ సరస్వతి ఎక్కడ ఉన్నా వెతికి వెతికి నమస్కరించు' అని మా నాన్నగారు చెప్పారు. అందుకే ఈ వేడుకకు వచ్చాను. రచయితలకు ఏకాగ్రత, అంకితభావం ఉండాలి. కాలంతో పాటు రచయిత రచనల్లోనూ మార్పు వచ్చింది. ఆ రచనలు మంచి మార్గానికి దోహదపడాలి. నేను పెద్ద పెద్ద మహానుభావులతో పని చేశాను. ఆత్రేయగారు ఏదైనా సీన్ రాసేప్పుడు ఆయన ఆ క్యారెక్టర్‌లోకి వెళ్లిపోయి డైలాగ్స్ రాసేవారు'' అని అన్నారు. ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ సినిమా - కృష్ణంరాజు పుట్టుపూర్వోత్తరాల గురించి మాట్లాడారు. ఆ రోజుల్లో పద్యానికి దగ్గరగా పాట ఉండేదని అభిప్రాయపడ్డారు. రచయిత సముద్రాల రాఘవాచారి నుంచి చక్రపాణి వరకు సాగిన చరిత్రను గుర్తు చేశారు ఎస్.వి. రామారావు. పాతాళభైరవి, మిస్సమ్మ...వంటి నాటి ప్రముఖ సినిమాలు, దర్శకులు, రచయితల గురించి మాట్లాడారు నాగబాల సురేష్. 1950 నుంచి 60వరకు వచ్చిన సినిమాల గురించి మాట్లాడారు. 1961–70 నాటి కాల సినిమాల గురించి ప్రస్తావించారు వడ్డేపల్లి కృష్ణమూర్తి. పాతతరం, కొత్తతరం రచయితలు కలిసి ముందుకు వెళ్లాల్సిన దశాబ్దం ఇదే అన్నారు చిలుకుమార్ నట్‌రాజ్. 1981–90 కాలంలో ఉన్న రచయితలు, దర్శకులు, సినిమాల గురించి మాట్లాడారు అనురాధ. ఈ కార్యక్రమంలో బలభద్రపాత్రుని రమణి, ప్రధాన కార్యదర్శి ఆకెళ్ల, పరుచూరి వెంకటేశ్వరరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



● పరుచూరి వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు, పరుచూరి గోపాల కృష్ణ

# నూటొక్క జిల్లాలకే అందగాడు



● ప్రారంభోత్సవంలో చిత్రబృందం

ఒక వ్యక్తి బాగా అందంగా ఉంటే నూటొక్క జిల్లాల అందగాడు అని సంబోధిస్తారు. అప్పట్లో నూతన్ ప్రసాద్‌ని అలా పిలిచేవారు. ఇప్పుడు తాజా సినిమా కోసం అవసరాల శ్రీనివాస్ నూటొక్క జిల్లాల అందగాడిగా మారనున్నారు. అవసరాల శ్రీనివాస్, రుహానీ శర్మ జంటగా తెరకెక్కనున్న చిత్రం 'నూటొక్క జిల్లాల అందగాడు'. 'దిల్' రాజు, దర్శకుడు క్రిష్ సంయుక్తంగా ఈ సినిమాను సమర్పించడం విశేషం. శిరీష్, రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. సాగర్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఈ చిత్రానికి రచయిత: అవసరాల శ్రీనివాస్, సంగీతం: స్వీకార్ అగస్తీ.

# పాట.. మాట.. నటన



● మంగ్లీ

నటుడు సత్యప్రకాశ్ కుమారుడు నటరాజ్ 'ఊల్లాలా ఊల్లాలా' చిత్రం ద్వారా తెరంగేట్రం చేస్తున్నాడు. నటరాజ్, నూరిన్, అంకిత హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రమిది. ఏ. గురురాజ్ నిర్మించిన ఈ చిత్రానికి సత్యప్రకాశ్ దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని నవంబర్‌లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర చేయడంతో పాటు, ఓ పాట పాడి, హీరోయిన్ నూరిన్‌కి డబ్బింగ్ చెప్పారు తెలంగాణ ఫోక్ సింగర్ మంగ్లీ. ''బిగ్‌బాస్–2'ఫేమ్ రోల్ రైడా కూడా ఓ పాట పాడి, నటించారు'' అని గురురాజ్ అన్నారు.

# ఫలితాన్ని పట్టించుకోను



● శోభితా ధూళిపాళ్ల

'నటీనటులకు భాషా భేదాలు అనేవి ఉండకూడదు. ఒకకథ చెప్పడానికి ఏ భాషకైనా, ఏ ప్లాట్‌ఫామ్‌కి అయినా వెళ్లాలి' అన్నారు శోభితా ధూళిపాళ్ల. 'గూఢచారి'తో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈ హైదరాబాదీ భామ ప్రస్తుతం హిందీ, మలయాళ భాషల్లో సినిమాలు చేస్తూనే అమేజాన్, నెట్‌ఫ్లిక్స్‌లో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. విభిన్న భాషల్లో సినిమాలు చేయడం గురించి శోభిత మాట్లాడుతూ – ''యాక్టర్‌గా నన్ను నేను కథకు రాలిగా చూస్తాను. కథను ఏ భాషలో చెబుతున్నాం, ఏ ప్లాట్‌ఫామ్‌లో చెబుతున్నాం అనేది పెద్దగా పట్టించుకోను. ఫీచర్ ఫిల్మ్ అయినా వెబ్ అయినా ఒకటే ఆసక్తితో నా పాత్రను చేస్తాను. ఒక మంచి కథ ఉంటే నటిగా వంద శాతం కష్టపడతాను. ఫలితం పెద్ద పట్టింపు కాదు. ఆ ప్రక్రియను ఆస్వాదించడానికి ప్రయత్నిస్తాను'' అన్నారు శోభితా ధూళిపాళ్ల.












# యోగ యోగి యోగాంతం

సాధారణంగా యోగ ప్రధాన లక్ష్యం భగవంతుని ఉనికిని అనుభవించడం, అదీ అంతిమంగా సమాధిస్థితిలో. భగవంతుడు అంటే మన ఊహకి గాని, ఆలోచనకి గాని అందనివాడు అని పెద్దలు చెబుతుంటారు. అయితే ఊహకే అందని ఆ భగవంతుడిని యోగా ద్వారా అర్థం చేసుకోవడం ఎలా? ఆయనను చేరుకోవడం ఎలా? అన్న ప్రశ్నలకు సమాధానమే క్రియాయోగ. మన మేధస్సుకు అసాధ్యంగా భావించే ఈ స్థితిని క్రియా యోగ ద్వారా ఎలా సుసాధ్యం చేయవచ్చో చూద్దాం.



**యో**గసాధనలో మనకు అనేక దశలు అనుభవంలోకి వస్తాయి. మొదటి దశ శరీరంలో అనుభూతి తో మొదలవుతుంది. అదెలాగంటే యోగ సాధన చేస్తున్నప్పుడు శరీరం క్రమేణా ఆరోగ్యవంతమవుతుంది. శారీరక బాధలు, నొప్పులు తగ్గిపోతాయి. జీర్ణశక్తి మెరుగవుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు క్రమపద్ధతిలో జరుగుతాయి. నాడీవ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఇదంతా యోగాసనాల సాధన ద్వారా తొలిదశలో సాధ్యం అవుతుంది. యోగసాధకుల శరీరంలో జరిగే ఈ ఆరోగ్య ప్రక్రియే భగవంతుని శక్తి.

**నిరంతర యోగసాధన ద్వారా ఇలా శారీరక రుగ్మతలు, బాధలను అధిగమించే స్థితినుంచి నిర్వికల్ప సమాధిస్థితికి చేరుకోగలుగుతాడు. సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఉనికిని అనుభవించగలుగుతాడు, క్రమేణా మహావతార బాబాజీ అధ్యాత్మ స్థితికి చేరుకుంటాడు. అంతిమంగా తేజస్సులో లీనమైపోతాడు. ఆది, అంతం లేని విశ్వవ్యాపమైన నిరంజన, నిర్వాణ, కైవల్యస్థితిలో ముక్తి పొందుతాడు. భగవంతునిలో లీనమైపోతాడు.**

ఇక భగవంతుని ఉనికి తెలుసుకోవడంలో తదుపరిదశ మానసికమైనది. భావోద్వేగాలు, విపరీత ధోరణులు సద్దుమణిగి పోతాయి. ఆందోళనలు, కోపతాపాల స్థానంలో భక్తి, ప్రేమ, వాత్సల్యం చోటు చేసుకుంటాయి. కుటుంబీకులు, బంధుమిత్రుల ద్వారా సంభవించిన అవమానాలు, కష్టనష్టాల తాలూకు భావనలన్నీ కుండలినీ ప్రాణాయామం ద్వారా సమసిపోతాయి.

ఉఛ్వాస నిశ్వాసాలను క్రమబద్ధీకరించే ఈ మానసిక ప్రక్రియ ప్రాణాయామం ద్వారా మానసిక రుగ్మతలే కాకుండా, కడుపులో పుండ్లు, ఉబ్బసం వంటివి కూడా తగ్గిపోతాయి.

ఇక తరవాతిదశలోకి వద్దాం. ఈ దశలో భావోద్వేగాలన్నీ భక్తిభావమయం అయి భగవంతునివైపు సాగిపోయే భక్తిప్రవాహంలా జీవితం మారిపోతుంది. భజనలు, కీర్తనల ద్వారా భగవదారాధన నిత్యకృత్య మవుతుంది. యోగాప్రక్రియ నిరంతర సాధన ద్వారానే ఇది సాధ్యమవుతుంది. క్రమేణా యోగిలో ఏకాగ్రత (ధారణ), ధ్యానం అలవడతాయి. మనసు నిశ్చలస్థితికి చేరుకుంటుంది. ఎటువంటి అలజడులు లేని ఈ మానసిక స్థితి అద్భుతమైనది.

క్రియాయోగ

ఈ స్థితినుంచి జీవనయానం క్రమేణా సమాధిస్థితి వైపు సాగిపోతుంది. ఎటువంటి ఆలోచనలు లేని నిశ్చలస్థితికి యోగి మనసు చేరుకుంటుంది. సద్గురు ఇచ్చే ప్రత్యేకమైన, విశేషమైన సూచనల ద్వారా మనసు క్రమేణా అంతర్ముఖమవుతుంది, అంతరంగం ప్రకాశవంత మవుతుంది. అంతమాత్రాన భగవంతుని ఉనికిని అర్థం చేసుకునే స్థితికి మనసు చేరుకున్నట్టు కాదు. నిరంతర యోగసాధన ద్వారా మాత్రమే యోగి క్రమేణా ఈ స్థాయికి చేరువ అవుతాడు.

ఆ తర్వాత మరింత యోగసాధన ద్వారా యోగి తనను తాను అర్పించుకునే స్థితికి చేరుకుంటాడు. మనసంతా ఆధ్యాత్మిక వెలుగుతో తేజో మయమవుతుంది. ఆ తేజస్సులో లీనమైన అనుభూతిని పొందుతుంది. క్రమేణా యోగి తానే తేజస్సుగా మారిపోతుంటాడు.

మానసిక పరిపక్వత పరిఢవిల్లుతుంది. చైతన్యం, చురుకుతనం వికసిస్తాయి. దేవీదేవతలు, సాధు పుంగవుల సాక్షాత్కారం అనుభవంలోకి వస్తుంది. యోగి తను భక్తుడిననే స్పృహ కోల్పోయే సర్వికల్ప సమాధిస్థితికి చేరతాడు. అనంతరం యోగితేజస్సులో లీనమయ్యే స్థితికి చేరువవుతాడు. ఆ తేజస్సులో తాదాత్మ్యం చెందుతాడు. బ్రహ్మానందభరితుడవుతాడు.

యోగమార్తాండ యోగి రాజ సిద్ధనాథ్ ఒక హిమాలయ యోగి. క్రియాయోగ సాధనపై శిక్షణ ఇస్తారు. హైదరాబాద్, విశాఖపట్నంలో త్వరలో జరగబోయే కార్యక్రమాల వివరాలకు www.hamsakriya.org చూడచ్చు.

**– సిద్ధనాథ్ హంస యోగ్ సంఘ్**



గురు సన్నిధి

# పరమహంస యోగానంద

**సా**ధారణమైన వ్యక్తుల కథ కేవలం అక్షరాలతో తయారవుతుంది. కాని యోగుల ఆత్మకథలు మాత్రం అనుభవాలతో కూడి తరువాతి తరాలకు మార్గదర్శకాలవుతాయి. చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయి. భారతీయ సంస్కృతికి గౌరవాన్ని ఇనుమడింపచేసి చరిత్రపుటల్లో నిలిచిన యోగిగురువులు పరమహంస యోగానంద. వీరు సనాతన ధ్యాన ప్రక్రియ అయిన క్రియాయోగాన్ని విశ్వవ్యాప్తం చేసి భారతీయ యోగస మున్నతిని విశ్వమంతా చాటారు.



**భక్తిభావం... క్రియాయోగం**

ఎంతోమంది మహనీయులకు జన్మనిచ్చిన గోరఖ్‌పూర్ ప్రపంచానికి అందించిన యోగిరత్నమే ముకుందలాల్ ఘోష్. బాల్యం నుంచే భక్తిభావాలతో యోగవిద్యను తెలుసుకునేందుకు పలువురు సాధువులను, సన్యాసులను కలుసుకునే సందర్భంలో పదిహేడో ఏట కోల్‌కతాలో ఓ సాధువును కలిశారు. వారే యుక్తేశ్వరగిరి. వీరి వద్దే సన్యాసాశ్రమ స్వీకారం చేసి స్వామియోగానందగా గుర్తింపుపొందారు. క్రియాయోగ సాధనలో మెలకువలనూ నేర్చారు.

**యోగవిద్యకు ప్రాచుర్యం**

అనంతరం పశ్చిమబెంగాల్‌లో తొలి యోగ పాఠశాలను స్థాపించారు. ఆ మరుసటి ఏడాదే రాంచీలో మరో యోగ పాఠశాలను స్థాపించగా, తర్వాతి కాలంలో అదే భారత యోగా సత్సంగంగా రూపొందింది. పిమ్మట ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాలలో పర్యటించి భారతీయ యోగవిద్యకు విశేష ప్రచారం కల్పించారు. వీరి ప్రభావంతో క్రియాయోగం వైపు మళ్లిన వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు.

**వినోదం, విజ్ఞానం... కలిస్తే ఒక పుస్తకం**

ఖండాంతర కీర్తికలిగిన యోగానంద మహనుభావుని జీవిత చరిత్రను 'ఒక యోగి ఆత్మకథ' పేరుతో గ్రంథరూపంలో ప్రకటించారు. ఈ గ్రంథం 20వ శతాబ్దపు 100 అత్యుత్తమమైన గ్రంథాలలో ఒకటిగా పేరుగాంచి నేటివరకు ఎన్నో ముద్రణలను పొందుతూ భారతదేశపు ప్రాచీన విజ్ఞానసారాన్ని ప్రపంచానికి అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఇరవై ఆరు భాషల్లోకి అనువదించబడిన ఈ పుస్తకం ఎంతోమంది సత్యాన్వేషకుల ఆధ్యాత్మిక పిపాసను తీర్చుతోంది.

**కృషియే సాధనం**

మనిషి చేసే మానసిక ఆధ్యాత్మిక కృషికి మాత్రమే శాశ్వతమైన విలువ ఉంటుందనీ, మనిషి తనశక్తిని సరిగ్గా ఉపయోగించగలిగితే భౌతికంగా ఎదురయ్యే ఎన్నో అవరోధాలను జయించగలడనీ వీరి జీవితం ద్వారా మనం గ్రహించగలం. చెడును మంచితోనూ, విచారాన్ని సంతోషంతోనూ, క్రూరత్వాన్ని దయతోనూ, అజ్ఞానాన్ని జ్ఞానంతోనూ జయించగలమనే వీరి సందేశం శిరోధార్యం. మానవ అస్తిత్వపు అంతిమ మర్మాలను విడమరిచే యోగానందుల జీవితాన్ని అర్థం చేసుకుని వాటిని ఆచరణలో పెట్టగలిగితే మనిషి జీవితం ఉన్నతమవుతుంది.

**– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

సువార్త

# ధన్యకరమైన విశ్వాసి దానియేలు



**దా**నియేలు, షద్రక్, మేషక్, అబేద్నిగో అనే నలుగురు యూదు యువకుల విశ్వాసాన్ని ప్రస్తావిస్తూ, వాళ్ళు 'సింహాల నోళ్లు మూశారు, అగ్ని బలాన్ని చల్లార్చారు... బలహీనులైనా బలపర్చబడ్డారు' అని బైబిల్ పేర్కొంది (హెబ్రీ 11:33.34). విశ్వాసం బలహీనుల్ని కూడా మహా బలులను చేస్తుంది. దానియేలు యుక్తవయసులో యెరూషలేము నుండి బబులోను చెరకు బానిసగా వచ్చాడు. కానీ బబులోను చక్రవర్తి దర్యావేషు అతని విశేష ప్రతిభను గుర్తించి, అక్కడి 120 మంది ఉన్నతాధికారులపైన నియమించబడిన ముగ్గురు అత్యున్నతాధికారుల్లో ముఖ్యుడుగా అంటే ప్రధానమంత్రిగా దానియేలును నియమించాడు (దాని6:1,2). ఒక యూదు బానిసకు అన్యదేశంలో దేవుడిచ్చిన అరుదైన ఆధిక్యత, గుర్తింపు ఇది. అయితే దానియేలును ఓర్వలేకపోయిన ఆ 122 మంది అధికారులు కుట్రతో ముప్పై రోజుల పాటు దేశంలో రాజును తప్ప మరెవరినీ ఆశ్రయించకూడదన్న శాసనాన్ని తెచ్చారు. దానియేలు మాత్రం తన గది కిటికీలు తెరిచి మరీ ఆ ముప్పై రోజులూ తన దేవునికి ప్రార్థించగా, అధికారుల వత్తిడి మేరకు చక్రవర్తి ఆకలితో నకనకలాడుతున్న సింహాలున్న గుహలో అతన్ని వెయ్యగా, దేవుడు అద్భుతంగా సింహాల నోళ్లు మూసివేసి అతన్ని సజీవంగా కాపాడాడు. పిదప కుట్రదారులైన అధికారులనందరినీ చక్రవర్తి అదే గుహలో వేయగా సింహాలు వారిని తినేశాయి.

దానియేలు బబులోను చక్రవర్తికి విధేయుడే. కాని అతని అత్యున్నతమైన, అంతిమమైన విధేయత మాత్రం చక్రవర్తికి పైగా ఉన్న దేవునికే!! విశ్వాసాన్ని ప్రసంగాల్లో, మాటల్లో, సిద్ధాంతాల్లో ఒలకబోస్తే ప్రయోజనం లేదు. క్రైస్తవం మాటల్లో కాదు, చేతల్లో, ఆచరణలో రుజువయ్యే విశ్వాస పథం. పాత నిబంధనలోని 39 పుస్తకాల్లోనూ దైవజనులు ఎన్నెన్నో గొప్ప విశ్వాసకార్యాలు చేశారు. కాని మొత్తం పాతనిబంధనలో 'విశ్వాసం' అనే మాట కేవలం రెండే రెండు సార్లు వాడారు. కాని వారి మహాకార్యాలను వివరించే హెబ్రీ 11 వ అధ్యాయంలోనే, 'విశ్వాసం' అనే పదాన్ని పరిశుద్ధాత్ముడు 40 వచనాల్లో 24 సార్లకు పైగా వాడాడు. విశ్వాసమనే మాటే వాడకుండా, అంతటి మహా విశ్వాసాన్ని ఆచరణలో చూపిన పాత నిబంధన కాలపు విశ్వాస వీరుల ముందు, పొద్దున్నుండి సాయంత్రం దాకా విశ్వాసం పైనే ప్రసంగాలు చేస్తూ, విశ్వాసులమని పిలిపించుకొంటూ, విశ్వాసాన్ని ఆచరణలో మాత్రం అణువంతైనా చూపలేని నేతి బీరకాయల్లాంటి మనమెక్కడ నిలుస్తాం?? సింహాల గుహలో పడ్డాక దానియేలును రక్షించే బదులు, అసలు సింహాల గుహలో పడకుండా దేవుడతణ్ణి రక్షించలేడా? అని ప్రశ్నించొచ్చు. తప్పకుండా రక్షించగలడు, కాని సీసాలోని మాత్ర శరీరంలోకి వెళ్లి రుగ్మతను పారదోలితేనే కదా దానికి విలువ? ఆచరణలో రుజువు కాని విశ్వాసానికి ఆవగింజంత కూడా విలువ లేదు. విశ్వాసాన్ని ఆచరణలో చూపలేని పిరికివాళ్ళకు, వాళ్ళెంతటివారైనా, పరలోకంలోకి ప్రవేశం లేదు. క్రీస్తు ఆచరించి బోధించిన విశ్వాసం, ప్రబోధాలు, నీతిమాటలు, సూక్తులకు అతీతమైనది. అంతటి మహత్తరమైన విశ్వాసానికి డబ్బు రూపాన్ని, లోక సంబంధమైన ఆస్తులు, విలాసాల రూపాన్నివ్వడం భ్రష్టత్వం!! సమాజంలో ఎంత ఉన్నతస్థాయి ఉంటే, ఎంత డబ్బుంటే వాళ్ళు అంత గొప్ప పరిచారకులు, విశ్వాసులనడం దౌర్భాగ్యపు వక్రీకరణ, అది కేవలం అవకాశవాదం, ఆత్మీయావగాహనా లోపం. చైనా దేశాన్నంతా సువార్తమయం చేసిన హడ్సన్ టేలర్ ఒకానొక సమయంలో పస్తులుంటూ, ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతూ 'నా జేబులో 25 పైసలే ఉన్నాయి, కాని నా గుండెలో మాత్రం దేవుడిచ్చిన బోలెడు వాగ్దానాలున్నాయి' అంటూ భార్యకు రాసిన ఉత్తరం ఇప్పటికీ లండన్ మ్యూజియంలో ఉంది. ఆ విశ్వాసంతోనే చైనాలో టేలర్ చేసిన మహా కార్యాలు దేవుని జీవగ్రంథంలో శాశ్వతంగా లిఖించబడి ఉన్నాయి. నా వద్ద 25 పైసలే ఉన్నాయంటూ ప్రకటించిన హడ్సన్ టేలర్ కోట్లలో తేలియాడుతున్న ఈనాటి మెగా సేవకులు, సెలెబ్రిటీ ప్రబోధకులతో పోల్చితే నిరుపేదవాడే!! అయితే కేవలం విశ్వాసంతో దేవుని వాగ్దానాలు నమ్మి చైనా నిండా సువార్తను నింపిన హడ్సన్ ముందు ఈ పరిచారకులు, ప్రబోధకులవి కుప్పిగంతులే, చిరిగిన మురికి వస్త్రాలే!!!

**– రెవ.డా.టి .ఎ.ప్రభుకిరణ్**
సంపాదకులు: **ఆకాశధాన్యం**
email:prabhukirant@gmail.com

ఇస్లాం వెలుగు

# అన్ని స్థితులూ ఆ దైవం కల్పించినవే!



**జీ**వితం విభిన్న స్థితుల సంగమం. సుఖ దుఃఖ సమ్మేళనం. సంతోషం- బాధ, ఆనందం- విచారం, తీపి- చేదు; శీతలం- ఉష్ణం; సంతృప్తి- అసంతృప్తి; శాంతి-అశాంతీ ఉన్నాయి. ఇదంతా దైవాభీష్టం.

అందుకని ఎటువంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ నిరాశానిస్పృహలకు లోను కాకూడదు. ఇవన్నీ దేవుని తరపునే అని భావిస్తూ, ఆ కరుణామయుడే వీటినుండి విముక్తి కలిగిస్తాడని నమ్మాలి. ఇదే విధంగా కష్టాలు దూరమై, పరిస్థితులు మెరుగు పడి, అంతా సజావుగా జరిగిపోతూ, సుఖసంతోషాలు ప్రాప్తమైతే అది తమ గొప్పదనమేనని, తమ రెక్కల కష్టార్జిత ఫలితమేనని భావించి విర్రవీగకూడదు. ఇదంతా అల్లాహ్ అనుగ్రహమని, ఆ కరుణామయుని ప్రసాదితమన్న విశ్వాసంతో ఉండాలి. ఆయన ఎప్పుడు కోరితే అప్పుడు తాను ప్రసాదించిన అనుగ్రహాలను తిరిగి లాక్కోగలడు. కాబట్టి ప్రతి అనుగ్రహానికీ ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఉండాలి. అల్లాహ్ ఇలా అంటున్నాడు:'మానవులారా! నా ప్రసన్నత కోసం, నేను ప్రసాదించే పుణ్యాన్ని పొందే సంకల్పంతో, దుఃఖ సమయం ఆసన్నమైనప్పుడు సహనం వహించినట్లయితే, నేను స్వర్గం కన్నా తక్కువైన దాన్ని, స్వర్గం తప్ప మరిదేన్నీ మీకు ప్రసాదించడానికి ఇష్టపడను.'ప్రతి వ్యవహారంలో, ప్రతిస్థితిలోనూ వారికి శుభాలే శుభాలు. వారికి శాంతి, సుఖ సంతోషాలు ప్రాప్తమైతే దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. ఇది వారి పాలిట శుభాలపంట. ఒకవేళ వారికి దుఃఖ విచారాలు కలిగితే, ఇదీ దైవ నిర్ణయమేనని భావిస్తూ సహనం వహిస్తారు. ఈ సహనం వహించడం కూడా వారి పాలిట శుభాల పంటే అవుతుంది.

ప్రాపంచిక జీవితంలో కష్టనష్టాలు, సుఖ సంతోషాలు చాలా సహజ విషయాలు. వీటి ద్వారా దైవప్రసన్నత, ఆయన సామీప్యం పొందడానికి శక్తివంచనలేని ప్రయత్నం చేయాలి. సుఖ సంతోషాలు, శాంతి సంతృప్తులు ప్రాప్తమైనప్పుడు దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకోవాలి. కష్టాలు కడగండ్లు ఎదురైతే, జరగరాని సంఘటనలు ఏమైనా జరిగి కష్టనష్టాలు, బాధలు సంభవిస్తే సహనం వహించాలి. అంటే, అన్ని స్థితులనూ సమానంగా ఆస్వాదించగలగాలి. ఇలాంటి వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. తన కారుణ్య ఛాయలో చోటు కల్పిస్తాడు.

**– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

స్త్రీ వైశిష్ట్యం - 13

# మహా పతివ్రత గాంధారి

**ఈ** దేశంలో కొంతమంది స్త్రీల చరిత్ర పరిశీలిస్తుంటే ఎంతో ఆశ్చర్యం కలుగుతుంది. అటువంటి ఉదాత్త స్త్రీలలో గాంధారి ఒకరు. ఆమె సుబలుడనే గాంధార రాజు కుమార్తె. మహా సౌందర్యవతి. మెరుపు తీగ. ఎక్కువ మంది సంతానం కలగాలని వరం పొందింది. సకల సుగుణ రాశి. చిత్రాంగదుడు, చిత్ర వీర్యుల దగ్గరనుంచీ ఎప్పుడూ సంతానం లేక కురువంశం బాధపడుతూ ఉండేది. కురువంశం అవిచ్ఛిన్నంగా కొనసాగుతుందని భీష్మాచార్యులవారు ఆమెను తీసుకొచ్చి ధృతరాష్ట్రుడికిచ్చి వివాహం చేయాలనుకున్నారు. ధృతరాజు పుట్టుకతో కళ్ళులేనివాడు. అటువంటి వ్యక్తిని అంత సౌందర్య రాశి ఎందుకు వివాహం చేసుకోవాలి? సుబలుడు అడిగాడు-'అమ్మా! నీ కిష్టమేనా' అని. ఆమె మామూలుగా అంగీకరించడం కాదు, అపారమైన ఔదార్యంతో అంగీకరించింది. ఎవరివలన అవతలివారి వంశం నిలబడితే, కళ్ళులేనివాడు తాను కూడా బిడ్డల్ని పొందానని సంతోషిస్తే అంతకన్నా తన జన్మకి సుకృతి ఏముంటుందని అంగీకరించింది. మహాతల్లి ఇంకా ఏమందో తెలుసా...''నా భర్త ఏవి చూసి సంతోషించడంలేదో అవి చూసి నేను కూడా సంతోషించను..అని చెప్పి తన కళ్ళకు గుడ్డ కట్టేసుకుంది.

భర్త పెను వేప విత్తు. పరమ దుష్ట ఆలోచనలున్నవాడు, పెద్ద కొడుకు దుర్యోధనుడు. నూరుగురు కొడుకులు. అల్లుడు సైంధవుడు, నీచుడు.. ఇంతమంది దుష్టుల మధ్యలో ఆమె పుటం పెట్టిన బంగారం. ఆమె ఔదార్యం ఎంతటిదంటే- ఒకనాడు ధృతరాష్ట్రుడు భార్యని పిలిచి అడిగాడు..''పాండవులకు రాజ్యం ఇవ్వకుండా మన కుమారుడికి రాజ్యం ఇవ్వాలనుకుంటున్నాను. పట్టమహిషివి. నీ అభిప్రాయం ఏమిటి?''... ఆమె కుండబద్దలు కొట్టినట్లు జవాబిచ్చింది-'' మహారాజా 'మీకడుపున పుట్టిన దుర్యోధనుడు పరమ నీచుడన్న విషయం మీకు తెలియదా! వాడు నీచుడని తెలిసీ, రాజ్యం ధర్మంగా రాదని తెలిసీ, పాండురాజు కొడుకైన ధర్మరాజుకు వెడుతుందని తెలిసీ ఎందుకు కుట్ర చేస్తారు? మీ తమ్ముడి బిడ్డలు మీ బిడ్డలు కారా? ధర్మరాజుకు దక్కవలసిన రాజ్యం అతనికి ఇవ్వలేరా? కొడుకు, కొడుకన్న పుత్రవ్యామోహంలోపడి ఎందుకు పరుగెడుతుంటారు? మీరు చక్రవర్తులు, మీరెలా ఇవ్వాలనుకుంటే అలా ఇవ్వచ్చు. ఈ కురు సామ్రాజ్యన్నంతటినీ ధర్మరాజుకు ధారాదత్తం చేస్తే ఎదురుపడి ఆపగలిగిన వాళ్లున్నారా? భీష్మద్రోణాదులు ధర్మపక్షాన నిలబడరా? దుర్యోధనుడు నిన్ను చెణకగలడా? వాడిని ధర్మరాజు దగ్గరపెడితే వాడు వశవర్తియై బతకడా? అప్పటికయినా బుద్ధి మార్చుకోడా? మీ కొడుకు దీర్ఘాయుర్దాయం అంతా మీ చేతిలోనే ఉంది మహారాజా! మీ బిడ్డలని పుత్రపాశములకు వశపడవద్దు. రాజ్యాన్ని ధర్మరాజుకు, ఆయన తమ్ముళ్ళకి ఇచ్చేయండి.''


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



నిజంగా ఎటువంటి ఇల్లాలు ఆ తల్లి, అలా నిలబడగలిగిన వాళ్లు ఈ లోకంలో ఉంటారా?

నూరుగురు కొడుకులు చచ్చిపోయిన తరువాత ధర్మరాజు వచ్చి ''అమ్మా! నీ బిడ్డలను అందరినీ చంపిన పాపిష్టివాడిని నేనేనమ్మా, ధర్మం కోసం చంపానే గానీ, నా అంత నేను చంపలేదమ్మా! అది తప్పనిపిస్తే నన్ను కాల్చేయమ్మా'' అన్నాడు. ఆమె ఒక్కమాట అనలేదు. కళ్ళవెంట నీరు కారింది. ధర్మరాజుని కౌగిలించుకుంది. కాన్నీ ఒక్క బిడ్డకూడా బతికిలేడనే బాధతో ఆమె చూసినపుడు కళ్ళగంత ఒక్కసారి సడలి ఆమె దృష్టి పడినందుకు ధర్మరాజంతటి వాడి కాళ్ళు బొబ్బలెక్కాయి. అంతటి పతివ్రత గాంధారి.

ప్రశ్నోత్తర భారతం



## పాండురాజు కథ

373. కౌరవుల విద్యాభ్యాసం కోసం ధృతరాష్ట్రుడు ఎవరిని నియమించాడు?
374. కృపాచార్యుడు ఎవరు?
375. పాండురాజు మరణానంతరం ఏం జరిగింది?
376. కుంతీదేవి ఎలా ఉంది?
377. మునులలో వృద్ధుడు సభను ఉద్దేశించి ఏమని పలికాడు?

**- నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ**

జవాబులు: 373) కృపాచార్యుని నియమించాడు.374) వేదవిద్యయందు ఆరితేరినవాడు. అందువలన అతడిని గురువుగా నియమించారు.375)కుంతీదేవి అనుమతితో పాండవులను మునులు హస్తినాపురానికి తీసుకువచ్చారు.376)కుంతీదేవి దుఃఖంతో శోకమూర్తిలా ఉంది. హస్తినకు చేరగానే ఆమెను అందరూ ఓదార్చారు. పాండవులను ముద్దాడారు.377)పాండురాజు మునివృత్తి అవలంబించాడు. ధర్మదేవుడు, వాయుదేవుడు, ఇంద్రుడు, అశ్వినీ దేవతల వలన పాండవులు జన్మించారు. పాండురాజు మరణంతో మాద్రి సహగమనం చేసింది. వారి అస్థికలను తెచ్చాము. విధిప్రకారం పితృక్రియలు జరిపించండి అన్నారు.

ఆలయం ఆగమం

# పరివార ఆలయాలు - దేవతలు

**ఆ**లయానికి దేవాలయం.. దేవస్థానం అనే పేర్లు ప్రచారంలో ఉన్నా ఆగమం అందులో ఓ తేడాను చెప్తుంది. గర్భగుడి.. గుడిలో మూలమూర్తి లేదా శివలింగం.. ఎదురుగా నంది/వాహనం... ధ్వజస్తంభం..బలిపీఠం ఇవి మాత్రమే ఉంటే దాన్ని దేవాలయం అంటారు. అదే వీటితోపాటు దేవి, గణపతి, స్కందుడు, చండేశ్వరుడు, పరివార దేవాలయాలు, అనేక శాలలు, గోపురాలు ఉన్న దాన్ని దేవస్థానం అంటారు.

శయనాలయం దర్శించుకున్న భక్తులు ఆ తర్వాత తప్పనిసరిగా ఆలయం చుట్టూ ఉన్న చిన్న చిన్న ఆలయాలను దర్శించుకోవాలి. వాటిలో ఉన్న దేవతలను పరివార దేవతలు అంటారు. పరివార దేవతలను తప్పక దర్శించాలి అన్నది ఆలయ నియమం.

స్వామివారి దేవేరులు.. పిల్లలు...ద్వార దేవతలు... దిక్పాలకులు.. గణనాయకుడు.. సేనాపతి... ఋషులు.. భక్తులు వీళ్లంతా పరివారదేవతలుగానే పరిగణించబడతారు. పరివార దేవతలందరికీ చిన్న చిన్న దేవాలయాలు ఉంటాయి. రాజు ఒక పనిని తన పరివారం తోడ్పాటుతో పూర్తి చేసినట్లే... ఇక్కడ భగవంతుడు తన భక్తుల కోర్కెలను కూడా ఈ పరివార దేవతల ద్వారా తీరుస్తాడు. ఈ పరివార దేవతలనే ఆవరణ దేవతలు, ఉపదేవతలు అని కూడా అంటారు. వీరిని మూలమూర్తితో పాటు నిత్యం పూజిస్తారు. ఈ పరివారమూర్తులను ప్రతిష్ఠించడం దేవాలయానికి శోభను.. శాంతిని... మరింత పవిత్రతను.. తెచ్చిపెడుతుందని శ్రీ ప్రశ్నసంహిత చెబుతుంది. ఈ పరివార దేవతలు సామాన్యంగా ఎనిమిది మందితో మొదలై గరిష్టంగా అరవైనాలుగుమంది వరకూ ఉంటారు. మొదటి ప్రాకారంలో.. అంటే గర్భగుడి చుట్టూ ఎనిమిదిమంది ... రెండవ ప్రాకారంలో పదహారుమంది... మూడవ ప్రాకారంలో ముప్పైరెండుమంది పరివార దేవతలుండాలని మానసార శిల్పశాస్త్రం చెప్పింది. పన్నెండుమంది పరివారదేవతలుంటే ఉత్తమం అని సనత్కుమారసంహిత చెప్తుంది. వైఖానసాగమంలో ఎనిమిదిమందితో మొదలై.. ఏడుప్రాకారాలు.. నూటపన్నెండుమంది పరివారదేవతల వరకు ఉంది. అలా ఉన్న ఆలయమే ఉత్తమోత్తమమైనది అని చెప్తోంది.



శివాలయానికి దేవి, నంది, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అగ్నిదుర్గా, అగస్త్యుడు, బ్రహ్మ, సప్తమాతృకలు, వీరభద్రుడు, విష్ణువు, శివసూర్యుడు, జ్యేష్ఠ పరివారదేవతలుగా ఉంటారు.

విష్ణ్వాలయానికి దేవేరులు శ్రీదేవి-భూదేవి, గరుడుడు, విష్వక్సేనుడు, చక్రమూర్తి, దశావతారాలు, పంచమూర్తులు, నవమూర్తులు, ద్వాదశాదిత్యులు పరివారదేవతలు. శక్తి ఆలయానికి జయా, విజయా, అజితా, అపరాజితా, విభక్తా, మంగళా, మోహినీ, స్తంభినీ అనే ఎనిమిదిమంది దేవతలు. పరివారదేవతలను దర్శించి మూలమూర్తి దగ్గర కోరిన కోరికలు మరోమారు తలుచుకుంటే మన కోరికలు తప్పక నెరవేరుతాయన్నది ఆగమ శాస్త్రోక్తి.

**– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

బౌద్ధవాణి

# పాపమా? పుణ్యమా?!

**శ్రా**వస్తి బౌద్ధ సంఘంలో విమలుడు మంచి భిక్షువు. బుద్ధుని ప్రబోధాల్ని చక్కగా ఆచరిస్తాడని పేరు. పంచశీల పాటించడంలో మేటి. ఒకరోజున ఒక అడవిమార్గంలో వెళ్తున్నాడు విమలుడు. అతని చెవికి ఒక జింక రోదన వినిపించింది. వెంటనే విమలుడు ఆ ఆర్తి, అరుపు వినిపించే వైపుకు నడక సాగించాడు. కొంతదూరం వెళ్లేసరికి అక్కడ ఒక జింక, దాని పిల్లలు కనిపించాయి.

అవి తల్లి చుట్టూ తిరుగుతున్నాయి. అది గింజుకుంటూ మోర పైకెత్తి అరుస్తోంది. విమలుడు దగ్గరకి వెళ్లాడు. తల్లి జింక భయంతో మరింత బిగ్గరగా అరిచింది. పిల్ల జింకలు రెండూ దూరంగా పారిపోయాయి.

ఎవరో వేటగాడు ఉచ్చులు పన్నాడు. ఆ ఉచ్చులో తల్లి జింక కాలు తగిలించుకుంది. అది ఎప్పటినుండి బలవంతాన లాక్కుంటోందో గానీ, ఆ ఉచ్చు మరింత బిగుసుకుపోయింది. కాలి చర్మం కూడా చీరుకుపోయి ఉంది. విమలుడు వెంటనే ఆ ఉచ్చు తొలగించాడు. తల్లి జింక విమలుడి వంక మెరిసే కళ్లతో చూస్తూ తన పిల్లల దగ్గరకు గెంతుతూ అరుస్తూ వెళ్లిపోయింది. ఈసారి దాని అరుపులో ఆనందం వినిపిస్తోంది.

విమలుడు వాటివైపు చిరునవ్వుతో చూస్తూ ఉండిపోయాడు. అంతలో.. అతని వెనుకనుండి... ''ఓరీ! బోడిగుండూ! దుర్మార్గుడా! ఎంత పని చేశావు?''అనే అరుపు వినిపించి వెనక్కి తిరిగాడు. వేటగాడు కోపంతో తన దగ్గరకు వేగంగా వస్తున్నాడు. ''నేను ఆహారం కోసం ఉచ్చులు పన్నాను. నాకు దొరికిన ఆహారాన్ని నాకు కాకుండా చేశావు. నీవు చేసిన ఈ పనివల్ల ఈ రోజు నా కుటుంబం పస్తుండాలి. మా నోటికాడ కూడు తీసిన పాపం నీదే...'' అని తిట్టుకుంటూ ఉచ్చులు తీసుకుని భిక్షువు వంక చుర చుర చూస్తూ చరచరా వెళ్లిపోయాడు.



విమలుడు దారిలోకి వచ్చి ఆలోచిస్తూ నడక ప్రారంభించాడు.

''నేను పాపం చేశానా?పుణ్యం చేశానా?'' అనే సందేహంలో పడ్డాడు. ఆరామానికి వచ్చి, బుద్ధుని దగ్గరకు వెళ్లి, నమస్కరించి, విషయం చెప్పాడు. ''విమలా! నీవు చేసింది పాపం కాదు. జీవ కారుణ్యానికి మించిన ధర్మం లేదు. నీవు శీల భ్రష్టుడివి కావు. నిందితుడివి కావు'' అని మెచ్చుకున్నాడు.

ఒక మంచిపని చేయడం వల్ల కొందరు నిందించినా బాధపడకూడదని విమలునికి అర్థమైంది.

**– డా. బొర్రా గోవర్ధన్**

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

ఆదివారం
20-10-2019


# ఉద్యోగ సమాచారం

## ఇస్రోలో 327 పోస్టులు

భారత అంతరిక్ష విభాగానికి చెందిన ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 327 సైంటిస్టు/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ఎలక్ట్రానిక్స్-131, మెకానికల్-135, కంప్యూటర్ సైన్స్-58, ఎలక్ట్రానిక్స్ (అటానమస్ బాడీ)-3.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, నవంబర్ 4 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్షతేదీ:** జనవరి 12, 2020.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 4, 2019.
- **వెబ్‌సైట్:** www.isro.gov.in

## ఇండియన్ బ్యాంక్‌లో 115 పోస్టులు

ఇండియన్ బ్యాంక్ దేశవ్యాప్తంగా ఉన్న బ్రాంచుల్లో ఖాళీగా ఉన్న 115 సెక్యూరిటీ గార్డ్ కమ్ ప్యూన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. నేవీ/ఆర్మీ/ఎయిర్ ఫోర్స్‌కి చెందిన ఎక్స్-సర్వీస్‌మెన్లు ఈ పోస్టులకు అర్హులు.

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత, స్థానిక భాష, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- **వయసు:** 2019, జులై 1 నాటికి 18-26 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆబ్జెక్టివ్ టైప్ టెస్ట్, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 8, 2019.
- **వెబ్‌సైట్:** www.indianbank.in

## ఐకార్ నెట్-2019

పూసా (న్యూఢిల్లీ)లోని అగ్రికల్చరల్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏఎస్ఆర్‌బీ)..2019కి గాను ఐకార్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అగ్రికల్చరల్ యూనివర్సిటీల్లో, ఇతర అగ్రికల్చరల్ యూనివర్సిటీల్లో లెక్చరర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత లభిస్తుంది.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ /తత్సమాన ఉత్తీర్ణత.
- **వయసు:** 2019, జులై 1 నాటికి 21 ఏళ్లు మించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీ:** 2019, డిసెంబర్ 9 నుంచి 15 వరకు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000. (జనరల్-ఈడబ్ల్యూఎస్/ఓబీసీలకు రూ.500, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు రూ.250).
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 4, 2019.
- **వెబ్‌సైట్:** www.asrb.org.in

## ఎస్‌బీఐలో 67 పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)..67 స్పెషలిస్టు క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** మేనేజర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్, మేనేజర్ అనలిస్టు తదితర విభాగాల్లో ఖాళీలున్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, బీఈ/బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 2019, జులై 31 నాటికి 30-37 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** నవంబర్ 6, 2019.
- **వెబ్‌సైట్:** www.sbi.co.in

## సీడ్యాక్‌లో 82 ఖాళీలు

తిరువనంతపురం (కేరళ)లోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడ్యాక్) ఒప్పంద ప్రాతిపదికన 82 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-73, ప్రాజెక్ట్ అసిస్టెంట్-5, ప్రాజెక్ట్ టెక్నీషియన్-4.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 31, 2019
- **వెబ్‌సైట్:** www.cdac.in

---



జాబ్స్ అబ్రాడ్

# అమెరికా వీసా

**అమెరికా.. విదేశీ విద్యార్థులకు మరో ఝలక్ ఇచ్చింది. యూఎస్‌లో ఉన్నత విద్యకు వచ్చే అంతర్జాతీయ విద్యార్థులు పని అనుభవం పొందేందుకు వీలు కల్పించే ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) ప్రక్రియను మరింత జటిలం చేసింది. గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ తమ మేజర్ సబ్జెక్టుకు సంబంధించిన విభాగంలోనే ఓపీటీ చేస్తున్నట్లు సంబంధిత విద్యాసంస్థ అధికారులు ధ్రువీకరించాలని స్పష్టం చేసింది. ఆ మేరకు సెప్టెంబర్ 27న తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఓపీటీ కొత్త మార్గదర్శకాలు.. భారతీయ విద్యార్థులపై వాటి ప్రభావం గురించి తెలుసుకుందాం...**

## కోర్సుకు తగ్గ కొలువైతేనే...!

- లేకుంటే యూఎస్‌లో ఇబ్బందులు తప్పవు
- విదేశీ విద్యార్థులకు సరికొత్త నిబంధనలు
- కోర్సు సంబంధిత విభాగంలోనే ఓపీటీ చేయాలి
- ఆ మేరకు సదరు విద్యా సంస్థ ధృవీకరణ తప్పనిసరి
- 'జాబ్ టైటిల్' సరిగాలేకుంటే.. హెచ్ 1బీ వీసా తిరస్కరణకు ఆస్కారం

అమెరికాలో కొత్త ఓపీటీ నిబంధనలు విదేశీ విద్యార్థులకు చుక్కలు చూపడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆ దేశంలో వర్క్ వీసా పొందడం సంక్లిష్టంగా మారిందన్న అభిప్రాయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితిలో అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు విడుదల చేసిన నూతన మార్గదర్శకాలు విదేశీ విద్యార్థులకు వర్క్ వీసా ప్రక్రియను మరింత జటిలం చేశాయి. విదేశీ విద్యార్థులు అమెరికాలో ఉన్నత చదువులకు వెళ్లేందుకు ఎఫ్-1 వీసా పొందుతారు. చదువు పూర్తికాగానే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఓపీటీ) ప్రోగ్రాం ద్వారా ఒక ఏడాది పాటు వర్క్ ఎక్స్‌పీరియెన్స్ పొందే అవకాశం ఉంటుంది. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల విద్యార్థులకు ఓపీటీని మరో రెండేళ్లపాటు పొడిగించే వీలుంటుంది. తాజా నిబంధనలు స్టెమ్- ఓపీటీ ప్రోగ్రామ్ విద్యార్థులపైనే ఎక్కువగా ప్రభావం చూపే అవకాశముంది. ఎందుకంటే... స్టెమ్ ఓపీటీ విద్యార్థులు రెండేళ్ల పొడిగింపునకు దరఖాస్తు చేసుకునే సమయానికే ఉద్యోగంలో చేరి ఉంటారు. కాబట్టి కాలేజీ అధికారుల ధృవీకరణలో ఏదైనా తేడా వస్తే.. వీరు కష్టపడి సంపాదించుకున్న అవకాశం కోల్పోవాల్సి వస్తుంది. వర్క్ వీసా తిరస్కరణకు గురవుతుంది.

### కాలేజీ అధికారులకు బాధ్యత

విదేశీ విద్యార్థుల వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌ను లోతుగా పరిశీలించేలా ఇమ్మిగ్రేషన్ అధికారులు కొత్త మార్గదర్శకాలు విడుదల చేశారు. విద్యార్థులు కాలేజీలో మేజర్‌గా ఏ సబ్జెక్టులో పట్టా పొందారో... సదరు విభాగంలోనే పని చేస్తున్నట్లు నిరూపించుకోవాలంటూ.. విధానపరమైన గైడ్‌లైన్స్‌ను ప్రకటించారు. దాంతో ఓపీటీ ప్రోగ్రాంలో భాగంగా డిగ్రీలో చదివిన మేజర్ సబ్జెక్టుకు సంబంధించిన ఉద్యోగమే చేస్తున్నట్లు నిరూపించుకోవాల్సిన బాధ్యత విదేశీ విద్యార్థులపైనే పడింది. తాము చేస్తున్న ఓపీటీ తమ కోర్సుకు సంబంధించినదేనని సదరు విదేశీ విద్యార్థులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకోసం సరైన వివరణను సెవీస్(స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్-ఎస్ఈవీఐఎస్) వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థి ఇచ్చే ఈ వివరణను డిజిగ్నేటెడ్ స్కూల్ అఫిషియల్స్(డీఎస్‌వో) సమీక్షించి ధృవీకరించాలని కొత్తగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.



### సెవిస్

అమెరికాలో సూడెంట్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడూ నమోదు చేసే వెబ్‌సైట్.. సెవీస్(ఎస్ఈవీఐఎస్). ఇందులో పేర్కొనే సమాచారమే విద్యార్థి స్టేటస్ గురించి తెలుపుతుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం- విదేశీ విద్యార్థులు లేదా డీఎస్‌వోస్ సెవీస్‌లో వివరాలు నమోదు చేయాలి. ఒకవేళ సెవీస్‌లో స్టూడెంట్ నేరుగా వివరాలు నమోదు చేస్తే.. సదరు సమాచారాన్ని డీఎస్‌వోస్ ధృవీకరించాల్సి ఉంటుంది. అంతేకాకుండా సంబంధిత ధృవపత్రాలు విద్యార్థి నుంచి తీసుకొని.. స్టూడెంట్ రికార్డులో భద్రపరిచే బాధ్యత డీఎస్‌వోలదేనని ఇమ్మిగ్రేషన్ అధికారులు చెబుతున్నారు. ఒకసారి డీఎస్‌వో.. ఓపీటీ లేదా స్టెమ్- ఓపీటీకి సిఫార్సు చేస్తే.. సదరు విద్యార్థి బాధ్యత డీఎస్‌వోదే. ఓపీటీ ప్రోగ్రామ్‌కు ప్రతిపాదించిన విద్యార్థి వివరాలను ఎప్పటికప్పుడు సెవీస్‌లో అప్‌డేట్ అయ్యేట్లు చూడాల్సింది డీఎస్‌వోలేనని మార్గదర్శకాలలో పేర్కొన్నారు.

### భవిష్యత్తులో తిప్పలు తప్పవు!

సెవీస్‌లో ఇచ్చే వివరణ వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డీఎస్‌వో.. సెవీస్‌లో నమోదు చేసే జాబ్ టైటిల్ కారణంగా వర్క్‌వీసా హెచ్1బీ తిరస్కరణకు గురయ్యే ఆస్కారముందని చెబుతున్నారు. వాస్తవానికి ఓపీటీ పూర్తయ్యాక సదరు ఉద్యోగిని స్పాన్సర్ చేస్తూ హెచ్ 1బీ వీసా పొందేలా సంస్థలు సిఫారసు చేస్తాయి. అయితే డీఎస్‌వో.. సెవీస్‌లో నమోదు చేసే వివరాలు, కంపెనీ హెచ్1బీ వీసా దరఖాస్తులో పొందుపర్చే వివరాలు భిన్నంగా ఉంటే.. వర్క్‌వీసా తిరస్కరణకు గురవుతుంది. అంతేకాకుండా స్పెషాలిటీ ఆక్యుపేషన్‌గా లేని జాబ్ టైటిల్ పొందుపర్చినా.. వర్క్ వీసా పొందే అవకాశం ఉండదని చెబుతున్నారు.

### భారతీయులపై ప్రభావం

ప్రస్తుతం అమెరికాలో సుమారు 2 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో స్టెమ్ కోర్సులు చదువుతున్న వారి సంఖ్య అధికం. 2017 గణాంకాల ప్రకారం-దాదాపు 50వేల మంది భారతీయ విద్యార్థులు ఓపీటీ ప్రోగ్రాం చేస్తున్నట్లు అంచనా. తాజా నిర్ణయంతో వీరందరిపైన ప్రభావం పడే అవకాశం ఉంది. కొత్త మార్గదర్శకాల వల్ల అక్కడి విద్యాసంస్థలకు కూడా ఆర్థికంగా భారం తప్పదు!!

---

# ఎఫ్ఎంసీజీ, రిటైల్‌లో కొలువుల జోరు

**గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం పండగ సీజన్‌లో.. కన్జ్యూమర్ డ్యురబుల్స్/ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ డ్యురబుల్స్ (ఎఫ్ఎంసీజీ(5 శాతం), రిటైల్ (12 శాతం) రంగాల్లో సెప్టెంబర్ నెలలో టాలెంట్‌కు డిమాండ్ పెరిగిందని తాజా సర్వేలో వెల్లడైంది. దేశంలో దసరా, దీపావళి పండుగల కోలాహలం మొదలైనప్పటి నుంచి ఎఫ్ఎంసీజీ/డ్యురబుల్స్, రిటైల్ రంగాల్లో నియామకాలు జోరందుకున్నట్లు టైమ్స్‌జాబ్స్ రిక్రూట్‌ఎక్స్ తన నెలవారి నివేదికలో పేర్కొంది. జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌పై తాజా సర్వే వివరాలు...**

జాబ్ ట్రెండ్స్

- » పండుగల సీజన్‌లో పెరిగిన నియామకాలు
- » తాజా సర్వేలో వెల్లడి

ఆయా రంగాల్లో నియామకాలు గతేడాది 28 శాతం ఉండగా.. సెప్టెంబర్ 2019లో 29 శాతం మేర నమోదైనట్లు పేర్కొంది. రంగాల వారీగా చూసినప్పుడు-హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అత్యధికంగా 21శాతం టాలెంట్ డిమాండ్‌ను నమోదు చేసినట్లు తాజా సర్వే తెలిపింది. లక్నో, చండీగఢ్ వంటి టైర్-2 నగరాల్లో నియామక ప్రక్రియ గరిష్టంగా ఉన్నట్లు వెల్లడించింది. పండుగల సందర్భంగా మానవ వనరుల అవసరం ఎక్కువ ఉంటుంది. కాబట్టి రీటైల్/ఎఫ్ఎంసీజీల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. మరోవైపు ఆర్థిక మందగమనం కారణంగా ఐటీ, టెలికాం, బీఎఫ్ఎస్ఐ, బీపీఓ, ఐటీఈఎస్, ఆటోమొబైల్ లాంటి రంగాల్లో నియామకాల పరిస్థితి స్తబ్దుగా ఉంది. రాబోయే రోజుల్లో ఐటీ, టెలికాం, బీఎఫ్ఎస్ఐ, బీపీఓ, ఐటీఈఎస్, ఆటోమొబైల్ లాంటి రంగాల్లోనూ టాలెంట్‌కు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నట్లు అంచనా.



### హెల్త్‌కేర్ రికార్డు

- హెల్త్‌కేర్, డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, రిటైల్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లో టాలెంట్‌కు డిమాండ్ నెలకొన్నట్లు సర్వే పేర్కొంది.
- హెల్త్‌కేర్/ బయోటెక్నాలజీ/ఫార్మాస్యూటికల్-21శాతం, రిటైల్-12శాతం, ట్రావెల్, హాస్పిటాలిటీ-7శాతం వృద్ధిని నమోదు చేశాయి.

### లీగల్, లా

లీగల్, లా ప్రొఫెషన్స్ సైతం సెప్టెంబర్ నెలలో గరిష్ట వృద్ధిని సాధించాయి. హెల్త్‌కేర్ రంగంలో డాక్టర్లు/మెడికల్ ప్రొఫెషనల్స్ నియామకాలు అధికంగానే ఉన్నాయని సర్వే తెలిపింది. లీగల్/లా-30 శాతం; డాక్టర్స్/నర్సులు/మెడికల్ ప్రొఫెషనల్-29 శాతం; బయోటెక్నాలజీ /ఫార్మాస్యూటికల్/ఆర్ అండ్ డీల్లో-28 శాతం మేర నియామకాల్లో వృద్ధి నమోదైంది.

### టైర్-2 నగరాలు ముందు

ఆగస్టు, సెప్టెంబర్‌లో టైర్-2 నగరాలైన చండీగఢ్ -13శాతం, ఢిల్లీ-12శాతం, లక్నో-20శాతంగా హైరింగ్‌ను నమోదు చేశాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూర్ మినహా మిగతా మెట్రో నగారాలు అన్ని నియామకాల్లో వెనుకంజలో ఉండటం గమనార్హం.

### జూనియర్లకు పెరిగిన డిమాండ్

రెండు నుంచి ఐదు ఏళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులకు ఆయా రంగాల్లో డిమాండ్ పెరిగి 1శాతం వృద్ధిని నమోదు చేసింది. సీనియర్ మేనేజ్‌మెంట్(10-15ఏళ్ల అనుభవం), లీడర్‌షిప్ రోల్స్‌కు(20 ఏళ్ల అనుభవం) కలిగిన వారికి డిమాండ్ 4 నుంచి 3 శాతానికి తగ్గినట్లు సర్వేలో వెల్లడైంది.

---

# పొరపాట్లకు తావులేదు

- సీఏ విద్యార్థుల ఆందోళనపై కమిటీ
- కమిటీ నివేదిక తర్వాత చర్యలు
- ఐసీఏఐ సంస్కరణలు నిరంతర ప్రక్రియ
- సీఏలోనూ డిజిటల్ నైపుణ్యాల ఆవశ్యకత
- ఐసీఏఐ ప్రెసిడెంట్ ప్రఫుల్ల పి.ఛజేద్



గెస్ట్ కాలం

*చార్టర్డ్ అకౌంటెన్సీ.. కామర్స్ ప్రొఫెషనల్ కోర్సు. ఈ కోర్సుకు సంబంధించి గత 'మే' నెలలో నిర్వహించిన పరీక్షల ఫలితాలపై విద్యార్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జాతీయ స్థాయిలో నిరసనలు సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో సీఏ ఫలితాల విషయంలో విద్యార్థుల ఆందోళన, భవిష్యత్తులో చేపట్టనున్న సంస్కరణలపై ఐసీఏఐ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా) జాతీయ అధ్యక్షుడు ప్రఫుల్ల పి.ఛజేద్‌తో ఈ వారం గెస్ట్ కాలం..*

### కమిటీ నివేదిక ఆధారంగా

ఇన్‌స్టిట్యూట్ పరంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సీఏ పరీక్షల మూల్యాంకన జరుగుతోంది. అవసరమైతే విద్యార్థులు రీ-ఎవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకొని తమ సందేహాల్ని నివృత్తి చేసుకోవచ్చు. అయినా విద్యార్థుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని నిపుణుల కమిటీని నియమించాం. ఈ కమిటీ విద్యార్థుల డిమాండ్లపై సమీక్షించి త్వరలోనే నివేదిక ఇవ్వనుంది. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

### రీవాల్యుయేషన్‌కు చట్టంలో మార్పులు చేయాలి

ప్రస్తుతం రీ-ఎవాల్యుయేషన్ విధానంలో.. విద్యార్థులు రాసిన సమాధానాలకు మార్కులు వేశారో.. లేదో? సరైన మార్కులు వచ్చాయా.. లేదా?! అనే విషయం మాత్రమే తెలుసుకునే అవకాశం ఉందన్నది వాస్తవం. ఒక ప్రశ్న పత్రాన్ని పూర్తి స్థాయిలో పునర్ మూల్యాంకనం(సెకండ్ ఎవాల్యుయేషన్) చేయాలంటే.. సీఏ చట్టంలో ఇందుకు సంబంధించి మార్పులు తేవాల్సి ఉంటుంది. దీని గురించి కూడా ఆలోచిస్తున్నాం. ఇది విధాన పరంగా తీసుకోవాల్సిన నిర్ణయం.

### ఎంసీక్యూలు కోడింగ్ విధానం

మల్టిపుల్ ఛాయిస్ ఆధారిత ప్రశ్నలు ఉన్న పరీక్ష పేపర్ల ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనం కోసం డిజిటల్ విధానాన్ని అనుసరిస్తున్నాం. కోడింగ్ పద్ధతిలో ఇది జరుగుతోంది. కాబట్టి పొరపాట్లు జరిగే అవకాశం లేదు. అంతేకాకుండా అన్ని పేపర్లకు సంబంధించి మూల్యాంకన ప్రక్రియ సమయంలో ఎగ్జామినర్స్ సరిగా మూల్యాంకన చేస్తున్నారా? లేదా? అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నాం.

### 'ఉద్దేశపూర్వక ఫెయిల్'.. అపోహే

సీఏ ఫలితాల పరంగా మొత్తం ఉత్తీర్ణత శాతం 20 శాతంలోపే ఉంటోంది. ఇది చాలా ఏళ్లుగా మనం చూస్తున్నదే. కారణం.. సీఏ సిలబస్, పరీక్ష విధానాలే. అంతేతప్ప ఉద్దేశపూర్వకంగా విద్యార్థులను ఫెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు చేయడం సరికాదు. ఉద్దేశపూర్వక ఫెయిల్ అనేది అపోహ మాత్రమే. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తున్నారు. కాబట్టి విద్యార్థులు పరీక్ష సిలబస్, పరీక్ష విధానాలకు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లలో పట్టు సాధించేందుకు కృషి చేయాలి.

### సంస్కరణలు నిరంతర ప్రక్రియ

సీఏ ఇన్‌స్టిట్యూట్ తరచూ మార్పులు చేస్తోందని, దీనివల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందనే అభిప్రాయాలు సరికాదు. సీఏ కోర్సు అనేది వ్యాపార, వాణిజ్య రంగానికి సంబంధించింది. ప్రభుత్వ విధానాలు మారినప్పుడల్లా విద్యార్థులకు వాటిపై నైపుణ్యం లభించేలా మార్పులు చేస్తున్నాం. దీనివల్ల విద్యార్థులకే మేలు జరుగుతుంది. ఇక.. మూల్యాంకన పరంగా డిజిటల్ ఎవాల్యుయేషన్, కేంద్రీకృత మూల్యాంకన విధానం దిశగా అడుగులు వేస్తున్నాం. గతేడాది పలు సంస్కరణలు చేస్తూ ఐసీఏఐ తీర్మానం చేసింది. వాటిని సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

### తాజా పరిణామాలపై అవగాహన

సీఏ విద్యార్థులకు.. ఆయా చట్టాలు, విధానాలకు సంబంధించి తాజా పరిణామాలపై అవగాహన ఎంతో అవసరం. అప్పుడే వారికి రియల్ టైమ్ నాలెడ్జ్ లభిస్తుంది. ఇందుకోసం నిరంతరం ప్రభుత్వ విధానాలు, ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య రంగానికి సంబంధించిన మార్పులపై అవగాహన పెంచుకోవాలి.

### ఓరియెంటేషన్ ప్రోగ్రామ్స్

సీఏ వృత్తిలో స్థిరపడిన వారికి.. తాజా సంస్కరణలు, మార్కెట్ మార్పులపై అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తున్నాం. తద్వారా ఇప్పటికే ఈ ప్రొఫెషన్‌లో ఉన్న వారు తాజా పరిస్థితులపై అవగాహన పెంచుకోవచ్చు. ఫలితంగా క్లయింట్స్‌కు, తాము పని చేస్తున్న సంస్థలకు సమర్థవంతంగా సేవలందించే అవకాశం లభిస్తుంది. సీఏ మిడ్ కెరీర్ ప్రొఫెషనల్స్ అందరూ దీన్ని వినియోగించుకోవచ్చు.

### డిజిటల్ నైపుణ్యాల ఆవశ్యకత

చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ)లోనూ తాజాగా డిజిటల్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. ప్రధానంగా బ్లాక్‌చైన్, ఏఐ, ఆటోమేషన్, బిగ్ డేటా నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. అందుకే సీఏ ఇన్‌స్టిట్యూట్ కూడా శిక్షణ పరంగా వీటిని పొందుపరిచే అంశాన్ని పరిశీలిస్తోంది. దీనిద్వారా సీఏ విద్యార్థులు, ప్రాక్టీసింగ్ సీఏలకు అంతర్జాతీయంగా అమలవుతున్న విధానాలపై అవగాహన కలుగుతుంది.

### సీఏ విద్యార్థులకు సలహా

సీఏ విద్యార్థులు మార్కెట్ పరిణామాలను అర్థం చేసుకోవాలి. నిర్ణయాత్మక సామర్థ్యం పెంచుకుంటూ ముందుకు సాగాలి. ఇటీవల కాలంలో సంస్థలు అకౌంటింగ్ విభాగంలో సంప్రదాయ విధానాలతోపాటు, టెక్నాలజీని ప్రవేశపెడుతున్నాయి. అందుకుతగ్గట్టు సీఏలకు సదరు నైపుణ్యాలు ఉండాలని కోరుకుంటున్నాయి. సీఏ విద్యార్థులు దీన్ని గుర్తించి తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలి. సీఏ విభాగంలో రాణించేందుకు.. ఆసక్తి, సహనం ఎంతో అవసరం. జాబ్ మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కోర్సులో చేరాలనుకోవడం సరికాదు. నిజమైన ఆసక్తి ఉన్న వాళ్లే ఇందులో రాణించగలరు. అందుకే కోర్సులో చేరడానికి ముందే ఒకటికి, రెండుసార్లు వ్యక్తిగతంగా తమ ఆసక్తి, అభిరుచిని పరిశీలించుకోవాలి. ఆసక్తి లేకుండా చేరితే ఎంతో విలువైన సమయం వృథా అవుతుంది. ఇతర అవకాశాలూ కోల్పోయే ఆస్కారం ఉంటుంది!!


## సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...

- ఏపీలో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో.. ముందు నుంచే ప్రిపరేషన్ కావడం ఎలా..? అనే అంశంపై భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్, సీనియర్ ఫ్యాకల్టీ 'మాల్యాద్రి' గారిచే వీడియో గైడెన్స్ త్వరలో మీ సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌లో
- టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో... ముందు నుంచే ప్రిపరేషన్ కావడం ఎలా..? అనే అంశంపై సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్.మోజెస్ గారిచే వీడియో గైడెన్స్..

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
20-10-2019



రోహిత్ శర్మ (164 బంతుల్లో 117 బ్యాటింగ్; 14 ఫోర్లు, 4 సిక్సర్లు)

**వన్డేల్లో ఓపెనర్‌గా మారిన తర్వాత తన విశ్వరూప ప్రదర్శన కనబర్చిన రోహిత్ శర్మ ఇప్పుడు టెస్టుల్లోనూ ఆ అవకాశాన్ని అద్భుతంగా వాడుకుంటున్నాడు. మరోసారి తనదైన శైలిలో చెలరేగిన అతను రాంచీ టెస్టులోనూ సెంచరీతో మెరిశాడు. గావస్కర్ తర్వాత ఒకే సిరీస్‌లో మూడు శతకాలు బాదిన రెండో భారత ఓపెనర్‌గా నిలిచాడు. అతనికి అండగా నిలిచిన రహానే కూడా వంద పరుగుల మైలురాయికి చేరువయ్యాడు. ఫలితంగా మూడో టెస్టులోనూ మనదే శుభారంభం. మ్యాచ్ ఆరంభంలో పిచ్‌ను ఉపయోగించుకొని దక్షిణాఫ్రికా పేసర్లు భారత్‌ను 39/3కే కట్టడి చేసినా... రహానే, రోహిత్ భాగస్వామ్యం టీమిండియాను నడిపించింది. దాంతో సఫారీలకు మళ్లీ నిరాశ తప్పలేదు.**

# మళ్లీ రోహిట్...

**ఈ రోజూ వర్షమే!**

రాంచీ టెస్టుకు ఆదివారం కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం కనిపిస్తోంది. వాతావరణ శాఖ సూచన ప్రకారం నేడు కూడా వాన కురవనుంది. అయితే సోమవారంనుంచి మాత్రం ఎలాంటి సమస్య ఉండకపోవచ్చని తెలుస్తోంది.

## ఫాఫం ఫాఫ్!

**టా**స్‌తోనైనా తమ రాత మారుతుందని నమ్మిన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్‌కు మరోసారి కలిసి రాలేదు. టాస్ పిలుపు కోసం తనతో పాటు అతను 'ప్రాక్సీ'గా తెంబా బవుమాను తీసుకొచ్చాడు. అయితే అది కూడా పని చేయలేదు. బవుమా 'హెడ్స్' అనగా 'టెయిల్స్' అన్న కోహ్లి మళ్లీ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఆ సమయంలో బవుమాను చూసి భారత కెప్టెన్ నవ్వాపులేకపోయాడు. డు ప్లెసిస్ కూడా మాకు రాసి పెట్టి లేదంటూ ఒక జీవం లేని నవ్వు నవ్వాడు. దీంతో కలిపి ఉపఖండంలో దక్షిణాఫ్రికా వరుసగా పదో టెస్టులో టాస్ ఓడిపోయింది. వీటిలో 2015 సిరీస్‌లోని నాలుగు టెస్టులు, ఇప్పుడు మూడు కలిపి 7 మ్యాచ్‌ల్లో భారత్‌తో కాగా... శ్రీలంకతో 2, బంగ్లాదేశ్ చేతిలో ఒకసారి సఫారీలు టాస్ ఓడిపోయారు. దక్షిణాఫ్రికా తమ తుది జట్టులో ఏకంగా ఐదు మార్పులు చేసింది. గాయపడి దూరమైన కేశవ్ మహరాజ్, మార్క్‌రమ్‌లతో పాటు బ్రూయిన్, ముత్తుసామి, ఫిలాండర్‌లను తప్పించింది. వారి స్థానాల్లో జార్జ్ లిండే, క్లాసెన్ టెస్టుల్లో అరంగేట్రం చేయగా... ఇన్‌గిడి, పీట్, జుబేర్ హమ్జా జట్టులోకి వచ్చారు. క్లాసెన్‌కు కీపర్ బాధ్యతలు అప్పగించి డి కాక్‌ను స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్‌గా టీమ్ ఎంచుకుంది.



**1** ఓ టెస్టు సిరీస్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ ఘనత వహించాడు. ఈ సిరీస్‌లో రోహిత్ 17 సిక్స్‌లు కొట్టాడు. హెట్‌మైర్ (వెస్టిండీస్–2018–19 సిరీస్‌లో బంగ్లాదేశ్‌పై 15 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు.

**1** దక్షిణాఫ్రికాపై ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత క్రికెటర్‌గా రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. ప్రస్తుత సిరీస్‌లో ఇప్పటి వరకు రోహిత్ 434 పరుగులు చేశాడు. అజహరుద్దీన్ (1996–97 సిరీస్‌లో 388 పరుగులు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ సవరించాడు.

**2** సునీల్ గావస్కర్ తర్వాత ఓ సిరీస్‌లో మూడు సెంచరీలు చేసిన రెండో భారతీయ ఓపెనర్‌గా రోహిత్ గుర్తింపు పొందాడు. గావస్కర్ ఈ ఘనతను మూడుసార్లు చేశాడు.

**5** ప్రస్తుత సిరీస్‌లో భారత ఓపెనర్లు చేసిన సెంచరీలు. ఓ సిరీస్‌లో భారత ఓపెనర్లు ఐదు సెంచరీలు చేయడం ఇదే ప్రథమం. గతంలో వెస్టిండీస్‌పై (1970–71 సిరీస్‌లో విదేశీ గడ్డపై; 1978–89 సిరీస్‌లో స్వదేశంలో), శ్రీలంకపై (2009–10 సిరీస్‌లో) భారత ఓపెనర్లు అత్యధికంగా నాలుగు చొప్పున సెంచరీలు చేశారు.

**6** టెస్టు కెరీర్‌లో రోహిత్ శర్మ సెంచరీల సంఖ్య. ఈ ఆరు సెంచరీలు స్వదేశంలోనే రావడం విశేషం. మోమినుల్ హక్ (బంగ్లాదేశ్–8) తర్వాత విదేశాల్లో సెంచరీ చేయకుండా స్వదేశంలో ఎక్కువ సెంచరీలు చేసిన క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు.

**10** దక్షిణాఫ్రికా జట్టు వరుసగా పదో టెస్టులోనూ టాస్ ఓడిపోయింది. టాస్ ఓడిన గత తొమ్మిది టెస్టుల్లో దక్షిణాఫ్రికా ఏడింటిలో ఓడిపోయి, రెండింటిని 'డ్రా' చేసుకుంది.

**• సిరీస్‌లో మూడో సెంచరీ సాధించిన భారత ఓపెనర్**
**• రాంచీ టెస్టులో తొలి రోజు భారత్ 224/3**
**వర్షంతో 58 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం • శతకానికి చేరువలో రహానే**

**రాంచీ:** దక్షిణాఫ్రికాతో తొలి రెండు టెస్టుల తరహాలోనే మూడో మ్యాచ్‌లోనూ తొలి రోజు భారత్ పట్టు నిలబెట్టుకుంది. శనివారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 58 ఓవర్లలో 3 వికెట్లకు 224 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (164 బంతుల్లో 117 బ్యాటింగ్; 14 ఫోర్లు, 4 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించగా, అజింక్య రహానే (135 బంతుల్లో 83; 11 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నాడు. వీరిద్దరు ఇప్పటికే నాలుగో వికెట్‌కు అభేద్యంగా 185 పరుగులు జోడించారు. వర్షం, వెలుతురు లేమి కారణంగా టీ విరామం తర్వాత కొద్ది సేపటికే అంపైర్లు ఆటను నిలిపివేశారు. దాంతో మరో 32 ఓవర్ల ఆటను కోల్పోవాల్సి వచ్చింది.

### దక్షిణాఫ్రికా జోరు...

సిరీస్‌లో తొలిసారి భారత్‌పై దక్షిణాఫ్రికా జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. 16 ఓవర్ల లోపే 3 వికెట్లు తీసి దెబ్బ తీసింది. రబడ అద్భుతమైన బంతులతో చెలరేగగా, ఇన్‌గిడి కూడా టీమిండియా బ్యాట్స్‌మెన్‌పై ఒత్తిడి పెంచాడు. ఇదే జోరులో రబడ వేసిన బంతిని స్లిప్‌లోకి ఆడి మయాంక్ (10) వెనుదిరిగాడు. కొద్ది సేపటికి పుజారా (0)ను రబడ వికెట్ల ముందు దొరికించుకున్నాడు. అంపైర్ నాటౌట్‌గా ప్రకటించగా, దక్షిణాఫ్రికా రివ్యూ కోరి ఫలితం సాధించింది. నోర్జే ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన కోహ్లి (12) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. నోర్జే బౌలింగ్‌లోనే అతను ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. కోహ్లి రివ్యూ చేసినా లాభం లేకపోయింది.

### సూపర్ ఇన్నింగ్స్...

వన్డేల తరహాలోనే రోహిత్ తనదైన శైలిలో రెండు భిన్న పార్శ్వాల ఇన్నింగ్స్‌ను ప్రదర్శించాడు. ఆరంభంలో నిలదొక్కుకునే క్రమంలో అతను చాలా జాగ్రత్తగా ఆడాడు. పేసర్లకు పిచ్ సహకరిస్తుండటం, రబడ బంతిని చక్కగా స్వింగ్ చేస్తుండటంతో రోహిత్ ఎంతో పట్టుదల ప్రదర్శించాల్సి వచ్చింది. 7 పరుగుల వద్ద రబడ బౌలింగ్‌లో అంపైర్ ఎల్బీగా అవుట్ ఇచ్చినా... రివ్యూలో బ్యాట్‌కు బంతి తగిలినట్లు తేలడంతో రోహిత్ బతికిపోయాడు. 11 పరుగుల వద్ద కోహ్లితో సమన్వయ లోపంతో రనౌట్ ప్రమాదంలో పడినా, హమ్జా త్రో నేరుగా వికెట్లకు తాకకపోవడంతో అతనికి మరో అవకాశం దొరికింది. తొలి టెస్టు ఆడుతున్న లిండే తొలి ఓవర్లో రోహిత్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను షార్ట్‌లెగ్‌లో హమ్జా వదిలేశాడు. ఆ సమయంలో అతని స్కోరు 28. వీటన్నింటిని దాటుకుంటూ కొన్ని చక్కటి షాట్లు ఆడిన భారత ఓపెనర్ 86 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లంచ్ వరకు ఓపిగ్గా ఆడిన రోహిత్ ఆ తర్వాత



రహానే

చెలరేగిపోయాడు. ఒకదశలో ఎనిమిది బంతుల వ్యవధిలో నాలుగు బౌండరీలు బాదాడు. పీట్ వేసిన వరుస ఓవర్లో ఒక్కో సిక్సర్ బాది 90ల్లోకి చేరుకున్న అతను, లాంగాఫ్ మీదుగా మరో భారీ సిక్సర్ బాది 130 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హాఫ్ సెంచరీ తర్వాత శతకం అందుకునేందుకు రోహిత్‌కు 44 బంతులు మాత్రమే పట్టడం విశేషం. అతని కెరీర్‌లో ఇది ఆరో సెంచరీ.

### రహానే దూకుడు...

చాలా కాలం తర్వాత రహానే చూడచక్కని, దూకుడైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. రబడపై అతను ఎదురు దాడి చేసిన తీరు 2014 మెల్‌బోర్న్ టెస్టును (మిషెల్ జాన్సన్ బౌలింగ్‌లో) గుర్తుకు తెచ్చింది. లంచ్ తర్వాత రబడ వేసిన రెండో ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన రహానే బౌలర్ లయను దెబ్బ తీశాడు. ఆ తర్వాత రబడ మరో ఓవర్లో కూడా రెండు బౌండరీలు బాదాడు. మరో పేసర్ నోర్జేను కూడా అతను వదల్లేదు. ఇదే ఊపులో 70 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది. రహానే కెరీర్‌లో ఇది 21వ హాఫ్ సెంచరీ కాగా... స్వదేశంలో రహానే ఇంత వేగంగా ఎప్పుడూ అర్ధ సెంచరీ చేయలేదు. ఆ తర్వాత రబడ బౌలింగ్‌లోనే అతను కొట్టిన కవర్‌డ్రైవ్ ఫోర్ ఇన్నింగ్స్‌కే హైలైట్‌గా నిలిచింది.

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ (సి) ఎల్గర్ (బి) రబడ 10; రోహిత్ (బ్యాటింగ్) 117; పుజారా (ఎల్బీ) (బి) రబడ 0; కోహ్లి (ఎల్బీ) (బి) నోర్జే 12; రహానే (బ్యాటింగ్) 83; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (58 ఓవర్లలో 3 వికెట్లకు) 224. వికెట్ల పతనం:** 1–12, 2–16, 3–39. **బౌలింగ్:** రబడ 14–5–54–2, ఇన్‌గిడి 11–4–36–0, నోర్జే 16–3–50–1, లిండే 11–1–40–0, పీట్ 6–0–43–0.



టెస్టుల్లో అరంగేట్రం చేసిన 296వ భారత క్రికెటర్‌గా జార్ఖండ్ ప్లేయర్ షాబాజ్ నదీమ్ గుర్తింపు పొందాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు కెప్టెన్ కోహ్లి చేతుల మీదుగా నదీమ్ క్యాప్‌ను అందుకున్నాడు.

# వారెవ్వా వారియర్స్

**ప్రో కబడ్డీ లీగ్ విజేత బెంగాల్ • ఫైనల్లో దబంగ్ ఢిల్లీపై విజయం**



**అహ్మదాబాద్:** తొలి 6 నిమిషాల ఆటను చూస్తే దబంగ్ ఢిల్లీదే టైటిల్ అనుకున్నారు. అయితే అద్భుతమైన ఆటతీరుతో పుంజుకున్న బెంగాల్ వారియర్స్ సీజన్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న దబంగ్ ఢిల్లీకి షాక్ ఇస్తూ ప్రో కబడ్డీ లీగ్ టైటిల్‌ను తొలిసారి కైవసం చేసుకుంది. ఢిల్లీ రైడర్ నవీన్ కుమార్ 18 పాయింట్లతో జట్టు విజయం కోసం తుది వరకు చేసిన పోరాటం... బెంగాల్ సమష్టి ప్రదర్శన ముందు ఓడిపోయింది. దీంతో శనివారం జరిగిన టైటిల్ పోరులో బెంగాల్ వారియర్స్ 39–34తో దబంగ్ ఢిల్లీపై గెలిచింది. బెంగాల్ తరఫున నబీబక్ష్ (10 పాయింట్లు), సుకేశ్ హెగ్డే (8 పాయింట్లు), ట్యాక్లింగ్‌లో జీవన్ (4 పాయింట్లు) ప్రదర్శన జట్టుకు టైటిల్‌ను ఖాయం చేసింది. సీజన్ మొత్తం అద్భుతంగా రాణిస్తూ వచ్చిన ఢిల్లీ జట్టు తుది మెట్టుపై బోల్తా పడింది. ఆరంభంలో అద్భుతంగా ఆడి 11–3తో ఆధిక్యం లోకెళ్లింది. అయితే ఇక్కడి నుంచి అనూహ్యంగా గాడి తప్పిన ఆ జట్టు మళ్లీ కోలుకోలేకపోయింది. బెంగాల్ స్టార్ రైడర్ మణీందర్ సింగ్ గాయం కారణంగా ఫైనల్ బరిలో దిగలేదు. దీంతో రైడింగ్ భారాన్ని సుకేశ్, నబీబక్ష్ మోశారు. తొలుత తడబడి పుంజుకున్న వీరు ప్రత్యర్థిని ఆలౌట్‌చేసి విరామానికి స్కోర్‌ను 17–17తో సమం చేశారు. రెండో అర్ధభాగంలో మరింతగా చెలరేగిన బెంగాల్ ప్రత్యర్థిని మరో రెండు సార్లు ఆలౌట్ చేసి కబడ్డీ కింగ్‌గా నిలిచింది. విజేత బెంగాల్ వారియర్స్ జట్టుకు రూ. 3 కోట్లు... రన్నరప్ ఢిల్లీ జట్టుకు రూ. కోటీ 80 లక్షలు ప్రైజ్‌మనీగా లభించాయి.

**తడబడుతూ ఆరంభించారు. ఒక్కో పాయింట్ సాధిస్తూ ప్రత్యర్థిని సమీపించారు. అదే జోరులో ప్రత్యర్థిని అధిగమించి ప్రో కబడ్డీ లీగ్ ఏడో సీజన్ టైటిల్‌ను ముద్దాడారు. ఇదీ క్లుప్తంగా బెంగాల్ వారియర్స్ ఫైనల్ ఆటతీరు. ఆటను దూకుడుగా ఆరంభించిన ఢిల్లీ మ్యాచ్ కొనసాగుతున్నకొద్దీ పట్టు వదలడంతో చివరకు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది.**

## వరుణ్‌కు స్వర్ణం

**బోధ్ గయా (బిహార్):** జాతీయ యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ రాగాల వరుణ్ మెరిశాడు. శనివారం జరిగిన జూనియర్ పురుషుల 73 కేజీల విభాగంలో వరుణ్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. వరుణ్ మొత్తం 272 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు.

## రన్నరప్ భారత్

**జొహర్ బారు (మలేసియా):** మ్యాచ్ ముగియడానికి మరో 40 సెకన్లు ఉన్నాయనగా... గోల్ సమర్పించుకొని భారత జూనియర్ పురుషుల జట్టు మూల్యం చెల్లించుకుంది. సుల్తాన్ జొహర్ కప్ అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. బ్రిటన్‌తో శనివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 1–2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. 49వ నిమిషంలో గురుసాహిబ్జిత్ సింగ్ గోల్‌తో భారత్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే తర్వాతి నిమిషంలోనే స్టువర్ట్ రష్మిరె గోల్‌తో బ్రిటన్ స్కోరును 1–1తో సమం చేసింది. ఇక మ్యాచ్ ముగియడానికి 40 సెకన్లు ఉన్నాయనగా... స్టువర్ట్ రష్మిరె రెండో గోల్ చేసి బ్రిటన్‌కు టైటిల్ అందించాడు.

### అమిత్ శుభారంభం

**వుహాన్:** ప్రపంచ మిలిటరీ క్రీడల్లో భారత స్టార్ బాక్సర్ అమిత్ పంఘాల్ శుభారంభం చేశాడు. 52 కేజీల విభాగం తొలి రౌండ్‌లో అమిత్ 4–1తో డగ్లస్ ఆండ్రాడే (బ్రెజిల్)పై విజయం సాధించాడు. 56 కేజీల విభాగంలో చిరాగ్ 5–0తో కటాంగ (జాంబియా)పై నెగ్గగా... 49 కేజీల విభాగంలో దీపక్‌కు తన ప్రత్యర్థి అబ్బాస్‌జాదె అలీ (ఇరాన్) నుంచి వాకోవర్ లభించింది. సందీప్ (64 కేజీలు), అమన్ (60 కేజీలు), హర్ష్ లాక్రా (81 కేజీలు) తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు.



**బీఎఫ్ఐ ఆదేశిస్తే...**

# నిఖత్‌తో బౌట్‌కు సిద్ధమే

**భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ప్రకటన**

**న్యూఢిల్లీ:** 'నిఖత్ జరీన్‌తో తలపడేందుకు నాకెలాంటి భయం లేదు' అని భారత దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ప్రకటించింది. 'భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఆదేశిస్తే... ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం నిర్వహించే సెలక్షన్ ట్రయల్స్ బౌట్‌లో నిఖత్‌ను ఓడించి లాంఛనం పూర్తి చేస్తాను' అని రికార్డుస్థాయిలో ఎనిమిదిసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన ఈ మణిపూర్ బాక్సర్ స్పష్టం చేసింది. శనివారం ఓ సన్మాన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మేరీకోమ్ తాజా వివాదంపై స్పందించింది. 'బీఎఫ్ఐ తీసుకున్న నిర్ణయాన్ని, నిబంధనలను నేను మార్చలేను. పోటీపడటమే నాకు తెలుసు. బీఎఫ్ఐ తీసుకున్న నిర్ణయాన్ని శిరసావహిస్తాను. వారు నిఖత్‌తో ట్రయల్స్ బౌట్‌లో తలపడాలని ఆదేశిస్తే తప్పకుండా పోటీపడతాను' అని 36 ఏళ్ల మేరీకోమ్ తెలిపింది. 'గతంలో నేను చాలా సార్లు నిఖత్‌ను ఓడించాను. ఎందుకోగానీ ఆమె పదేపదే నన్ను సవాలు చేస్తోంది. ఇందులో అర్థం లేదు. ఆమెను ఓడించడం లాంఛనం మాత్రమే. ఒలింపిక్స్‌లో పతకం ఎవరు సాధించగలరో బీఎఫ్ఐకు తెలుసు. కొందరికి మాత్రం నేనంటే చాలా అసూయ' అని 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన మేరీకోమ్ పేర్కొంది. 'నిఖత్ జరీన్‌కు నేను వ్యతిరేకం కాదు. భవిష్యత్‌లో ఆమె మంచి ఫలితాలు సాధించొచ్చు. మరింత అనుభవం పెంచుకునేందుకు... తన ఆటతీరును ఇంకా ఎలా మెరుగుపర్చుకోవాలనే అంశంపై ఆమె దృష్టి పెట్టాలి. నేను 20 ఏళ్లుగా పోటీపడుతున్నాను. సవాల్ చేయడం చాలా సులువు. అయితే ఫలితాలు సాధించడం కష్టం' అని మేరీకోమ్ వ్యాఖ్యానించింది.

### బింద్రా... నీ పని చూస్కో!

నిఖత్‌కు మద్దతుగా మాట్లాడిన భారత స్టార్ షూటర్ అభినవ్ బింద్రాపై మేరీకోమ్ అసహనం వ్యక్తం చేసింది. బాక్సింగ్ వ్యవహారాల్లో బింద్రా జోక్యం చేసుకోకూడదని... అతనికి ఈ ఆట గురించి తెలియదని... షూటింగ్ క్రీడాంశంపై దృష్టి పెడితే బాగుంటుందని హితవు పలికింది. నిఖత్ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారో తనకు తెలుసని... ఈ రాద్ధాంతం అంతా నిఖత్‌కు స్పాన్సర్‌గా ఉన్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ చేయిస్తోందని, ఈ సంస్థతో బింద్రా ముడిపడి ఉండటం కూడా ఒక కారణమని ఆమె విమర్శించింది.

### పింకీ జాంగ్రా కూడా...

మేరీకోమ్ కోసం నిబంధనలు మార్చడం సరైన పద్ధతి కాదని... ట్రయల్స్ నిర్వహించి అందులో గెలిచిన వారిని భారత జట్టులోకి ఎంపిక చేయాలని మేరీకోమ్, నిఖత్‌లతోపాటు 51 కేజీల విభాగంలోనే పోటీపడే మరో భారత బాక్సర్ పింకీ జాంగ్రా కోరింది.

# ఐఎస్ఎల్‌కు వేళాయెరా...

**• నేటి నుంచి ఇండియన్ సూపర్ లీగ్**
**• తొలిసారి హైదరాబాద్ జట్టు బరిలోకి**

**కొచ్చి:** ఐదు నెలల పాటు భారత ఫుట్‌బాల్ అభిమానులను అలరించడానికి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) వచ్చేసింది. నేడు కేరళ బ్లాస్టర్స్, అట్లెటికో డి కోల్‌కతా మ్యాచ్‌తో ఆరో సీజన్‌కు తెరలేవనుంది. టైటిల్ కోసం మొత్తం 10 జట్లు పోటీ పడుతుండగా... హాట్ ఫేవరెట్లుగా డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీ, రెండు సార్లు రన్నరప్ గోవా ఎఫ్‌సీలు బరిలో దిగనున్నాయి. ఆర్థిక కారణాలతో వైదొలిగిన పుణే ఎఫ్‌సీ జట్టు స్థానంలో హైదరాబాద్ ఎఫ్‌సీ, ఢిల్లీ డైనమోస్ స్థానంలో ఒడిశా ఎఫ్‌సీలు గ్రాండ్ ఎంట్రీ



ఇవ్వనున్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ లీగ్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. సెమీస్ మ్యాచ్‌లు ఇంటా, బయట పద్ధతిలో జరుగుతాయి. రెండు మ్యాచ్‌ల అనంతరం విజేతగా నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్ షెడ్యూల్‌ను ఇంకా అధికారికంగా ప్రకటించాలి. మార్చి 8న ఫైనల్ జరిగే అవకాశం ఉంది. లీగ్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి బెంగళూరు తరఫున బరిలో ఉన్నాడు. ఇతనితో పాటు స్పెయిన్‌కు చెందిన కొరొమినస్, ఇయాన్ హ్యూమ్, మార్సెలినో వంటి విదేశీ సూపర్ స్టార్లు బరిలో ఉన్నారు. ఆరంభ మ్యాచ్‌కు ముందు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో బాలీవుడ్ స్టార్లు టైగర్ ష్రాఫ్, దిశా పటానీ సందడి చేయనున్నారు.

# గ్రహోపగ్రహాల్లో పంట పండుద్దా!!

పెరుగుతోన్న ప్రపంచ జనాభాకు సరిపడా ఆహారపదార్థాలను పండించేందుకు ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు, పరిశోధనలు అవసరమవుతాయి. ఆ ప్రయత్నాల్లో భాగంగానే భూమిపైనే కాకుండా జాబిల్లి, అంగారకుడిపై పంటలు పండించేందుకు ప్రయోగాలు చేస్తున్నారు



శాస్త్రవేత్తలు. మరి వీరి ప్రయత్నం ఫలించిందా అంటే అవుననే అంటున్నారు నెదర్లాండ్స్‌లోని వాగెనిగన్ యూనివర్సిటీ పరిశోధకులు. ఆ గ్రహ, ఉపగ్రహాల్లో ఉన్న మట్టిని పోలిన మట్టిని శాస్త్రవేత్తలు తయారు చేసి ఆ మట్టిలో చిక్కుళ్లు, కినోవాతోపాటు మరో ఏడు పంటల ప్రయోగం చేశారు. ఈ ప్రయోగాల్లో జాబిల్లి కంటే అంగారకుడిని పోలిన మట్టిలో పండించిన పంటలు మెరుగైన ఫలితాలిచ్చాయి. కృత్రిమ మట్టికి కొంత సేంద్రియ పదార్థాలను జతచేసి చందమామ, అంగారకుడిలో ఉన్న మట్టిని పోలిన మట్టిని తయారు చేశారు. ఆ మట్టిలో తొలుత టమాటా, ఆవాలు, కినోవా, పాలకూర, చిక్కుళ్ల వంటి పది పంటలు సాగు చేశారు. పాలకూర మినహా మిగిలినవి మంచి ఫలితాలివ్వగా, కొన్ని పంటల నుంచి రెండో పంటకు అవసరమైన విత్తనాలను కూడా సేకరించగలిగామని వాగెనిగన్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్త వైగర్ వేమెలింక్ తెలిపారు. ఈ ప్రయోగాలు కొన్నేళ్లుగా జరుగుతున్నప్పటికీ ఓపెన్ అగ్రికల్చర్ జర్నల్‌లో ఈ ప్రయోగం వివరాలు ప్రచురితమయ్యాయి. అంగారకుడిని పోలిన మట్టి తయారు చేసేందుకు వైకింగ్ లాండర్, పాథ్ ఫైండర్ రోవర్ల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా హవాయిలోని అగ్నిపర్వత ప్రాంతం నుంచి పదార్థాలను సేకరించినట్లు పరిశోధకులు తెలిపారు. అయితే మరికొన్ని ఇతర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే గ్రహోపగ్రహాలపై పూర్తిస్థాయి సాగు అవకాశాలను నిర్ధారించుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

# చక్కెరవ్యాధికి చక్కటి ఉపాయం

చక్కెరవ్యాధిని నియంత్రణలో ఉంచేందుకు చక్కటి ఉపాయం చెబుతున్నారు బాత్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. అదే..ఉపాహారాన్ని (టిఫిన్) వ్యాయామం తర్వాత చేయడం. వ్యాయామం చేసిన



తర్వాతే టిఫిన్ చేయడం ద్వారా మధుమేహాన్ని నియంత్రణలో ఉంచవచ్చంటున్నారు. కొంతమంది ఊబకాయులపై ఆరువారాలపాటు చేసిన ఓ పరిశోధన ద్వారా ఈ విషయం వెల్లడైంది. ఈ పరిశోధనలో ఉపాహారాన్ని వ్యాయామానికి ముందు తీసుకునే వారిని ఓ వర్గంగాను, ఏరకమైన జీవన శైలి మార్పులు చేయని వారిని, వ్యాయామం తర్వాతే టిఫిన్ చేసేవారిని మరో వర్గంగాను చేసి వీరిపై అధ్యయనం చేశారు. టిఫిన్‌కంటే ముందుగా వ్యాయామం చేసే వాళ్లు రెండో వర్గం వారికంటే రెట్టింపు మొత్తంలో కేలరీలను కరిగించినట్లు తెలిసింది. రక్తంలో ఇన్సులిన్ మోతాదులు తక్కువగా ఉండటం వల్లే ఎక్కువకొవ్వు కరిగిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 6 వారాల తర్వాత వీరిలో ఇన్సులిన్ నిరోధకత పెరగడంతోపాటు రక్తంలో గ్లూకోజ్ మోతాదులు నియంత్రణలో ఉన్నాయని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త జేవియర్ గోంజాల్వెజ్ తెలిపారు. మహిళలు కూడా ఉన్న బృందంతో మరోసారి పరిశోధన చేయడం ద్వారా ఫలితాలను ధ్రువీకరిస్తామని ఆయన చెప్పారు.

# బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్

**అధికారులకు అందజేసిన మంత్రి ఇంద్రకరణ్**

**సాక్షి, హైదరాబాద్:** ఎకో టూరిజం పేరుతో హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకుగాను కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో 9001–2015 సర్టిఫికెట్ లభించింది. దీంతో రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల శివార్లలోని అటవీ భూములను అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా మలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పార్కుల్లో ఒకదానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లయింది. ఒక పార్కుకు ఐఎస్‌వో సర్టిఫికెట్ రావడం దేశంలోనే మొదటిసారి. శనివారం బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ రఘువీర్, ఇతర అధికారులు ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అటవీ శాఖ అర్బన్ ఫారెస్ట్ పార్కులను తీర్చిదిద్దుతోందని, బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్ రావడానికి కృషి చేసిన ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి ఇంద్రకరణ్ అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో బొటానికల్ గార్డెన్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని, సందర్శకులు, వాకర్స్‌కు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ఫారెస్ట్ కార్పొరేషన్ వీసీ, ఎండీ రఘువీర్, హెచ్‌వైయం సీఈవో అలపాటి శివయ్య పాల్గొన్నారు.



బోటులో షికారు చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- యూపీలో సంచలనం సృష్టించిన హిందూ సమాజ్ పార్టీ చీఫ్ కామ్లేశ్ తివారీ హత్య కేసులో పోలీసులు అయిదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో ముగ్గురిని గుజరాత్‌లో, మరో ఇద్దరిని ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్‌చేశారు.







## ఈఎస్ఐ స్కాం నిందితురాలు ఆత్మహత్యాయత్నం

**ఉస్మానియా ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం**



పద్మ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఈఎస్ఐ ఆస్పత్రి ఔషధాల కుంభకోణం నిందితురాలు పద్మ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఈఎస్ఐ సంయుక్త సంచాలకురాలుగా విధులు నిర్వర్తిస్తోన్న పద్మను ఔషధాల కుంభకోణం కేసులో ఇటీవల ఏసీబీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పద్మ శనివారం సాయంత్రం చికిత్స కోసం ఇచ్చిన మాత్రలను పెద్ద మోతాదులో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. దీన్ని గమనించిన జైలు సిబ్బంది వెంటనే ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందించిన వైద్యులు ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెప్పారు.

# ‘స్ట్రయివ్’ కార్యాచరణ సిద్ధం

- రాష్ట్రంలో 12 ఐటీఐలలో అమలు
- కేంద్ర ప్రభుత్వానికి కార్యాచరణ ప్రతులను పంపిన రాష్ట్రం

**సాక్షి, హైదరాబాద్:** ఐటీఐలను మరింత ఆధునీకరించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్ట్రయివ్ (స్కిల్స్ స్ట్రెన్తెనింగ్ ఫర్ ఇండస్ట్రియల్ వ్యాల్యూ ఎన్‌హాన్స్‌మెంట్) కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ విభాగం కార్యాచరణ సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అమల్లోకి తెచ్చిన స్ట్రయివ్ కార్యక్రమానికి రాష్ట్రంలో 12 ఐటీఐలు ఎంపికయ్యాయి. పూర్తిగా కేంద్రం నిధులతో ఈ కార్యక్రమం అమలు కానుంది. ఒక్కో ఐటీఐకి కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా రూ.2.5 కోట్లు విడుదల చేస్తుండగా.. నిర్దేశిత కార్యాచరణకు అనుగుణంగా వాటిని ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర కార్మిక శిక్షణ, ఉపాధి కల్పన శాఖను ఆదేశించింది. దీంతో ఆ శాఖ ఐటీఐల వారీగా ప్రత్యేక కార్యాచరణకు రూపకల్పన చేపట్టి 12 రకాల ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. వీటికి ఆమోదం తెలిపిన కేంద్రం ఒక్కో ఐటీఐకి రూ.2.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది.

**నిధుల వినియోగం ఇలా...**

ఈ నిధులతో మౌలిక వసతులు, కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి యంత్ర సామగ్రి కొనుగోలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు వినియోగించుకోవచ్చు. ఐటీఐల గ్రేడింగ్ మరింత పెరిగేలా శిక్షణ కార్యక్రమాలు చేపట్టవచ్చు. ఆ ఐటీఐల్లో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు స్థానికంగా, సమీపంలో ఉన్న పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకోవడం, నిపుణులను తయారు చేసి పంపడంతోపాటు వివిధ పరిశ్రమలను ఆహ్వానించి క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించాలి. పరిశ్రమల్లో ఐటీఐలకు డిమాండ్ ఉండటం, రాష్ట్రంలో అధిక సంఖ్యలో పరిశ్రమలుండటంతో నిర్దేశిత లక్ష్యాల సాధనకు ఇబ్బందులు ఉండవు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.